సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 72

శనివారం 3-6-2023



'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శనివారం ॥ 3-6-2023

పేదరికాన్ని ఓల్డ్‌సిటీ చూపించింది.
దాతృత్వాన్ని నాన్న వైద్యం నేర్పించింది.
ఆరోగ్య భద్రతా లేమిని ఆదివాసీ జీవనం తెలిపింది.
అందంగా జీవించడాన్ని బాల్య స్నేహం చెప్పింది.
కొండంత సాహసాన్ని తనకు తానే చేసింది.
డాక్టర్ శోభాదేవి రాసుకున్న రికార్డుల జాబితా ఇది.


అవార్డులతో...


ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ దగ్గర శోభాదేవి

ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ @ 68

''నేను జర్నలిస్ట్‌ని కావాలనుకున్నాను. మా నాన్న నన్ను డాక్టర్‌ని చేయాలనుకున్నారు. ఆయన మాటే నెగ్గింది. కానీ నా అచీవ్‌మెంట్స్‌తో తరచూ జర్నల్స్‌లో కనిపిస్తూ ఉండటం ద్వారా నేను సంతోషిస్తున్నాను'' అన్నారు డాక్టర్ శోభాదేవి. హైదరాబాద్, హిమాయత్ నగర్‌లో పుట్టి పెరిగి, వెస్ట్ మారేడ్‌పల్లిలో స్థిరపడిన శోభాదేవి ఒక గ్లోబల్ పర్సనాలిటీ. డయాబెటిస్ అండ్ ఒబేసిటీ స్పెషలిస్ట్‌గా ఆమె పదికి పైగా దేశాల్లో సెమినార్‌లలో పాల్గొని అధ్యయనాల పేపర్‌లు సమర్పించారు. కోవిడ్ సమయంలో రోజుకు పద్దెనిమిది గంటల సేపు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటూ సేవలందించిన ఈ డాక్టర్ తన పేషెంట్లను హాస్పిటల్ గడప తొక్కనివ్వకుండా ఆరోగ్యవంతులను చేశారు. అందుకు ప్రతిగా ఆమె డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డుకు ముందు ఆ తర్వాత దేశవిదేశాల్లో ఆమె అందుకున్న పురస్కారాల సంఖ్య వందకు పైగానే. వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఆమె ఇంట్లో రెండు గదులు మెమెంటోలతో నిండిపోయి ఉన్నాయి. ఈ ఏడాది మే నెలలో ఎవరెస్ట్ బేస్ క్యాంపు 8కె చేరుకుని మరో రికార్డు సృష్టించుకున్నారు. అది బేస్ క్యాంపుకు చేరిన రికార్డు మాత్రమే కాదు. 68వ ఏట ఎవరెస్ట్ బేస్ క్యాంపును అధిరోహించడం, మిసెస్ ఇండియా విజేత, అందాల పోటీ కిరీటధారి ఎవరెస్ట్‌ను అధిరోహించడం కూడా రికార్డులే. ప్రతి రోజునూ స్ఫూర్తిదాయకంగా మలుచుకోవడం ఒక కళ. ఆ కళ ఆమె చేతిలో ఉంది. ఇలాంటి సాహసాలు, సరదాలతోపాటు నల్లమల, భద్రాచలం, ఆసిఫాబాద్ జిల్లాల్లో నివసించే ఆదివాసీలకు ఆరోగ్య చైతన్యం కలిగించడం ఆమెలో మరో కోణం. 'ఒక డాక్టర్‌గా తన వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తించడానికి ఎప్పుడూ ముందుంను. అది తండ్రి నేర్పిన విలువల నుంచి గ్రహించిన జీవితసారం' అన్నారామె. వైవిధ్యభరితమైన తన జీవితప్రస్థానాన్ని సాక్షితో పంచుకున్నారు డాక్టర్ శోభాదేవి.

నాన్న నేర్పిన విలువలు

''మా నాన్న అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంట్‌లో జాయింట్ డైరెక్టర్‌గా పని చేశారు. అమ్మ రోజరీ కాన్వెంట్ స్కూల్లో టీచర్. అలా నేను అదే స్కూల్లో చదివాను. నాన్న ఆసక్తి కొద్దీ హోమియోవైద్యం కోర్సు చేసి ఉచితంగా వైద్యం చేసేవారు. నన్ను మెడిసిన్ చదివించడం కూడా నాన్న ఇష్టమే. ఎంబీబీఎస్ ఎంట్రన్స్‌లో నాకు బాలికల కేటగిరీలో రెండవ ర్యాంకు, జనరల్ కేటగిరీలో ఎనిమిదవ ర్యాంకు వచ్చింది. ఉస్మానియాలో ఎంబీబీఎస్ తర్వాత అన్నామలై యూనివర్సిటీ నుంచి డయాబెటిస్‌లో పీజీ, యూకేలో ఒబేసిటీలో కోర్సు చేసి అక్కడ దాదాపు ఇరవై ఏళ్లు పని చేశాను. నాన్న కోసం తిరిగి ఇండియా వచ్చేసి హైదరాబాద్‌లో గవర్నమెంట్ ఉద్యోగంలో చేరాను. ఓల్డ్‌సిటీలో అడిగి మరీ పోస్టింగ్ వేయించుకున్నాను. పేదరికం ఎంత దారుణంగా ఉంటుందో కళ్లారా చూశాను. పేషెంట్‌లకు చాయ్, బన్నుకు డబ్బిచ్చి తినేసి రండి మందులు రాసిస్తా నని పంపేదాన్ని.

'భగవంతుడు మనల్ని చాలామంది కంటే మెరుగైన స్థానంలో ఉంచాడు. భగవంతుడిచ్చింది అంతా మన కోసమే కాదు, ఆకలితో ఉన్న వాళ్ల కోసం పని చేయాల్సిన బాధ్యతను కూడా ఇచ్చి ఈ భూమ్మీదకు పంపాడు. సమాజానికి తిరిగి మన వంతు బాధ్యతను నిర్వర్తించాలి' అని నాన్న ఎప్పుడూ చెప్పే మాట తరచూ గుర్తు వచ్చేది. ఆ ప్రభావంతోనే అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలకు వెళ్లి వాళ్లకు సహాయం చేయడం చిన్నప్పుడే అలవాటైంది.

ఆదివాసీల జీవనశైలి గురించి నాకు తెలిసింది బాగా పెద్దయిన తర్వాత మాత్రమే. అడవిలో నివసిస్తూ అక్కడ దొరికే ఆహారం తింటూ కడుపు నింపుకోవడమే వాళ్లకు తెలిసింది. సమతుల ఆహారం అంటే ఏమిటో తెలియదు. సీజన్‌లో వచ్చే జ్వరాల గురించి అవగాహన కూడా తక్కువే. వాళ్లకు ఆహారం గురించి ఆరోగ్యం చైతన్యవంతం చేయడంతోపాటు ఎసెన్షియల్ ఫుడ్ పౌడర్‌లు, వంటపాత్రలు, దుప్పట్లు ఇవ్వడం మొదలు పెట్టాం. అన్ని రకాల కాయగూరలను పండించుకోవడంలో శిక్షణ ఇచ్చాం. మనిషి జీవితంలో ఆహారం, ఆరోగ్యం ప్రధాన భూమిక పోషిస్తాయనే అవగాహన కల్పించగలిగాను.

పర్వతం పెద్ద చాలెంజ్

ఎవరెస్ట్ బేస్‌క్యాంప్ ఆరోహణ ఆలోచన మెడిసిన్ క్లాస్‌మేట్స్‌తో న్యూజిలాండ్ టూర్‌లో వచ్చింది. అక్కడ గ్లేసియర్‌లు, ట్రెకింగ్ జోన్‌లు చూసినప్పుడు ఇదేపని మన దగ్గర ఎందుకు చేయకూడదు అనుకున్నాం. కానీ మన దగ్గర పర్వతారోహణ శిక్షణ కేంద్రాలుండవు. జిమ్, కేబీఆర్ పార్క్, సిటీలో క్రాస్ ఓవర్ బ్రిడ్జిలు, కర్నాటకలో నందిహిల్స్ నా శిక్షణ కేంద్రాలయ్యాయి. ఎవరెస్ట్ కోసం సిద్ధమవుతున్న సమయంలో ప్రపంచాన్ని కోవిడ్ కుదిపేసింది. డాక్టర్‌గా నా వృత్తికి నూటికి నూరుశాతం సేవలందించాల్సిన సమయం అది. నా పేషెంట్‌ల నంబర్ రానుకోలేదు కానీ పేషెంట్‌లకు మందులు, ఇతర జాగ్రత్తలు, ధైర్యం చెబుతూ కౌన్సెలింగ్‌లో రోజూ తెల్లవారు జామున రెండు– మూడు గంటల వరకు ఆన్‌లైన్‌లో టచ్‌లో ఉండేదాన్ని. ఆ తర్వాత నాకూ కోవిడ్ వచ్చింది, తగ్గింది. కానీ వెన్ను పట్టేయడం, ఫ్రోజన్ షోల్డర్ వంటి పోస్ట్ కోవిడ్ లక్షణాలు బాధించాయి. వాటన్నింటినీ చాలెంజ్‌గా తీసుకుని బయటపడి పర్వతారోహణ చేశాను. మేనెల ఆరవ తేదీ హైదరాబాద్ నుంచి బయలేరి ఖాట్మండూకు వెళ్లాను. ఎనిమిదో తేదీన 'లుక్లా' నుంచి నడక మొదలు పెట్టి 15వ తేదీకి బేస్ క్యాంపులో ఎత్తైన శిఖరం '8కె'కి చేరాను. ఈ ట్రిప్‌లో నేను పర్వతారోహకులకు మార్గాన్ని సుగమం చేసే షెర్పాల దయనీయమైన జీవితాన్ని దగ్గరగా చూశాను. ప్రాణాలను పణంగా పెట్టి ఈ పనులు చేస్తుంటారు వాళ్లు.


షెర్పాలతో శోభాదేవి

బాల్య స్నేహితురాలి చొరవ

బ్యూటీ పాజంట్ అవతారం ఎత్తడానికి కారణం నా స్కూల్ ఫ్రెండ్ రేణుక. మా అబ్బాయిలిద్దరూ యూఎస్‌లో సెటిలయ్యారు. మా వారు 2015లో మాకు దూరమయ్యారు. ఇంత ఇంట్లో నేనొక్కర్తినే, ఎప్పుడూ ఏదో ఒక పనిలో నన్ను నేను నిమగ్నం చేసుకుంటూ నిబ్బరంగా జీవించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు రేణుక ఆల్బమ్ చేయిస్తానని నా ఫొటోలు తీసుకుని వెళ్లి '2019 మిసెస్ తెలంగాణ' పోటీలకు పంపించేసింది. ఆ తర్వాత నాకు అన్ని ఈవెంట్లలో పాల్గొనక తప్పలేదు. ఫైనల్స్ సమయంలో స్కాట్లాండ్‌లో ఒబేసిటీ మీద ఇంటర్నేషనల్ సెమినార్‌కి వెళ్లాను. ఇక్కడి నుంచి ఫోన్ చేసి ఒకటే తిట్లు. చివరి నిమిషంలో వచ్చి ఫైనల్ రౌండ్ పూర్తి చేశాను. మిసెస్ ఇండియా పోటీలకు ఇలా ఒకదానితో ఒకటి ఓవర్‌లాప్ కాకుండా జాగ్రత్త పడ్డాను. మిసెస్ ఇండియా విజేత అయినప్పుడు 63 పూర్తయి 64లో ఉన్నాను. సక్సెస్ ఇచ్చే కిక్‌ని బాగా ఎంజాయ్ చేశాననే చెప్పాలి.

నేనే ఉదాహరణ

అప్పటి వరకు నేనందుకున్న పురస్కారాల సమయంలో స్ఫూర్తిదాయకమైన మహిళగా ప్రశంసిస్తుంటే నా అర్హతలకు మించిన గౌరవం ఇస్తున్నారేమో అనిపించేది. ఈ వయసులో నేను సాధించిన ఈ లక్ష్యం నన్ను సంతోషంలో ముంచెత్తుతోంది. ప్రాణం పోయినా ఫర్లేదనే సంసిద్ధతతో మొదలు పెడతాం, అవాంతరాలెదురవుతాయి, కానీ సాధించి తీరాలనే సంకల్ప శక్తితో ముందుకెళతాం. లక్ష్యాన్ని చేరిన తర్వాత కలిగే ఆత్మవిశ్వాసంతో కూడిన అతిశయం చాలా గొప్ప భావన. చైతన్యవంతంగా ముందడుగు వేయాలనుకునే మహిళలకు నేనొక ప్రత్యక్ష నిదర్శనం'' అన్నారు డాక్టర్ శోభాదేవి.

– వాకా మంజులారెడ్డి

విల్‌పవర్

దుఃఖానికి అలవాటు పడితే చీకటే మిగులుతుంది.
దుఃఖాన్ని కూడా శక్తిగా మలుచుకుంటే వెలుగు వచ్చి పలకరిస్తుంది.
పదిమందికి సహాయం చేసే దారి చూపుతుంది.
దుఃఖాన్ని జయించిన డింపుల్ పర్మా ఆ దుఃఖాన్ని శక్తిగా మలుచుకొని బాధితులకు అండగా నిలబడుతోంది.
తాజాగా...
క్యాన్సర్‌పై అవగాహన కలిగించడానికి చేస్తున్న కృషికి డింపుల్ ప్రతిష్ఠాత్మకమైన 'కార్టియే ఉమెన్స్ ఇన్‌షియేటివ్ అవార్డ్–2023'కు ఎంపికైంది...

కన్నీళ్లే శక్తిగా...


డింపుల్ పర్మా

ఐఐఎం, కోల్‌కత్తాలో ఎంబీఏ చేసింది డింపుల్. తన బ్యాచ్‌మెట్ నితేష్ ప్రజాపత్‌తో స్నేహం ప్రేమగా మారింది. ఆ తరువాత వివాహబంధంతో ఇద్దరు ఒక్కటయ్యారు. సంతోషమే లోకంగా బతుకుతున్న వారిపై ఒక వార్త పిడుగులా పడింది. నితేష్‌కు క్యాన్సర్!

'ఎప్పుడూ చురుగ్గా, ఆరోగ్యంగా ఉండే వ్యక్తికి క్యాన్సరా!' అని కుమిలిపోయింది డింపుల్.

నితేష్‌కు వైద్యచికిత్స కోసం కోల్‌కత్తా నుంచి ముంబైకి తీసుకువచ్చారు. కష్టాల సమయంలో అసలైన ప్రేమ బయటికి వస్తుందంటారు. క్యాన్సర్ రూపంలో వచ్చిన కష్టం వారిని మరింత దగ్గర చేసింది. ఒకరినొకరు బాగా అర్థం చేసుకునేలా చేసింది. అదే సమయంలో మృత్యువు నితేష్‌ను తన నుంచి దూరం చేసింది.

ఎన్నో కలలు కన్న యువకుడు, స్నేహితుడు, భర్త ఇప్పుడు లేడు.


నితేష్‌తో డింపుల్

ఎవరికి ఏ చిన్న కష్టం వచ్చినా 'నేనున్నాను' అంటూ వచ్చే వ్యక్తి ఇకముందు కనిపించడు!

దుఃఖంలో మునిగిపోయిన డింపుల్‌కు కళ్ల ముందు చీకటి తప్ప ఏమీ కనిపించలేదు. ఆ చీకటిని దూరం చేయడానికి ఎవరో తనను వెదుక్కుంటూ ముందుకు రారు. తానే ఒక దారి వెదుక్కోవాలి అనుకుంది.

మొదట 'లవ్ హీల్స్ క్యాన్సర్' అనే స్వచ్ఛంద సంస్థను ప్రారంభించి క్యాన్సర్‌పై అవగాహన కలిగించే ఎన్నో కార్యక్రమాలు చేపట్టింది.

ఆతరువాత యాంటీ–క్యాన్సర్ డైట్, సప్లిమెంట్‌లకు సంబంధించిన 'జెన్‌ఆన్‌కో' అనే అంకురానికి శ్రీకారం చుట్టింది. 'జెన్‌ఆన్‌కో' ద్వారా వెయ్యికి పైగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. ఎంతో మంది పేషెంట్లకు అండగా నిలబడింది.

'నిరక్షరాస్యులకే కాదు చదువుకున్న వారిలో చాలామందికి క్యాన్సర్‌పై అవగాహన ఉండకపోవచ్చు. మేము చేసే మొదటి పని పేషెంట్‌లో ధైర్యం నింపడం. డైట్ నుంచి లేటెస్ట్ టెక్నాలజీ వరకు రకరకాల విషయాల గురించి వివరించడం' అంటుంది డింపుల్.

'కార్టియే' అనేది మహిళలకు సంబంధించిన ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం. ఈ పురస్కారం ద్వారా తనలాంటి భావాలు ఉన్న ఎంతోమంది మహిళలతో కలిసి అంతర్జాతీయ స్థాయిలో పనిచేసే అవకాశం లభిస్తుంది. కొత్త విషయాలు నేర్చుకోవచ్చు.

'కార్టియే ఉమెన్స్ ఇనిషియేటివ్ అనేది కేవలం అవార్డ్ కాదు. మన శక్తిసామర్థ్యాలు, సేవాకార్యక్రమాలను విస్తృతపరుచుకునే వేదిక. ఒక విధంగా చెప్పాలంటే మనం ఒక కొత్త ప్రపంచంలోకి వెళ్లినట్లు. అక్కడ మనకు అండగా ఉండే వ్యక్తులు ఉంటారు. మనకు ఉపకరించే దారులు ఉంటాయి. మనం ఏర్పర్చుకున్న సామాజిక లక్ష్యాలకు త్వరగా చేరువ కావడానికి వీలవుతుంది. ఫలితంగా ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకురావచ్చు' అంటుంది డింపుల్.

'డింపుల్ చేస్తున్న ప్రయాణం మమ్మల్ని ఎంతగానో ఆలోచింపజేసింది. తన బాధ, కన్నీళ్లనే శక్తిగా మలుచుకొని ఎంతోమంది బాధితులకు అండగా నిలవడం సాధారణ విషయం కాదు. మన దుఃఖాన్ని శక్తిగా మలుచుకొని పదిమందికి ఉపయోగపడవచ్చు అని చెప్పడానికి డింపుల్‌ను చూపిస్తే చాలు. ఆమె స్టార్టప్ ఎంతోమంది జీవితాలను క్యాన్సర్ నుంచి రక్షించింది. బాధితులకు ఎనలేని ధైర్యాన్ని ఇచ్చింది' అంటున్నారు కార్టియే ఉమెన్స్ ఇన్‌షియేటివ్ సీనియర్ లీడర్‌లు.

నిజమైన నివాళి

వైద్యచికిత్స సమయంలో ఎంతో మంది స్నేహితులు, సన్నిహితులు చూపిన ప్రేమ నితేష్‌ను ధైర్యం కోల్పోకుండా, అదే ఉత్సాహంతో ఉండేలా చేసింది. ఆ సమయంలో నాకు బాగా అర్థమైన విషయం... పేషెంట్‌కు వైద్య చికిత్స మాత్రమే కాదు ప్రేమాభిమానాలు ఎంతో ముఖ్యమైనవని. ఏడాదిన్నర కాలంలోనే జీవితం తలకిందులైపోయింది. దుఃఖిస్తూ కూర్చోవడం కంటే బాధితులకు ఏదో రకంగా సహాయపడడమే నితేష్‌కు ఇచ్చే నిజమైన నివాళి అనుకొని ముందడుగు వేశాను.

– డింపుల్ పర్మా

పట్టుదల

మన దేశంలోని గ్రామాల్లో,
చిన్న చిన్న టౌన్లలో చాలా వరకు మగవాళ్లు
బతుకుదెరువు కోసం వలస వెళుతుంటారు.
బీహార్‌వాసి ఉషాదేవి భర్త కూడా కుటుంబాన్ని వదిలి,
అలాగే నగరానికి వెళ్లాడు.
నలుగురు పిల్లలు, తను ఉన్న ఊళ్లోనే
ఎలా గొప్పగా బతకచ్చో చూపించింది.
స్వయంగా ఉపాధి పొందుతూ,
పిల్లలకు చదువులు చెప్పించింది.
తను కూడా కాలేజీ నుంచి డిగ్రీ పట్టాను సాధించింది.
'గుర్తింపు అనేది చిన్న విషయం కాదు. ఇది కొన్నేళ్ల పట్టుదల' అంటూ చెప్పే ఉషాదేవి కథనం
నేడు ఎంతోమంది మహిళలకు
స్ఫూర్తిగా నిలుస్తోంది.


ఉషాదేవి

ఉన్నచోటనే బతికి చూపించవచ్చు

ఉషాదేవిని చదువు మాన్పించి, పదిహేనేళ్ల వయసులో ఆమె తల్లిదండ్రులు పెళ్లి చేశారు. కొడుకు పుట్టాలని ఇంట్లోవారి కోరిక. దీంతో వరస కాన్పులు. ముగ్గురు ఆడపిల్లల తర్వాత కొడుకు పుట్టాడు. ఆమెకు తన జీవితంలో దేనిపైనా నియంత్రణ లేదు. ఇంట్లోవాళ్ల ఎంత చెబితే అంత. తన భర్త ఉద్యోగం వెతుక్కుంటూ వలస వెళ్లాల్సి రావడంతో తప్పనిసరై నలుగురు పిల్లల జీవితాలను చూసుకునేందుకు తల్లిగా ఆమె ఎదిగింది. అత్తమామల ఇంటి నుండి అదే గ్రామంలో వేరే ఇంటికి మారింది. ఆమె ఇప్పుడు డబ్బు సంపాదిస్తోంది. ఇంటి పెద్దగా ఆమెను అందరూ గుర్తిస్తున్నారు.


గ్రామంలోని మహిళలతో కలిసి...

పదకొండేళ్ల క్రితం

ఉషాదేవి సంపాదించడం ప్రారంభించినప్పుడు ఆమె తన చదువుపై కూడా పెట్టుబడి పెట్టింది. 2012లో ఒక ఎన్జీవోతో కలిసి పనిచేయడం ప్రారంభించింది. ఇంటింటికి వెళ్లి తల్లులు, శిశువుల ఆరోగ్య డేటాను సేకరిస్తుంది. 2016లో స్వయం సహాయక బృందాన్ని నిర్వహించడం ప్రారంభించింది. వదిలేసిన చదువును కొనసాగించడానికి భర్త రంజిత్ కూడా తన ఇష్టాన్ని చూపాడు. 'నా భార్య ఎంత తెలివిగా ఉందో గ్రహించినప్పుడు నా పొరపాటు ఏంటో అర్థమైంది. నా భార్య పిల్లలను చదివించకపోతే నా పిల్లలు నాలాగే మారేవారు. ఆమె వల్ల వారికి మంచి భవిష్యత్తు లభించడానికి అవకాశాలు ఉన్నాయి' అంటాడు రంజిత్.

ఆధారపడితే అంతే!

'భర్తలు వలస వెళ్లిన పరిస్థితుల్లో స్త్రీలే ఇంటి పెద్దలుగా పరిగణిస్తారు. అయితే, ఆమె తన అత్త, అన్నదమ్ముల వంటి ఇతరులపై ఆధారపడితే మాత్రం సరైన గుర్తింపు లభించదు. ఒక స్త్రీ తనంతట తానుగా సొంత కుటుంబాన్ని స్థాపించుకోగలిగిన సందర్భాల్లో, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంలోనే నిజమైన మార్పును చూడగలుగుతాం' అని చెప్పే ఉషాదేవి ఇప్పుడు తన గ్రామంలోని మహిళల్లో నాయకురాలిగా ఎదిగింది. చదువులోనూ రాణించడంతో చేసే ఎన్జీవో పనుల్లోనూ చురుకుగా వ్యవహరిస్తోంది. స్వయం సహాయక బృందానికి లీడర్‌గా, పేద మహిళలకు సులభంగా రుణాలు ఇచ్చే ప్రభుత్వ పథకంలో మహిళలను చేర్చుకోవడం ఆమెనే నిర్ణయిస్తుంది. మీటింగ్‌లను ఏర్పాటు చేస్తుంది. చిన్న మొత్తాల్లో విరాళాలు సేకరించి, తరచుగా బ్యాంకుకు వెళ్లి డిపాజిట్ చేయడం, రుణాల కోసం బ్యాంక్‌వారిని కోరడం, తిరిగి చెల్లించడం వంటి ఆర్థిక నిర్ణయాలు తీసుకుంటుంది.

ఉషాదేవి టీమ్‌లో ఉండే శోభ మాట్లాడుతూ 'నా భర్త పంపే డబ్బు నాకు సరిపోదు. నాలాగే మిగతా వాళ్లూ ఉన్నారు. ఇలాంటప్పుడు ఉషాదేవి మాలో ధైర్యాన్ని నింపుతుంది. ఆదాయవనరులను ఎలా సృష్టించుకోవాలో చెబుతుంది. చదువు చెబుతుంది' అని తెలియజేస్తుంది. పెద్దగా సంపాదిస్తున్న వాళ్లుగా కాదు గానీ, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం గల వ్యక్తులుగా వీళ్లను చూసి నేర్చుకోవాల్సి ఉంటుంది.


బ్యూటిప్

రెండు టేబుల్ స్పూన్ల టొమాటో జ్యూస్, ఉడికించిన 50 గ్రా.ల ఓట్స్, 25 గ్రా.ల పెరుగు, కప్పుడు నీళ్లు కలపాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని ముఖానికి రాసి, ఆరిన తర్వాత చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి. బ్లాక్‌హెడ్స్, మొటిమలు తగ్గి చర్మం మృదువుగా కాంతిమంతంగా కనిపిస్తుంది.



ఇంటిప్స్

- కొత్తిమీర, కరివేపాకులను పలుచని వస్త్రంలో చుట్టి ఫ్రిజ్‌లో పెడితే ఎక్కువ రోజులు నిలవ ఉంటాయి, రంగు మారవు.
- నీళ్లు తాగినా కూడా దాహం తీరినట్లు లేకపోతే ఒక ఏలక్కాయ తింటే చాలు. ప్రయాణాలలో ఏలక్కాయ తింటే దాహం వేయదు, నోటి దుర్వాసనను కూడా అరికడుతుంది.





మరో మథనం

అమృతం కోసం
క్షీరసాగర మథనాన్ని
దేవతలు, రాక్షసులు
ఎలా సాగించారో మనకు తెలుసు.
ఎంతో మథనం సాగితేనే
మంచి సిద్ధిస్తుందని ఈ కథ సంకేతం.
ఈ పురా గాథను
పార్లమెంట్‌లో 75 అడుగుల పొడవు
మ్యూరల్‌గా సృష్టించాడు
శిల్పి నరేశ్ కుమావత్.
10 నెలల పాటు అతడు చేసిన
శ్రమ ఇది.
నరేశ్ కళాసృష్టి చాలానే ఉంది.


'అమృత' శిల్పం


75 అడుగుల మ్యూరల్

దేశం గర్వపడే స్థాయిలో కొత్త పార్లమెంట్ భవనం నిర్మితమై, ప్రారంభమైంది. దీని విశేషాలు తెలుసుకునే కొద్దీ ప్రజలకు ఉత్సాహం కలుగుతూనే ఉంది. దీని బహిర్ రూపం గురించే కాకుండా లోపలి అలంకరణల కోసం ఎంతో ప్రయాస జరిగింది. దేశంలోని ఎందరో కళాకారులు, చిత్రకారులు, శిల్పులు పార్లమెంట్ లోపలి దారులను, ద్వారాలను, గోడలను మన సాంస్కృతిక చిహ్నాలతో అలంకరించారు. వీటిలో నరేశ్ కుమావత్ రూపొందించిన 'సముద్ర మంథన్'– అంటే క్షీర సాగర మథనం మ్యూరల్ ఒకటి.

ఆలోచనల మథింపు

దేవతలు, రాక్షసులు కలిసి క్షీరసాగర మథనం సాగించినప్పుడు పాల సముద్రంలో నుంచి ఎన్నో దివ్య వస్తువులు అవతరించాయి. అంతిమంగా అమృతం వెలువడింది. ఇవన్నీ ప్రజాహితానికి ఉపయోగపడేవే. పార్లమెంట్‌లో క్షీర సాగర మథనం మ్యూరల్‌ను పెట్టడంలో ఉద్దేశం అదే అంటాడు నరేశ్ కుమావత్. 'ప్రజలకు హితమయ్యే మంచి ఆలోచనల మథనం జరగాలని కోరుకుంటూ ఈ మ్యూరల్‌ని ప్రతిష్ఠించారు' అని తెలిపాడు.


శిల్పి నరేశ్ కుమావత్

75 అడుగుల వెడల్పు 9 అడుగుల ఎత్తు

'పార్లమెంట్ లోపల ఏర్పాటు చేయాల్సిన ఇంటీరియర్స్ కోసం ఒక సమావేశానికి నాకు ఆహ్వానం అందింది. మినిస్ట్రీ ఆఫ్ కల్చర్, ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ కలిసి ఈ కళాకృతులను అజమాయిషీ చేస్తున్నాయి. వారి నుంచి 'సముద్ర మంథన్' ఆలోచన వచ్చింది. దాని బాధ్యతలు నాకు అప్పగించారు. పార్లమెంట్‌లోని ఏదైనా పెద్ద గోడ దొరికితే దాని పొడవు మేర గొప్పగా ఈ మ్యూరల్ ఏర్పాటు చేస్తానని చెప్పాను. అలాగే దొరికింది. దాంతో 9 అడుగుల ఎత్తు, 75 అడుగుల వెడల్పులో మ్యూరల్ తయారు చేశాను.

40 మంది 10 నెలలు

క్షీర సారగ మథనం మ్యూరల్ రాత్రికి రాత్రే ఆవిష్కృతం కాలేదు. ముందు కుమావత్ స్కెచెస్ వేశాడు. ఆ తర్వాత బంక మన్నుతో ఒక నమూనా తయారు చేసుకున్నాడు. అధికారులు కరెక్షన్స్ చెప్పాక తుది రూపం నిశ్చయించుకుని ఐదు ధాతువులు– ఇత్తడి, లెడ్, టిన్, మెగ్నీషియమ్, టైటానియమ్‌ల మిశ్రమ రేకుతో మ్యూరల్ తయారయ్యింది. 40 మంది పది నెలల పాటు కష్టపడ్డారు. ఈ మ్యూరల్ మీద మొత్తం 235 మంది దేవుళ్లు, దేవతలు ఉన్నారు. 40 భాగాలుగా మ్యూరల్ తయారు చేసుకుని గోడ మీద వాటన్నింటినీ అనుసంధానించి బృహత్ రూపం ఇచ్చారు.

అతి పెద్ద శివుడు

కుమావత్ ఈ మ్యూరలే కాదు దేశవిదేశాలలో భారీ మూర్తులకు రూపకల్పన చేశాడు. ప్రతిష్ఠించాడు. రాజస్థాన్‌లోని నాథ్‌ద్వారాలో ప్రపంచంలోనే అతి ఎత్తయిన 351 అడుగుల శివుడి శిల్పాన్ని కుమావతే తయారు చేశాడు. దేశ నాయకుల భారీ విగ్రహాల ప్రతిష్ఠాపనలో పాల్గొన్నాడు. కొత్త పార్లమెంట్ భవనంలో తన కళాకృతికి చోటు దొరకడం అదృష్టం అంటున్నాడు.


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 72

శనివారం 3-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రుణ పరిమితి బిల్లుకు ఆమోదం

సుదీర్ఘ చర్చల అనంతరం రుణ పరిమితి బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదం -6లో



కోర్టు బోనెక్కనున్న ప్రిన్స్ హ్యారీ

మిర్రర్ గ్రూప్ న్యూస్‌పేపర్స్ కేసులో కోర్టుకు హాజరుకానున్న ప్రిన్స్ హ్యారీ -6లో

ఉద్యమంతో మొదలై... ఉజ్వలమై..

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ మోడల్ మన్నన అందుకుంటోంది

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్

- దేశంలోనే బలీయమైన ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదిగింది
- తొమ్మిదేళ్లలోనే దేశానికి తలమానికంగా నిలిచాం
- ఈ నెల 24 నుంచి గిరిజన, ఆదివాసీలకు పోడు పట్టాల పంపిణీ
- అన్ని జిల్లాల్లో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ పథకం అమలు
- నిరంతర ప్రక్రియగా పేదలకు గృహ నిర్మాణం కొనసాగుతుంది
- సచివాలయం ఎదురుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తాం
- సచివాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన కేసీఆర్
- పోలీసు బలగాల గౌరవ వందనం అనంతరం ప్రసంగం

త్వరలో పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీ

అర్హులైన పేదలకు ప్రభుత్వ భూముల్లో ఇండ్ల స్థలాల పంపిణీ చేపట్టాలని నిర్ణయించాం. అర్హులైన నిరుపేదలను గుర్తించి ఆయా గ్రామాల్లో ఇంకా మిగిలి ఉన్న నివాసయోగ్యమైన ప్రభుత్వ భూములను ఇండ్ల నిర్మాణాల కోసం కేటాయిస్తాం. ఈ మేరకు క్షేత్రస్థాయి నుంచి సమాచారం ఇవ్వాల్సిందిగా అధికారులకు ఆదేశాలు జారీ చేశాం.

– కేసీఆర్



జెండా వందనం చేస్తున్న కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: ఉద్యమ ప్రస్థానంతో మొదలై.. ఉజ్వల ప్రగతి వైపు తెలంగాణ రాష్ట్రం పురోగమిస్తోందని.. తొమ్మిదేళ్లు పూర్తి చేసుకుని పదో ఏట అడుగిడుతున్న రాష్ట్రం దేశానికే మార్గదర్శిగా నిలుస్తోందని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. దేశంలోనే తక్కువ వయసున్న రాష్ట్రమైన తెలంగాణ అభివృద్ధి పరుగులో ముందు వరుసలో నిలబడిందని.. తొమ్మిదేళ్లలోనే ప్రతి రంగంలోనూ యావద్దేశం నివ్వెరపోయేలా ఫలితాలను సాధించి, పదో సంవత్సరంలోకి అడుగుపెట్టడం ఒక మైలురాయి అని చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రం సాధించిన మిగతా 2వ పేజీలో ▶

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కేసీఆర్



ప్రమాద స్థలంలో సహాయక చర్యలు

3 రైళ్లు.. ఒడిశాలో ఘోర ప్రమాదం

100 మందికి పైగా మృతి?

మహా విషాదం!

గూడ్స్‌ను ఢీకొని పట్టాలు తప్పిన కోరమండల్!

పక్క ట్రాక్‌పై పడ్డ దాని బోగీలను ఢీకొన్న హౌరా ఎక్స్‌ప్రెస్

70కి పైగా మృతదేహాల వెలికితీత .. 350 మందికి పైగా గాయాలు

ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి ఒకే చోటఏకంగా రెండు ప్రయాణికుల రైళ్లు, ఒక గూడ్స్ ప్రమాదానికి గురయ్యాయి. ఈ దారుణంలో కనీసం వంద మందికిపైగా దుర్మరణం పాలైనట్టు భావిస్తున్నారు. ఇప్పటిదాకా 70కి పైగా మృతదేహాలను వెలికి తీశారు. 350 మందికి పైగా గాయపడ్డారు. వందలాది మంది బోగీల్లో చిక్కుకుని ఉండటంతో మృతుల సంఖ్య భారీగా పెరిగే అవకాశముంది. సహాయక చర్యలకు పెను చీకటి అడ్డంకిగా మారింది. ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.



6లో గూడ్స్ వ్యాగన్ పైకి దూసుకెళ్లిన కోరమండల్ ఇంజన్

లూప్‌లైన్‌లోకి మళ్లించినందుకే..

23 సెకన్లలో గంటకు 128 కి.మీ నుంచి 0 స్పీడ్‌కు..

కొందరి అభివృద్ధి కాదు.. అందరి అభివృద్ధి కావాలి

గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

అప్పుడే స్వరాష్ట్ర సాధనకు పరిపూర్ణత



- 1969 ఉద్యమకారులకు సత్కారం
- రాజ్‌భవన్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు

12లో

తొమ్మిదేళ్లయినా తీరని కష్టాలు

లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్

- తెలంగాణ ప్రజల బాధలు చూసి సోనియా రాష్ట్ర ఏర్పాటు నిర్ణయం తీసుకున్నారు..
- కానీ ఇప్పటి పరిస్థితులు తెలుసుకుని సోనియాతో పాటు రాహుల్ బాధపడుతున్నారు
- టీపీసీసీ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ వేడుకలు
- గన్‌పార్కు వద్ద అమరవీరులకు మీరాకుమార్ నివాళి..
- అబిడ్స్ నుంచి గాంధీభవన్ వరకు శ్రేణుల ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: 'తెలంగాణ ప్రజలను అందరూ మోసం చేశారు. అసలు తెలంగాణ సమస్య ఏంటన్నది ఎవరూ వినలేదు. ఒక్క సోనియాగాంధీ మాత్రమే ఈ ప్రాంత ప్రజల మనసును అర్థం చేసుకున్నారు. ఇక్కడి ప్రజల బాధలు చూసి వారి కష్టాలు తీరాలన్న ఆలోచనతోనే ఆమె తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు నిర్ణయం తీసుకున్నారు. కానీ రాష్ట్రం ఏర్పాటయిన తర్వాత తెలంగాణలో పరిస్థితులు తెలుసుకుని సోనియాతో పాటు రాహుల్‌గాంధీ కూడా బాధపడుతున్నారు..'అని లోక్‌సభ మిగతా 12వ పేజీలో ▶



శుక్రవారం గాంధీభవన్‌లో బోనం ఎత్తుకున్న లోక్‌సభ మాజీ స్పీకర్ మీరాకుమార్

తెలంగాణ వచ్చాక ఏమున్నది గర్వకారణం

ఓ కుటుంబం చేతిలో బానిసైంది..!

- అన్ని రంగాల్లో అవినీతి, అహంకారం, నియంతృత్వం
- ఒక వ్యక్తి, ఒక పార్టీతోనే తెలంగాణ రాలేదు...
- ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా ఇక్కడ మంచి ప్రభుత్వం ఏర్పడుతుందని నమ్ముతున్నా..
- కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో కిషన్‌రెడ్డి వ్యాఖ్యలు
- గోల్కొండ ఖిల్లాపై జెండా ఎగురవేసిన కేంద్రమంత్రి

సాక్షి, హైదరాబాద్: 'పదో ఏడాదిలో ప్రవేశిస్తున్న తెలంగాణ ఓ కుటుంబం చేతిలో బానిసై...దగా పడింది. అవినీతిమయ రాష్ట్రంగా మారింది... కుటుంబ పాలనతో పలు విధాలుగా రాష్ట్రానికి మోసం జరిగింది'అని కేంద్ర సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్ర విమర్శలు సంధించారు. 'అమరవీరుల ఆకాంక్షలకు రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలిచ్చింది. ప్రపంచంలో అప్పు ఇవ్వగలిగే అన్ని సంస్థల వద్ద కలిపి మొత్తంగా రూ.8 లక్షల కోట్ల రుణాలు తీసుకుని రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది. చేసిన మిగతా 12వ పేజీలో ▶



భావోద్వేగానికి గురైన అమరుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న కిషన్‌రెడ్డి

నిర్లక్ష్యంగా కారు డోర్ తీసి.. చిన్నారిని బలిగొన్న డ్రైవర్

- కారు డోర్ తగిలి బైక్‌పైనుంచి రోడ్డుపై పడిన పాప
- పసిపాపపై నుంచి వెళ్లిన ఆటో
- సీసీ కెమెరాల్లో రికార్డు.. ఎల్బీనగర్‌లో దుర్ఘటన

13లో

ఇదండీ సంగతి



... ఇక తొలగించడానికి ఏమీ మిగల్లేదు్సార్! ఓకేనా!

ఆరిజిన్ డెయిరీ భాగస్వామి.. ఆత్మహత్యాయత్నం



పోలీసులు స్వాధీనం చేసుకున్న షెజల్ సూసైడ్ నోట్

చెదలు నివారణ మందు తాగిన షెజల్	ఢిల్లీలోని తెలంగాణ భవన్ సమీపంలో ఘటన

- బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య, ఆయన అనుచరులపై ఆరోపణలు
- వారి వేధింపులు, బెదిరింపులు భరించలేకే ఆత్మహత్య చేసుకుంటున్నానని వెల్లడి
- న్యాయమూర్తులు, తెలంగాణ సర్కార్‌నుద్దేశించి సూసైడ్ నోట్

సాక్షి, న్యూఢిల్లీ/బెల్లంపల్లి: మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆయన అనుచరులు గత కొంతకాలంగా రకరకాలుగా వేధిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో నిరసనలు చేపడుతున్న ఆరిజిన్ డెయిరీ భాగస్వామి బోడపాటి షెజల్ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన సమీపంలోని వారు హుటాహుటిన ఆమెను ఆర్ఎంఎల్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెను అబ్జర్వేషన్‌లో ఉంచినట్లు ఆస్పత్రి వర్గాలు వెల్లడించాయి. విషయం తెలిసిన ఢిల్లీ పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకొని కొంత మంది నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు. ఆసుపత్రిలో షెజల్ వాంగ్మూలం కూడా సేకరించినట్లు తెలిసింది. అయితే ఎమ్మెల్యే చిన్నయ్య, ఆయన అనుచరుల వేధింపులు తాళలేకే మిగతా 5వ పేజీలో ▶

దాచిన కీచక పర్వాలెన్నో...

- మహిళా రెజ్లర్లపై భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఆరోపణల వ్యవహారంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో పలు సంచలన విషయాలు ఉన్నాయి. మైనర్ సహా పలువురు రెజ్లర్లు తమను బ్రిజ్‌భూషణ్ లైంగికంగా ఎలా వేధించాడనేది పూసగుచ్చినట్లు చెప్పారు. తమకు ఎదురైన ఘటనలను వారు విచారణ సందర్భంగా వెల్లడించారు. రెజ్లర్లకు సంఘీభావంగా దేశరాజధానిలో శుక్రవారం కూడా నిరసన ప్రదర్శనలు కొనసాగాయి. మరో వైపు 1983లో వన్డే వరల్డ్ కప్ గెలిచిన జట్టు సభ్యులు కపిల్ దేవ్ నేతృత్వంలో రెజ్లర్లకు మద్దతునిస్తూ ఒక సంయుక్త ప్రకటన జారీ చేశారు.



15లో చెన్నైలో ఐద్వా ఆధ్వర్యంలో నిరసన

ఉద్యమంతో మొదలై.. ఉజ్వలమై..

నిరంతరంగా రాష్ట్ర పురోగతి

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆకాంక్ష



తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నిరంతరంగా కొనసాగాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆకాంక్షించారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆమె రాష్ట్ర ప్రజలకు ట్విట్టర్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ వినూత్న ఆవిష్కరణలకు, పరిశ్రమల స్థాపనకు కేంద్రమని పేర్కొన్నారు. తెలంగాణ ఘనమైన సాంస్కృతిక వారసత్వం, సంపదకు నిలయమని, రాష్ట్రం మరింత ప్రగతితో ముందుకు వెళ్లాలని ఆమె ఆకాంక్షించారు.

తెలంగాణ సంస్కృతి ఎంతో గొప్పది: ప్రధాని మోదీ



తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ట్వీట్ చేశారు. 'అద్భుతమైన తెలంగాణ రాష్ట్ర ప్రజలకు నా శుభాకాంక్షలు. తెలంగాణ రాష్ట్ర ప్రజల నైపుణ్యాలు, సంస్కృతీ వైభవం ఎంతో గుర్తింపు పొందాయి. తెలంగాణ శ్రేయస్సు, సౌభాగ్యం కోసం నేను ప్రార్థిస్తున్నాను'.. అని ట్వీట్‌లో పేర్కొన్నారు.

తెలంగాణ శక్తిమంతమైన రాష్ట్రం

ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కడ్



రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కడ్ ట్విట్టర్ వేదికగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ చారిత్రకంగా, సంస్కృతిపరంగా శక్తిమంతమైందని పేర్కొన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతూ, కీర్తి కొత్త శిఖరాలను తాకాలని ఆయన ఆకాంక్షించారు.

లోక్‌సభ స్పీకర్ శుభాకాంక్షలు



తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం మరింత అభివృద్ధితో వర్ధిల్లాలని, ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆయన ట్విట్టర్ వేదికగా కోరారు.

▶ మొదటి పేజీ తరువాయి

విజయాలను ప్రపంచానికి చాటిచెబుదామని పిలుపునిచ్చారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను సీఎం కేసీఆర్ ప్రారంభించారు. తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. 9 ఏళ్లలో రాష్ట్రం సాధించిన విజయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించడంతోపాటు వెనుకబడిన తరగతులు, ఇతర వర్గాలకు కొత్త పథకాలను ప్రకటించారు. కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

''రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ తొలి ఆవిర్భావ వేడుకల్లో ముఖ్యమంత్రిగా నేను వాగ్దానం చేశాను. తెలంగాణను దేశానికే తలమానికంగా ఉండేలా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీ ఇచ్చాను. ఆ ఉక్కు సంకల్పాన్ని చెదరనివ్వలేదు. తొమ్మిదేళ్లలో అనేక రంగాల్లో దేశానికే స్ఫూర్తినిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ అవతరించింది. కరోనా వల్ల దాదాపు మూడేళ్లు వృథాగా పోయినా మిగతా ఆరేళ్లలోనే రాష్ట్రం ప్రగతి శిఖరాలను అధిరోహించింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ అభివృద్ధి నమూనా మన్ననలు అందుకుంటోంది. అనేక సవాళ్ల మధ్య ప్రారంభమైన తెలంగాణ ప్రగతి ప్రస్థానం.. ఇప్పుడు పరుగులు తీస్తోందంటే అంకితభావంతో పనిచేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, ఉద్యోగులు, ప్రజల సహకారమే కారణం.

అన్ని జిల్లాల్లో న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

పేదల ప్రతి సమస్యనూ సూక్ష్మంగా అర్థం చేసుకొని పరిష్కరించే దిశగా ప్రభుత్వ ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. గర్భిణులలో రక్తహీనత సమస్యను నివారించడం, గర్భస్థ శిశువు ఆరోగ్యంగా ఎదగడం కోసం ప్రొటీన్లు, విటమిన్లతో కూడిన పోషకాహారాన్ని న్యూట్రిషన్ కిట్ల ద్వారా ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే ఈ పథకాన్ని 9 జిల్లాల్లో ప్రారంభించగా అద్భుతమైన ఫలితాలు వచ్చాయి. ఈ దశాబ్ది ఉత్సవాల్లోనే మిగతా 24 జిల్లాల్లోనూ న్యూట్రిషన్ కిట్ల పంపిణీని ప్రారంభిస్తాం.

కొత్త సచివాలయం..భారీ అంబేడ్కర్ విగ్రహం

హైదరాబాద్ నడిబొడ్డున వెలసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయ సౌధం రాష్ట్ర ప్రతిష్టకు ఉజ్వల సంకేతంగా నిలిచింది. గతంలో సీఎంచాంబర్‌కు వెళ్లేదారి ఒక చీకటి గుహలోకి ప్రవేశించినట్టుగా ఉండేది. ఉద్యోగులు ఆఫీసు టేబుళ్లపై భోజనం చేయాల్సిన పరిస్థితి ఉండేది. అలాంటి ఇక్కట్లేవీ లేకుండా అధునాతన హంగులతో, అన్ని శాఖల కార్యాలయాలను అనుసంధానిస్తూ కొత్త సచివాలయ సౌధాన్ని నిర్మించుకున్నాం. బాబాసాహెబ్ ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో సచివాలయానికి ఆయన పేరు పెట్టుకోవడంతోపాటు.. సచివాలయం సమీపంలోనే 125 అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహాన్ని ఘనంగా ఆవిష్కరించుకున్నాం. సచివాలయానికి మరోవైపు అమరవీరుల స్మారకం నిర్మించుకున్నాం. ఒకవైపు భారీ అంబేడ్కర్ విగ్రహం, దానికి ఎదురుగా హుస్సేన్‌సాగర్‌లో బుద్ధుని విగ్రహం, నూతన సచివాలయ సౌధం, అమరవీరులను ప్రతిరోజూ స్మరణకు తెచ్చే అమరజ్యోతి.. ఇవన్నీ మనకు నిత్యం కర్తవ్య బోధ చేస్తుంటాయి. నూతన సచివాలయం ఎదురుగా ఉన్న విశాలస్థలంలో తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీక అయిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోబోతున్నాం.

జూలైలో 'గృహలక్ష్మి' ప్రారంభం

సొంతంగా ఇంటి స్థలం ఉండి ఇల్లు నిర్మించుకోలేని పేదల కోసం రాష్ట్ర ప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకాన్ని తీసుకొచ్చింది. మహిళల పేరిట అమలు చేసే ఈ పథకాన్ని జూలైలో ప్రారంభిస్తున్నాం. గృహలక్ష్మి పథకం కింద ఒక్కో లబ్ధిదారుకు ఇంటి నిర్మాణం కోసం రూ.3 లక్షల రూపాయలను మూడు దశల్లో అందిస్తాం. ఈ పథకం అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయనుంది.

ఈనెల 24 నుంచి పోడు పట్టాలు

రాష్ట్రంలో పోడు సాగు చేసుకుంటున్న గిరిజన, ఆదివాసీల చిరకాల ఆకాంక్షను ప్రభుత్వం తీరుస్తోంది. ఈ నెల జూన్ 24 నుంచి పోడు పట్టాల పంపిణీకి శ్రీకారం చుడుతోంది. అటవీ భూములపై ఆధారపడిన 15 లక్షల మంది ఆదివాసీ, గిరిజనులకు నాలుగు లక్షల ఎకరాల పోడు భూములపై యాజమాన్య హక్కులు కల్పించనున్నాం. అదేవిధంగా వారికి రైతుబంధు పథకాన్ని కూడా వర్తింపజేస్తాం.



అవతరణ వేడుక కార్యక్రమంలో మేనత్త కవితతో హిమాన్షు

నిరంతర ప్రక్రియగా పేదలకు గృహ నిర్మాణం

నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడం కోసం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టాం. పేదలకు ఉచితంగా డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఇచ్చే పథకం మరెక్కడా లేదు. కొల్లూరులో 124 ఎకరాల విస్తీర్ణంలో నిర్మిస్తున్న ఈ ఇళ్ల సముదాయం ఓ టౌన్‌షిప్‌ను తలపించేలా ఉంది. అక్కడ 117 బ్లాకుల్లో 15,660 ఫ్లాట్లు నిర్మించాం. ఇదో ఉదాహరణ మాత్రమే. పేదలకు గృహ నిర్మాణం అనేది ఓ నిరంతర ప్రక్రియ. దీనిని కొనసాగిస్తునే ఉంటాం.

విద్యుత్ విజయం

తెలంగాణ ఏర్పడే నాటికి స్థాపిత విద్యుదుత్పత్తి సామర్థ్యం 7,778 మెగావాట్లుకాగా.. ఇప్పుడు 18,453 మెగావాట్లకు పెంచుకున్నాం. రాష్ట్రం ఏర్పడినప్పుడు సోలార్ పవర్ ఉత్పత్తి 74 మెగావాట్లే ఉండగా.. ఇప్పుడు 5,741 మెగావాట్లకు పెంచగలిగాం. సౌర విద్యుదుత్పత్తిలో తెలంగాణ దేశంలో అగ్రభాగాన నిలిచింది. తెలంగాణ విద్యుత్తు రంగాన్ని తీర్చిదిద్దడం కోసం ప్రభుత్వం త్రిముఖ వ్యూహాన్ని అనుసరించింది. సంస్థలో అంతర్గత సామర్థ్యాన్ని మెరుగుపరిచింది.

సురక్షిత జలాల మిషన్ భగీరథ

మిషన్ భగీరథ ద్వారా నూరు శాతం ఇళ్లకు నల్లాల ద్వారా శుద్ధిచేసిన మంచినీటిని సరఫరా చేస్తున్న ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలో ఇంటింటికీ నీళ్లు ఇవ్వకుంటే.. ప్రజలను ఓట్లు అడగబోనని రాష్ట్రం వచ్చిన తొలినాళ్లలోనే ప్రతిజ్ఞ చేశాను. నా ప్రతిజ్ఞను నిలబెట్టుకున్నాను. ఇంటింటికీ తాగునీరు అందించడంలో తెలంగాణ దేశంలోనే తొలిస్థానంలో ఉంది. ప్రధాని సొంత రాష్ట్రం గుజరాత్ మూడో స్థానంలో ఉంది. తెలంగాణ ప్రారంభించిన మిషన్ భగీరథను అనుకరిస్తూ కేంద్రం 'హర్ ఘర్ జల్ యోజన' పేరిట పథకాన్ని అమల్లోకి తెచ్చింది.

సాగునీటి రంగంలో స్వర్ణయుగం

సమైక్య రాష్ట్రంలో మూలనపడ్డ కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయల్‌సాగర్, ఎల్లంపల్లి, మిడ్ మానేరు, దేవాదుల, తదితర పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణాలను పూర్తిచేయడంతో 20 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అభివృద్ధి చెందింది. ఉమ్మడి పాలమూరు జిల్లా ఈరోజు కళకళలాడుతోంది. ఈ మార్పుకు అద్దంపడుతూ ''వలసలతో వలవల విలపించు కరువు జిల్లా, పెండింగ్ ప్రాజెక్టులను వడివడిగా పూర్తిచేసి, చెరువులన్ని నింపి, పన్నీటి జలకమాడి, పాలమూరు తల్లి పచ్చ పైట కప్పుకున్నది..'' అని నేనే స్వయంగా పాట రాశాను. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు 80 శాతానికిపైగా పూర్తయింది. ఈ ప్రాజెక్టుతో ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి జిల్లాల్లో ప్రతి ఎకరానికీ సాగునీరు అందుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే 'సీతారామ' పనులు తుదిదశకు చేరాయి.

తెలంగాణ ఆధ్యాత్మిక వైభవం

తెలంగాణ ఆధ్యాత్మిక వైభవ ప్రతీక అయిన యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం అద్భుతమని యావన్మందీ కొనియాడుతున్నారు. అలాగే కొండగట్టు అంజన్న ఆలయ అభివృద్ధికి రూ.500 కోట్లు మంజూరు చేశాం. ఇటీవల నేను ఆ ఆలయానికి వెళ్లి పరిశీలించి, దేశంలోకెల్లా ప్రసిద్ధ ఆలయంగా దీన్ని తీర్చిదిద్దాలని సంకల్పించాను. ఇదే తరహాలో వేములవాడ, ధర్మపురి దేవాలయాల అభివృద్ధి కోసం రూ.100 కోట్ల చొప్పున కేటాయించాం. పనులు పురోగతిలో ఉన్నాయి. భద్రాద్రి ఆలయాన్ని సైతం వైభవంగా తీర్చిదిద్దాలని కృతనిశ్చయంతో ఉన్నాం. రామప్ప ఆలయానికి ప్రపంచ వారసత్వ కట్టడంగా యునెస్కో గుర్తింపు గుర్తింపు వెనుక ప్రభుత్వ కృషి ఎంతో ఉంది.

కాశీ, శబరిమలలో వసతిగృహాలు

సనాతన ధర్మాన్ని పాటించే ప్రతి ఒక్కరూ జీవితంలో ఒక్కసారైనా కాశీ క్షేత్రాన్ని సందర్శించాలని కోరుకుంటారు. తెలంగాణ నుంచి కాశీకి వెళ్లే భక్తుల సౌకర్యార్థం 60 వేల చదరపు అడుగుల్లో అక్కడ ఓ వసతి గృహం నిర్మించబోతున్నాం. అదేవిధంగా శబరిమలకు వెళ్లే తెలంగాణ భక్తుల కోసం అక్కడ వసతి గృహం నిర్మిస్తున్నాం. ఆచార్య నాగార్జునుడు నడయాడిన నాగార్జునసాగర్‌లో ప్రభుత్వం బుద్ధవనాన్ని అద్భుతంగా నిర్మించింది'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. చివరిగా

'ధర్మస్య విజయోస్తు.. అధర్మస్య నాశోస్తు..
ప్రాణిషు సద్భావనాస్తు.. విశ్వస్య కల్యాణమస్తు'

అని శ్లోకంతో ప్రసంగం ముగించారు.



గన్‌పార్క్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్, డీజీపీ తదితరులు

రైతుబంధుకు రూ. 65 వేల కోట్ల సాయం

రైతుబంధు పథకం ప్రవేశపెట్టిన ఐదేళ్లలో విప్లవాత్మక మార్పులు వచ్చాయి. ఈ పథకం కింద ఇప్పటివరకు పది విడతల్లో 65 లక్షల మంది రైతులకు రూ.65 వేల కోట్లు అందించాం. భూరికార్డుల డిజిటలైజేషన్‌తో రైతుల భూముల వివరాలపై స్పష్టత ఆధారంగా.. నగదును రైతుల ఖాతాల్లో జమ చేయగలుగుతున్నాం. దేశంలో ఎక్కడా రైతులకు ఇంత భారీగా పెట్టుబడి సాయం అందట్లేదు. ఒకవేళ రైతు మరణిస్తే వారి కుటుంబాన్ని ఆదుకోవడానికి రైతుబీమా పథకం ప్రవేశపెట్టాం. రైతు మరణించిన 10 రోజుల్లోపే రూ. 5 లక్షల పరిహారం అందిస్తున్నాం.

బీసీల్లోని కులవృత్తిదారులకు రూ. లక్ష సాయం

రాష్ట్రంలో వెనుకబడిన తరగతుల్లోని కులవృత్తిదారుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించాం. ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున సాయం చేస్తాం. రజక, నాయీ బ్రాహ్మణ, విశ్వ బ్రాహ్మణ, కుమ్మరి, మేదరి తదితర కుటుంబాలకు ఈ పథకంతో ఎంతో లబ్ధి చేకూరుతుంది. గొల్ల, కురుమలకు భారీగా గొర్రెల పంపిణీని చేపట్టాం. తొలి విడతలో రూ.6,100 కోట్లతో 3.93 లక్షల మందికి 82.64 లక్షల గొర్రెలను పంపిణీ చేశాం. ప్రస్తుతం రెండో విడతలో రూ.5 వేల కోట్లతో 3.38 లక్షల మందికి గొర్రెల్ని పంపిణీని దశాబ్ది ఉత్సవాల్లోనే ప్రారంభిస్తాం.

ఉద్యమంలా దళితబంధు

దళితులు స్వశక్తితో, స్వావలంబనతో జీవించాలన్న ఆశయంతో 'దళితబంధు' పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలోని ప్రతి దళిత కుటుంబానికి రూ.10 లక్షలు నూరు శాతం గ్రాంట్‌గా అందిస్తోంది. దళితులు తమకు నచ్చిన ఉపాధిని ఎంచుకొని ఆత్మగౌరవంతో జీవించడానికి అండదండగా నిలుస్తోంది. దళితబంధు పథకం కింద ప్రభుత్వం ఇప్పటివరకు 50వేల మంది లబ్ధిదారులకు రూ. 5 వేల కోట్లు ఖర్చు చేసింది. ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.17,700 కో ట్లు కేటాయించాం. రెండో విడతలో భాగంగా 1.30 లక్షల మందికి దళితబంధు అందించనున్నాం.



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైకోర్టు ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి జస్టిస్ నవీన్‌రావు

అసెంబ్లీలో ఘనంగా దశాబ్ది వేడుకలు

శాసనసభలో పోచారం, మండలిలో గుత్తా జాతీయ పతాకావిష్కరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో శుక్రవారం వేడుకలు ఘనంగా జరిగాయి. అసెంబ్లీ ఆవరణలో శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలిలో చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసెంబ్లీ కార్యదర్శి డాక్టర్ వి.నర్సింహాచార్యులుతో పాటు ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బోగారపు దయానంద్, దండే విఠల్, నవీన్‌కుమార్, రఘోత్తమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కామారెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నల్లగొండ జిల్లా కేంద్రాల్లో జరిగిన దశాబ్ది ఉత్సవాల్లో పాల్గొనేందుకు బయల్దేరి వెళ్లారు.



అసెంబ్లీ ఆవరణలో గుత్తా, పోచారం తదితరులు

తెలంగాణ భవన్‌లో దశాబ్ది వేడుకలు

భారత్ రాష్ట్ర సమితి కార్యాలయం తెలంగాణ భవన్‌లో రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవం జరిగింది. పార్టీ సెక్రటరీ జనరల్ కె.కేశవరావు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాధన ఉద్యమ ఘట్టాలను మననం చేసుకున్నారు. పార్టీ కార్యాలయ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొన్నారు.

గవర్నర్ అయినా తెలంగాణ బిడ్డనే: దత్తాత్రేయ

పంజగుట్ట (హైదరాబాద్): రాజకీయంగా తాను ఎంత ఎదిగినా, గవర్నర్ అయినా ముందుగా తెలంగాణ బిడ్డనేనని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ చైర్మన్ బండారు విజయలక్ష్మి తెలంగాణ రాష్ట్ర సాధనలో ముఖ్య భూమిక పోషించిన ప్రముఖులకు ఆత్మీయ సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర మాజీ గవర్నర్ సి.హెచ్.విద్యాసాగర్‌రావు, తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, ప్రజా యుద్ధనౌక గద్దర్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, ఉద్యమకారులు గాదె ఇన్నయ్య, మాజీమంత్రి మేచినేని కిషన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు చింతల రామచంద్రారెడ్డి, ఎండల లక్ష్మీనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. తెలంగాణలోని భిన్న భావజాలాలు ఉన్న అందరినీ ఐక్యం చేసేందుకే అలయ్ బలయ్ స్థాపించినట్లు తెలిపారు.



అమరవీరుల స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న దత్తాత్రేయ తదితరులు

అత్యున్నత స్థానానికి ఉన్నత విద్య: లింబాద్రి

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యారంగంలో అంతర్జాతీయ ప్రమాణాలు తేవడమే తమ లక్ష్యమని, రాష్ట్ర ఉన్నత విద్యను దేశంలోనే అత్యున్నత స్థానంలో నిలబెట్టేందుకు అవిరళ కృషి చేస్తామని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి జాతీయ పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అట్టడుగు వర్గాలకు ఉన్నత విద్యను దగ్గర చేసేందుకు మండలి సరికొత్త ప్రయోగాలు చేస్తోందని తెలంగాణ అవతరణ తర్వాత ఉన్నత విద్యలో అనేక సంస్కరణలకు నాంది పలికామని తెలిపారు. విదేశీ యూనివర్సిటీలతో కలిసి, ప్రపంచ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫీజులు, క్రమబద్ధీకరణ కమిటీ చైర్మన్ జస్టిస్ ఎ.గోపాల్‌రెడ్డి, మండలి కార్యదర్శి ప్రొఫెసర్ ఎన్.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ ప్రకాశ్ పాల్గొన్నారు.



ఉద్యమ ఆకాంక్షలు కనుమరుగు: షర్మిల

సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక రాష్ట్రంలోనూ ఉద్యమ ఆకాంక్షలు, ఆశయాలు కనుమరుగవుతున్నాయని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. శుక్రవారం లోటస్‌పాండ్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన ఆమె.. పార్టీ కార్యకర్తలకు మిఠాయిలు, సకినాలు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగం, సబ్బండ వర్గాల పోరాట ఫలితం 'తెలంగాణ'అని, అది కూడా నీళ్లు, నిధులు, నియామకాల కోసం మూడు కోట్ల మంది ఏకమై కొట్లాడితే వచ్చిందని అన్నారు. ఉద్యమ ఆకాంక్షలు నెరవేరాలంటే మళ్లీ మరో పోరాటం జరగాలన్నారు. ఈ సర్కారు మారితేనే బతుకులు మారుతాయన్నారు. వ్యవసాయం పండుగ కావాలన్నా, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు కావాలన్నా వైఎస్సార్ సంక్షేమ పాలన రావాలని స్పష్టం చేశారు. నిధులు పక్కదారి పడుతుంటే, తెలంగాణ సంపద కేసీఆర్ కుటుంబం చేతిలో బందీ అయితే.. ప్రశ్నించే గొంతుకగా తమ పార్టీ నిలిచిందన్నారు. రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేస్తే ఎదురు నిలిచి, ప్రశ్నించిందని గుర్తుచేశారు.



ప్రజాస్వామిక తెలంగాణ కోసం మరో పోరాటం

ప్రొఫెసర్ కోదండరాం

పంజగుట్ట (హైదరాబాద్): 'తెలంగాణ వస్తుంది.. కానీ ప్రజాస్వామిక తెలంగాణ రాదు. అందుకు మరో పోరాటం చెయ్యాల్సిందే'అని ముందుగానే చెప్పిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి ఆధ్వర్యంలో సమితి అధ్యక్షుడు మేచినేని కిషన్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన కోదండరాం మాట్లాడుతూ .. అభివృద్ధి కేవలం హైదరాబాద్ చుట్టే పరిమితమయ్యిందని, మనం కోరుకున్నట్లు అభివృద్ధి అందరికీ సమానంగా జరగడం లేదని అన్నారు. ప్రస్తుత పాలనకు వ్యతిరేకంగా మరోమారు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యమకారుల సంక్షేమాన్ని ఈ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ రైతు విభాగం నేత కోదండరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమాన్ని కేసీఆర్ హైజాక్ చేశారన్నారు. మాజీ మంత్రి మేచినేని కిషన్‌రావు మాట్లాడుతూ .. 'గతంలో అప్పటి టీఆర్ఎస్ ఒక ఉద్యమ సంస్థ, దానికి రాజకీయం కూడా తోడైతే మరింత పటిష్టంగా ఉంటుందని అందరం కలసి పార్టీని ముందుకు తీసుకుపోతే ఇప్పుడు బీఆర్ఎస్‌లో ఉద్యమ ద్రోహులు, తెలంగాణకు మోసం చేసిన వారు, ఉద్యమకారులను హింసించిన వారు ఉన్నారు'అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్, ఇతర నేతలు రవీందర్ రెడ్డి, దుశ్చర్ల సుదర్శన్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

అసెంబ్లీ ఎన్నికలపైనే బీఆర్ఎస్ ఫోకస్!

- 2023 ముగిశాకే జాతీయ రాజకీయాలపై దృష్టి కేంద్రీకరించే యోచన
- జాతీయ స్థాయిలో విపక్షాల ఐక్యతపై ఆచితూచి అడుగులు వేయాలని నిర్ణయం
- కాంగ్రెస్, బీజేపీలకు సమదూరం పాటిస్తామనే సంకేతాలిచ్చే ఆలోచన
- రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వస్తే జాతీయ స్థాయిలో గ్రాఫ్ పెరుగుతుందనే భావన
- పూర్తిగా పార్టీ కార్యకలాపాలపైనే కేసీఆర్ దృష్టి



సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో విస్తరణ కోసం పార్టీని భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చినా.. ప్రస్తుతానికి రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపైనే దృష్టి కేంద్రీకరించాలని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు భావిస్తున్నట్టు తెలిసింది. మహారాష్ట్రలో పార్టీ కార్యకలాపాల విస్తరణ చేపట్టినా.. అంతకన్నా ముందు తెలంగాణలో పార్టీ కార్యకలాపాలకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించినట్టు సమాచారం. దక్షిణాది రాష్ట్రాల్లో వరుసగా తొమ్మిదేళ్లు సీఎంగా పనిచేసిన నేతగా ఇప్పటికే గుర్తింపు పొందిన కేసీఆర్.. మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ ఘనతను సొంతం చేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఆత్మీయ సమ్మేళనాల పేరిట ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఎన్నికల సన్నద్ధతను ప్రారంభించిన కేసీఆర్.. తాజాగా ప్రారంభమైన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను కూడా బీఆర్ఎస్ ఎన్నికల వ్యూహంలో అంతర్భాగం చేస్తున్నారు. 21 రోజుల పాటు జరిగే తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్ఎస్ యంత్రాంగాన్ని భాగస్వామ్యం చేస్తూ.. ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను ఆకట్టుకోవడం దిశగా అడుగులు వేస్తున్నారు. దశాబ్ది ఉత్సవాలు పూర్తికాగానే పూర్తిస్థాయిలో ఎన్నికల సమరానికి కార్యాచరణ ప్రకటించేందుకు కేసీఆర్ రంగం సిద్ధం చేస్తున్నట్టు తెలిసింది. ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో సభలు, సమావేశాల ద్వారా ఎన్నికల వాతావరణాన్ని వేడెక్కించి.. అక్టోబర్ 10న వరంగల్‌లో నిర్వహించే బహిరంగ సభతో ఎన్నికల సన్నద్ధతను పతాక స్థాయికి తీసుకెళ్లే యోచనలో కేసీఆర్ ఉన్నారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

అప్పటిదాకా విపక్షాలకు దూరమే!

జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలని భావిస్తున్న కేసీఆర్.. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ముగిసేవరకు విపక్ష పార్టీల ఐక్యత కోసం జరుగుతున్న ప్రయత్నాలకు దూరంగా ఉండాలని భావిస్తున్నట్టు తెలిసింది. జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు తాము సమదూరమనే సంకేతాలు ఇవ్వకుంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ రెండు జాతీయ పార్టీలు బీఆర్ఎస్‌ను లక్ష్యంగా చేసుకుంటాయనే అభిప్రాయంలో పార్టీ అధినేత ఉన్నారని బీఆర్ఎస్ వర్గాలు వివరిస్తున్నాయి. ఇటీవల ప్రగతిభవన్‌లో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో జరిగిన భేటీ సందర్భంగా కూడా జాతీయ రాజకీయాల్లో తమదైన శైలిలో ముందుకు వెళ్తామని కేసీఆర్ స్పష్టం చేశారని అంటున్నాయి. భావసారూప్య పార్టీలతో స్నేహభావంతో వ్యవహరిస్తామని చెప్తూనే.. జాతీయస్థాయిలో విపక్షాల ఐక్యతపై ఆచితూచి అడుగులు వేయాలని సీఎం భావిస్తున్నారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇక అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలువడ్డాకే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్ల కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకోవాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఉన్నారని అంటున్నాయి.

జాతీయ స్థాయిలో గ్రాఫ్ పెంచుకునేందుకూ..

రాష్ట్రంలో వరుసగా మూడోసారి అధికారం చేపట్టడం ద్వారా జాతీయస్థాయిలో గ్రాఫ్ పెంచుకోవాలని కేసీఆర్ భావిస్తున్నట్టు తెలిసింది. ఏడాది చివరిలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తే.. 2024 ఆరంభంలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి ఆకర్షణ పెరుగుతుందని సీఎం లెక్కలు వేస్తున్నారు. 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత పొరుగున ఉన్న మహారాష్ట్ర, కర్ణాటకలలోని సుమారు 20 లోక్‌సభ స్థానాలపై కేసీఆర్ దృష్టి కేంద్రీకరించే అవకాశముందని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. అవసరమైతే పొరుగున ఉన్న మహారాష్ట్రలోని నాందేడ్ లేదా ఔరంగాబాద్ నుంచి కేసీఆర్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసే అవకాశముందని మహారాష్ట్ర బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది.



సిరిసిల్లలో అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న మంత్రి కేటీఆర్

దేశానికే మోడల్‌గా తెలంగాణ

- కేసీఆర్ పటిష్ట కార్యాచరణతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధి: కేటీఆర్
- 'తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది'అనే స్థాయికి చేరుకున్నాం
- సంక్షేమం, సంస్కరణలతో అత్యుత్తమ పాలన అందిస్తున్నట్టు వెల్లడి
- సిరిసిల్లలో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న మంత్రి

సిరిసిల్ల: తొమ్మిదేళ్లలో తెలంగాణ దేశానికి మోడల్‌గా మారిందని.. 'తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తోంది'అని చెప్పుకునే స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. శుక్రవారం రాజన్నసిరిసిల్ల కలెక్టరేట్‌లో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన ఆర్థికావృద్ధికి పెరిగిన తలసరి ఆదాయమే కొలమానమని చెప్పారు. 2013–14లో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,12,162గా ఉంటే.. ఇప్పుడు రూ.3,17,115కు చేరిందన్నారు. అదే జాతీయ తలసరి ఆదాయం రూ.1,70,620 మాత్రమేనని తెలిపారు. తెలంగాణ దేశంలో 18 రాష్ట్రాల కంటే మెరుగైన వృద్ధి రేటును సాధించిందన్నారు. సీఎం కేసీఆర్ ఆర్థిక క్రమశిక్షణ, పటిష్ట కార్యాచరణతోనే ఇది సాధ్యమైందన్నారు. కరోనా వంటి సంక్షోభాలు ఎదురైనా.. తట్టుకుని తెలంగాణ రాష్ట్రం బలీయమైన ఆర్థికశక్తిగా నిలబడిందని వివరించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రైతులకు పెట్టుబడి సాయం ఇస్తూ.. బీమా కల్పిస్తున్నామని కేటీఆర్ చెప్పారు.

సంక్షేమం.. సంస్కరణలు

రాష్ట్రం సంక్షేమ రంగంలో ఆదర్శంగా నిలుస్తోందని.. ఆసరా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, డబుల్ బెడ్రూం ఇళ్లు, కేసీఆర్ కిట్లు, కంటివెలుగు, ఆరోగ్యలక్ష్మి, దళితబంధు, మైనార్టీ సంక్షేమం వంటి కార్యక్రమాలను అమలు చేస్తోందని కేటీఆర్ చెప్పారు. అవినీతి రహిత పాలన అందించేందుకు, భూ సమస్యలను శాశ్వతంగా తొలగించేందుకు 'ధరణి'ని తెచ్చామన్నారు. పల్లెప్రగతి, పట్టణ ప్రగతితో దేశంలోనే ఉత్తమ పంచాయతీలను, పట్టణాలను తీర్చిదిద్దామని చెప్పారు. పోడు భూములకు పట్టాలు ఇస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్రంలో జలవిప్లవాన్ని సాధించామని.. దాని పునాదులతో హరిత విప్లవం (పచ్చదనం), గులాబీ విప్లవం (మాంసం), నీటి విప్లవం(చేపలు), క్షీర విప్లవాల (పాలు)తో దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నామన్నారు.

ఆసక్త భావము లేకపోవడము; పుత్రులు, భార్య, గృహము మొదలైన వాటితో తాదాత్మ్యము చెందకపోవడము, ఇంద్రియ విషయాలలో అహంకారం లేకపోవడము... జ్ఞానము. దానికి భిన్నమైనది అంతా అజ్ఞానము.

– భగవద్గీత

సాక్షి

శనివారం, 3 జూన్ 2023

గండం గట్టెక్కిన అమెరికా

ఎట్టకేలకు ఒక పెను సంక్షోభం సమసిపోయింది. కరోనా మహమ్మారి, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం తర్వాత ప్రపంచాన్ని మింగేసే మూడో ముప్పుగా ఆర్థిక నిపుణులు అభివర్ణించిన అమెరికా గరిష్ఠ రుణపరిమితి (డెబిట్ సీలింగ్) సంక్షోభంపై పాలక డెమాక్రాటిక్ పార్టీ, విపక్ష రిపబ్లికన్ పార్టీల మధ్య చివరి నిమిషంలో కుదిరిన అవగాహన పర్యవసానంగా కథ సుఖాంతమైంది. నిజానికి కరోనా మహమ్మారి, రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ఊహించని రీతిలో వచ్చిపడ్డాయి. కానీ అమెరికా సంక్షోభం అలా కాదు. అది పేలడానికి సిద్ధంగా ఉన్న టైమ్ బాంబు మాదిరి కొన్ని నెలలుగా ప్రపంచాన్ని తీవ్రంగా భయపెడుతోంది. అమెరికా ఆర్థిక వ్యవస్థతో ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలన్నీ ముడిపడి ఉండటమే ఇందుకు కారణం. ప్రపంచంలో అత్యంత సంపన్న దేశంగా, అగ్రరాజ్యంగా ఉన్న అమెరికా తన ఆర్థిక వ్యవస్థను దశాబ్దాలుగా క్రమశిక్షణతో నడపలేకపోవటమే ఈ సమస్యకు మూలం. తొలిసారి 1917లో గరిష్ఠ రుణ పరిమితి పెంపునకు అమెరికన్ కాంగ్రెస్ అనుమతించగా, ఆ తర్వాత 1939లో, 1941లో రుణ సేకరణకు ప్రత్యేక చట్టాలు చేయాల్సివచ్చింది. ఇక అది రివాజుగా మారింది. ఆ తర్వాత 2011 వరకూ 78సార్లు గరిష్ఠ రుణ పరిమితికి అమెరికన్ కాంగ్రెస్ ఆమోద ముద్ర వేయాల్సివచ్చింది. అమెరికా ప్రస్తుత గరిష్ఠ రుణ పరిమితి 31.4 లక్షల కోట్ల డాలర్లు కాగా, దాన్ని మరింత పెంచేందుకు ప్రతినిధుల సభ, సెనేట్ తాజాగా అంగీకరించాయి. రుణ పరిమితిని పెంచే బదులు ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవాలంటూ మొన్న ఏప్రిల్‌లో రిపబ్లికన్ పార్టీ పట్టు బట్టడంతో జో బైడెన్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో పడింది. రిపబ్లికన్‌ల ఆధిక్యత ఉన్న ప్రతినిధుల సభలో బైడెన్ సర్కార్ ప్రతిపాదించిన బడ్జెట్‌కు 4.8 లక్షల కోట్ల మేర కోత పెట్టే తీర్మానం ఏప్రిల్ నెలాఖరున ఆమోదం పొందింది. ఆ కోత తీర్మానం ద్వారా హరిత ఇంధన రంగ పెట్టుబడులకు ప్రభుత్వం ఇవ్వదల్చుకున్న పన్ను మినహాయింపులకూ, విద్యార్థుల రుణాల మాఫీకీ రిపబ్లికన్‌లు మోకాలడ్డారు. ఈ చర్య అమెరికా పౌరులపైనా, దేశ ఆర్థిక వ్యవస్థపైనా తుపాకి గురిపెట్టడంతో సమానమని అమెరికా ఖజానా మంత్రి జానెట్ యెలెన్ మండిపడ్డారు. ఆ మాటెలావున్నా ప్రతినిధుల సభ, సెనేట్‌ల ఆమోదం లభించకపోతే ఆపద్ధర్మంగా బైడెన్ 14వ రాజ్యాంగ సవరణ ద్వారా తనకు లభించే విశేషాధికారాలతో ప్రత్యేక చర్య తీసుకునే వీలుంటుంది. కానీ అది సంక్షోభాన్ని తాత్కాలికంగా ఒకటి రెండు నెలలు వాయిదా వేయగలదే తప్ప నివారించలేదు. ఫైనాన్షియల్ మార్కెట్లలో అనిశ్చితిని పోగొట్టలేదు. అందుకే సమస్యకు పరిష్కారం సాధ్యమా కాదా అన్న సంశయంలో ప్రపంచం పడిపోయింది. ఇరు పార్టీల మధ్యా ఒప్పందం కుదరకపోతే అమెరికా తన రుణాలను చెల్లించలేని స్థితిలో పడేది. టీచర్లు, పబ్లిక్ రంగ సంస్థల కార్మికులతో సహా లక్షలాది మంది ఉద్యోగుల జీతాలు నిలిపేయాల్సివచ్చేది. పింఛన్లు, అనేకానేక సాంఘిక సంక్షేమ పథకాలు కూడా ఆపాల్సివచ్చేది. కేవలం తాను చెల్లించక తప్పని రుణాలకూ, వడ్డీ చెల్లింపులకూ ప్రాధాన్యం ఇవ్వాల్సివచ్చేది. దాని సెక్యూరిటీలు పల్టీలు కొట్టేవి. సారాంశంలో అమెరికా ఆర్థిక వ్యవస్థ దివాలా తీసేది. ఒక అంచనా ప్రకారం స్వల్పకాల దివాలా అయినా కనీసం 5 లక్షల మంది ఉద్యోగులకు అది ముప్పుగా పరిణమించేది. మరింత కాలం కొనసాగితే అనేకానేక వ్యాపారాలూ మూతబడి 83 లక్షల ఉద్యోగాలు ఆవిరయ్యేవి. అంతేకాదు, అది కార్చిచ్చులా వ్యాపించి పలు దేశాల ఆర్థిక వ్యవస్థలను కుప్పకూల్చేది. ఇరుపక్షాలూ పరిణతి ప్రదర్శించటం వల్ల ప్రస్తుతానికైతే అంతా సర్దుకుంది. కానీ ముున్ముందు ఇదంతా పునరావృతం కాకమానదని గత చరిత్ర గమనిస్తే అర్థమవుతుంది.

అసలే ప్రపంచం ఆర్థిక మాంద్యం అంచుల్లో ఉంది. కరోనా మహమ్మారి లక్షలాదిమంది ప్రాణాలను బలితీసుకోవటంతోపాటు మహా మహా ఆర్థిక వ్యవస్థలనే తలకిందులు చేసింది. దాన్నుంచి బయటపడటం కోసం ప్రయత్నాలు సాగుతుండగానే రష్యా అధ్యక్షుడు పుతిన్ పొరుగునున్న చిన్న దేశం ఉక్రెయిన్‌పై దురాక్రమణకు దిగారు. కొన్ని నెలల్లో సమసిపోతుందనుకున్న ఆ దురాక్రమణ యుద్ధం ఏణ్ణర్థం నుంచి ఎడతెగకుండా సాగుతోంది. ఇదే అదునుగా రష్యాకు కళ్లెం వేసేందుకు అమెరికా యూరోప్ దేశాలన్నిటినీ ఏకం చేసి ఉక్రెయిన్‌కు సైనికంగా, ఆర్థికంగా అండదండలం దిస్తోంది. అదే సమయంలో రష్యాపై ఆంక్షల అస్త్రాన్ని ప్రయోగించింది. తమ సమస్త అవసరాలకూ రష్యాపై ఆధారపడక తప్పని యూరోప్ దేశాలు ఈ ఆంక్షల పర్యవసానంగా ఒడిదుడుకుల్లో పడ్డాయి. జర్మనీ ఆర్థిక మాంద్యంలో పడింది. ఈలోగా గోరుచుట్టుపై రోకటి పోటులా ఈ రుణ గరిష్ఠ పరిమితి సంక్షోభం వచ్చిపడింది.

తన శక్తిసామర్థ్యాలను తక్కువ అంచనా వేస్తున్నవారికి రిపబ్లికన్‌లతో ఒప్పందం ద్వారా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి షాక్ ఇచ్చారు. రిపబ్లికన్‌లకు చెందిన ప్రతినిధుల సభ స్పీకర్ మెకార్థీ తన పార్టీలోని అత్యుత్సాహులను కట్టడి చేయగలిగారు. అయితే అమెరికా డాలర్‌తో, అక్కడి ఫైనాన్షియల్ మార్కెట్లతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ముడిపడివున్న సంగతిని ఆ దేశం మరువ కూడదు. ప్రపంచంలో రెండో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న చైనాకు విశ్వసనీయత లేకపోవటంవల్ల తప్ప ఇందులో తన ప్రయోజకత్వం ఏమీ లేదని అది గుర్తించాలి. తాజా ఒప్పందం పర్యవసానంగా 2025 జనవరి వరకూ గండం గట్టెక్కినట్టే. ఆ తర్వాతైనా సమస్యలు తప్పవు. ఇప్పటికైనా అమెరికా సొంతింటిని చక్కదిద్దుకునే చర్యలు మొదలెట్టాలి. హద్దూ ఆపూలేని వ్యయానికీ, పన్నులకూ కళ్లెం వేసి హేతుబద్ధ విధానాలను రూపొందించుకోవాలి.

స్థిరమైన నిధులతోనే శాస్త్రీయ ప్రగతి

విశ్లేషణ



దినేశ్ సి. శర్మ

సాంకేతిక పరిజ్ఞాన రంగంలో సూపర్ పవర్‌గా ఎదగాలన్న లక్ష్యం అందుకోవాలంటే ఏ దేశమైనా తగినన్ని నిధులు, స్థిరంగా అందుబాటులో ఉంచాలి. మౌలిక పరిశోధనలపైనా దృష్టి పెట్టాలి. కోవిడ్–19 టీకా, కో–విన్, యూపీఐ వంటి డిజిటల్ అప్లికేషన్ల అభివృద్ధి... పెరుగుతున్న భారతీయ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యానికి అద్దం పడుతున్నాయి. ఈ విజయాలు దీర్ఘకాలం పరిశోధనలపై నిధులు ఖర్చుపెట్టిన ఫలితమే. దశాబ్దాలపాటు నాణ్యమైన విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తూండటం, వాటి పోషణకు తగిన నిధులు కేటాయించడం వల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న జాతీయ పరిశోధన సంస్థల సాంకేతిక సామర్థ్యాన్ని దశాబ్దాలుగా ప్రైవేటు రంగమూ ఉపయోగించుకుంది.

హింగోలి మహారాష్ట్ర మరాఠ్వాడా ప్రాంతంలోని జిల్లా కేంద్రం. 1948 వరకూ హైదరాబాద్ నిజాం రాజ్యం పరిధిలో ఉండేది. అప్పట్లో ఈ ప్రాంతాన్ని మిలిటరీ కేంద్రంగానూ వాడుకునేవారు. తాజాగా ఈ జిల్లాకు సరికొత్త గుర్తింపు లభిస్తోంది. అంతర్జాతీయ సైన్స్ ప్రాజెక్టు 'లేజర్ ఇంటర్ ఫెరోమీటర్ గ్రావిటేషనల్ వేవ్ అబ్జర్వేటరీ' క్లుప్తంగా 'లిగో'కు కేంద్రంగా ఇది అవతరించనుంది. ఈ మహా భౌతిక శాస్త్ర ప్రయోగ శాల కాస్మిక్ గ్రావిటేషనల్ వేవ్స్‌ను గుర్తించేందుకు ఉద్దేశించింది. ఇలాంటివే అమెరికాలోని హాన్‌ఫర్డ్, లివింగ్‌స్టోన్ ప్రాంతాల్లో ఉన్నాయి. మరోరెండు ఇటలీ, జపాన్‌లలో ఉన్నాయి. 2030 నాటికి హింగోలిలోనూ ఈ వేధశాల నిర్మాణం పూర్తయితే ప్రపంచవ్యాప్త నెట్‌వర్క్ సంపూర్ణమవుతుంది. నాలుగు కిలోమీటర్ల పొడవైన భుజాల్లాంటి నిర్మాణాలు... ఎల్ ఆకారంలోని ఇంటర్‌ఫెరోమీటర్‌లతో కూడిన ఈ ప్రయోగశాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. న్యూఢిల్లీలోని ప్రగతి మైదాన్‌లో నేషనల్ టెక్నాలజీ డే సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని ఆన్‌లైన్‌లో రూ.1,200 కోట్ల విలువైన హింగోలి లిగో ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఎంతో ప్రతిష్ఠాత్మ కమైన ఈ ప్రాజెక్టును భారత్ చేపట్టడం హర్షణీయమైన విషయమై నప్పటికీ ఇలాంటి భారీ ప్రాజెక్టులు, మౌలిక శాస్త్ర పరిశోధనల విషయంలో భారత్ వైఖరి ఎలా ఉందన్న విషయాన్ని సమీక్షించేందుకు ఒక అవకాశాన్ని కల్పిస్తోంది.

ఎంత 'వేగం'గా సాగుతున్నాయంటే...

లిగో ప్రాజెక్టు ఆలోచనలకు బీజం పడ్డది 2009 లోనే. భారతీయ శాస్త్ర పరిశోధన సంస్థలకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు కలిసికట్టుగా గ్రావిటేషనల్ వేవ్స్‌పై పరిశోధనలు చేస్తూండేవారు. ఆ క్రమంలోనే భారత్‌లో గ్రావిటేషనల్ వేవ్స్ వేధశాల ఏర్పాటు చేయాలన్న ఆలోచన పుట్టింది. రెండేళ్ల తరువాత అమెరికాలోని లిగో పరిశోధనశాల తమ పరిశోధనల్లో భాగం కావాలని భారత శాస్త్రవేత్తలకు ఆహ్వానం పలికింది. ఆ ఏడాదే భారత శాస్త్రవేత్తలు విస్తృత చర్చల తరువాత ఇండియన్ లిగో ఏర్పాటుకు సంబంధించి, భారత అణుశక్తి విభాగానికి ఒక ప్రతిపాదన చేశారు. 2012లో ఈ ప్రాజెక్టును చేపట్టేందుకు పచ్చజెండా ఊపుతూ ఓ కమిటీ నిధులు కేటాయించాల్సిందిగా అభ్యర్థించింది. నాలుగేళ్ల వివిధ ప్రభుత్వ విభాగాలకు చక్కర్లు కొట్టిన ఈ ప్రతిపాదనకు కేంద్ర మంత్రిమండలి 2016లో 'సూత్రప్రాయ అంగీకారం' తెలిపింది. ఆ తరువాత సుమారు ఏడేళ్ల నిరీక్షణ తరువాత ఈ ప్రాజెక్టుకు తుది అనుమతులు లభించాయి. దేశంలో సైన్స్ ప్రాజెక్టులు ఎంత 'వేగంగా' అమలవుతాయో తెలిపేందుకు ఈ ఉదాహరణ చాలు.

హింగోలి ప్రాజెక్టు అమల్లో జరిగిన జాప్యం ఇంకో విషయాన్నీ గుర్తు చేస్తుంది. దేశంలో పరిశోధనల కోసం కేటాయిస్తున్న నిధుల్లో



పెరుగుదల లేకపోవడాన్ని ఎత్తి చూపుతుంది. స్థూల జాతీయోత్పత్తిలో పరిశోధనలకు (ఆర్ అండ్ డీ) కేటాయించిన నిధులు దశాబ్ద కాలంగా కేవలం 0.7 శాతం మాత్రమేనని నీతి ఆయోగ్ గత ఏడాది విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది. ఈ మొత్తాదు బ్రెజిల్ (1.6 శాతం), దక్షిణాఫ్రికా (0.83) కంటే తక్కువ కావడం గమనార్హం. పొరుగు దేశం చైనా తన స్థూల జాతీయోత్పత్తిలో ఏకంగా 2.14 శాతం 'ఆర్ అండ్ డీ'కి కేటాయిస్తోంది. కేటాయింపులు అత్యల్పంగా ఉంటే పరిశోధనా రంగంలో పురోగతి సాధ్యం కాదని నీతి ఆయోగ్ తన నివేదికలో విస్పష్టంగా తెలిపింది.

లక్ష్యాలూ అస్పష్టమే...

2013లో భారత్ తన 'ద సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నొవేషన్' పాలసీలో 2020 నాటికల్లా శాస్త్ర పరిశోధనల రంగంలో టాప్–5లోకి చేరాలని సంకల్పం చెప్పుకొంది. తొమ్మిదేళ్ల తరువాత ఇదే పాలసీని ఆధునికీకరించారు. 2030 నాటికి నాణ్యమైన పరిశోధన ఫలితాలు సాధించే టాప్–5 దేశాల్లోకి భారత్ చేరాలన్న అస్పష్ట లక్ష్యం గురించి ఈ విధానంలో పేర్కొన్నారు. పదాలతో గారడీ చేయడం కంటే పరిశోధనలకు స్థిరంగా నిధులు కేటాయించడం మేలన్న విషయం మన విధాన నిర్ణేతలకు అర్థం కావడం లేదు. ఇటీవలి కాలంలో కోవిడ్–19 టీకా తయారీలో సాధించిన విజయం, కో–విన్, యూపీఐ వంటి డిజిటల్ అప్లికేషన్ల అభివృద్ధి... పెరుగుతున్న భారతీయ సాంకేతిక పరిజ్ఞాన సామర్థ్యానికి అద్దం పడుతున్నాయి. ఈ విజయాలు దీర్ఘకాలం పరిశోధనలపై నిధులు ఖర్చుపెట్టిన ఫలితమే అన్నది విస్మరించరాదు. దశాబ్దాలపాటు నాణ్యమైన విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తూండటం, వాటి పోషణకు తగిన నిధులు కేటాయించడం వల్లనే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడుస్తున్న జాతీయ పరిశోధన సంస్థల సాంకేతిక సామర్థ్యాన్ని దశాబ్దాలుగా ప్రైవేటు రంగమూ ఉపయోగించుకుంది. కోవిడ్ టీకా, జెనెరిక్ మందుల అభివృద్ధినే తీసుకుందాం. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు చాలాకాలం క్రితమే మందులు, టీకాల తయారీ, క్లినికల్ ట్రయల్స్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ చేశాయి. ఈ ఏర్పాట్లు 1970 నుంచి ప్రైవేట్ రంగం ఎదుగుదలకు పునాదిగా నిలిచాయి.

డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ, టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డ్ వంటివి భారత్ బయోటెక్, శాంతా బయోటెక్ వంటి సంస్థలకు తొలినాళ్ల నుంచి అండదండగా నిలిచాయి. ప్రైవేట్ రంగంలోని టీకా తయారీ కంపెనీలకు వందల కోట్ల నిధులు అందించారు కూడా. సుమారు 30 – 40 ఏళ్లుగా జరుగుతున్న ఈ కార్యక్రమాలు కోవిడ్ మహమ్మారి దాడి చేసిన వెంటనే అక్కరకు వచ్చాయి. ఐటీ రంగానికీ ఇది వర్తిస్తుంది. కంప్యూటర్ సైన్స్, గణిత, భౌతిక శాస్త్రాల్లో పరిశోధనల ఫలితంగానే ఐటీ రంగం వృద్ధి చెందింది. అల్గారిథమ్స్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, క్రిప్టోగ్రఫీ నెట్‌వర్కింగ్ రంగాల్లో జరిగిన మౌలిక పరిశోధనలే కంప్యూటర్లు, ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్ల అభివృద్ధికి కారణమయ్యాయి. భారతీయ విద్యాసంస్థల్లో కంప్యూటర్ సైన్స్ విద్యా బోధనకు దేశం చాలా ముందుగానే పెట్టుబడులు పెట్టింది. రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీలు (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలని ఇప్పుడు పిలుస్తున్నారు), తరువాతి కాలంలో ట్రిపుల్ ఐటీల ఏర్పాటు కూడా ఈ ప్రయత్నాల్లో భాగమే. ప్రభుత్వ రంగంలో పెట్టిన ఈ పెట్టుబడుల ఫలితాలను ప్రైవేట్ రంగమూ పొందింది. ఆ క్రమంలోనే సరికొత్త డిజిటల్ అప్లికేషన్ల అభివృద్ధికి దారితీసింది. ప్రస్తుత డిజిటల్ విప్లవం వెనుక ప్రభుత్వ రంగ సంస్థలైన నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్, సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, నేషనల్ పేమెంట్ కార్పొరేషన్‌లు అభివృద్ధి చేసిన ఈ–గవర్నెన్స్, ఇతర డిజిటల్ అప్లికేషన్ల భూమికను విస్మరించలేము.

సాంకేతిక పరిజ్ఞాన రంగంలో సూపర్ పవర్‌గా ఎదగాలన్న లక్ష్యం అందుకోవాలంటే ఏ దేశమైనా తగినన్ని నిధులు, స్థిరంగా అందుబాటులో ఉంచాలి. అదే సమయంలో మౌలిక పరిశోధనలపైనా దృష్టి పెట్టాలి. దిగుమతి చేసుకున్న హార్డ్‌వేర్, విజ్ఞానంతో టెక్నలాజికల్ అప్లికేషన్ల అభివృద్ధిపై దృష్టి పెట్టడం వల్ల మనం ఇతరులపై ఆధారపడే స్థితి వస్తుంది. మౌలిక రంగ పరిశోధలు ఎన్నో రకాల ఇతర ప్రయోజనాలు అందిస్తాయి. పారిశ్రామిక, సామాజిక లాభాలూ ఒనగూరుతాయి. సర్వవ్యాప్తమైన డిజిటల్ కెమెరా, మెడికల్ ఇమేజింగ్, ఇంటర్నెట్‌లన్నీ ఇందుకు ఉదాహరణలు. వాతావరణ మార్పులు, ప్రజారోగ్యం, ఆహార భద్రత వంటి అతి సంక్లిష్టమైన ప్రపంచస్థాయి సమస్యల పరిష్కారానికీ మౌలిక పరిశోధనలే ఆధారం. రేపటి తరం టెక్నాలజీల కోసం ఈ రోజే సైన్స్‌పై పెట్టుబడులు పెట్టడం అవశ్యం.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత

('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎన్ని నీళ్లు వృథా!



డ్యామ్‌లో పడిన తన ఫోన్‌ను తీసుకోవడానికి మొత్తం నీటిని ఖాళీ చేయించిన అధికారికి 53,092 రూపాయల జరిమానా విధించారు. అతడిని చాలాకాలం జైల్లో ఎందుకు పెట్టకూడదు? ఈ జరిమానా అతడి ఫోన్ ఖరీదుకు కూడా సమానం కాదు. (ఛత్తీస్‌గఢ్‌లోని ఖేర్‌కట్టా దగ్గర రాజేశ్ విశ్వాస్ సెల్ఫీ తీసుకుంటూ లక్ష రూపాయల ఫోన్ పారేసుకున్నాడని వార్త.)

– అనిందా సర్దార్, యాత్రికుడు

అదేం గొప్పది అనుకోవద్దు!



ఒక స్కాటిష్ పెద్ద మనిషితో గోల్ఫ్ ఆడుతున్నాను. ఆయన్ని మొదటిసారి కలిశాను. నాకు నచ్చే సింగిల్ మాల్ట్స్, నేను దర్శించిన మంచి డిస్టిల్లరీల గురించి చెప్పాను. ఆయన ఓపిగ్గా విని, మర్యాదగా, 'సారీ, నాకు సింగిల్ మాల్ట్ నచ్చదు' అన్నారు. మూస అభిప్రాయాలకు ఎన్నడూ పడిపోవద్దు.

– పర్మిందర్ సింగ్, 'గూగుల్' మాజీ ఎండీ

పిల్ల పిడుగు



నా పదేళ్ల అబ్బాయి గర్భంలో ఉండగా తన అనుభవానికి రేటింగ్ ఇస్తున్నాడు. "ఎక్కువగా సెల్ఫ్ సర్వీస్, బఫే చాలేది కాదు, ఏసీ లేదు, వైఫై లేదు, ఆతిథ్యం బాలేదు. ఈ ఇంటికి ఒక్క స్టార్ ఇస్తా."

– రీతూపర్ణా ఛటర్జీ, జర్నలిస్ట్

మంచి మాట



'కొన్ని వర్గాలు బయటినుంచి వచ్చాయి. ఇప్పుడవి మనవే' అన్నారు మోహన్ భాగవత్. ఆరెస్సెస్ అధినేత నుంచి ఇలాంటి సానుకూల ప్రకటనలు రావడం మత విభేదాలను పూడ్చగలుగుతుంది.

– ఎస్.వై. ఖురేషి, కేంద్ర ఎన్నికల మాజీ ప్రధాన కమిషనర్

చూపించడానికే!



ఫొటోలు తీసుకోవడానికి అనుమతించకపోతే కూడా ఎవరైనా ట్రెక్కింగ్, ప్రయాణాలు చేస్తారా? నేననుకోవడం చాలామంది చేయరు.

– పర్వీన్ కాశ్వాన్, ఐఎఫ్ఎస్ అధికారి

ఒక నాయకుడు... ఎన్నో విలువలు!

సందర్భం



రావి ప్రతిభారెడ్డి

''తెలంగాణాలో నిజాం రాజు ఆయన పెంచి పోషించిన రజాకార్లకు వ్యతిరేకంగా ఇక్కడి రైతాంగం ఒక్కటై సాయుధ పోరాటం చేయకపోతే కాంగ్రెస్ – ఏడవ నిజాం ఉస్మాన్ అలీఖాన్ మధ్య యథాతథ ఒడంబడిక (స్టాండ్‌స్టిల్ అగ్రిమెంట్)తో ఇద్దరి మధ్య రాజీ కుదిరి హైదరాబాద్ సంస్థానం భారతదేశ గుండెల మీద కుంపటిలా తయారయ్యేది. కశ్మీర్‌లా నిత్యం రావణ కాష్టాన్ని రగిలించేది. తెలంగాణ సాయుధ పోరాటం వీటన్నంటినీ భగ్నం చేసి భారతదేశ స్వతంత్రత, సమైక్యతలను సాధించింది. అంతకు మించి దేశమంతా భూ ప్రాముఖ్యతను ముందుకు తెచ్చింది.'' ఇవి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట సేనాని రావి నారాయణరెడ్డి 'నా అనుభవాలు – జ్ఞాపకాలు' పేరుతో రాసుకున్న స్వగతంలోని కొన్ని అంశాలు. నిజమే. భారతదేశ చరిత్రలో ఏ ప్రాంతానికి లేని పోరాట చరిత్ర తెలంగాణాకు ఉంది.



రావి నారాయణరెడ్డి

1947కు పూర్వం హైదరాబాద్‌లో కనీస హక్కుల్లేకుండా వెట్టిచాకిరీలో జనం మగ్గారు. మతపరమైన వివక్ష, భాషా వివక్షలు ఉండేవి. శిక్షల్లోనూ సాధారణ జనాలను రెండవ తరగతి శ్రేణులుగా పాలకులు పరిగణించారు. ఈ పరిస్థితుల్లో భువనగిరి సమీపంలోని బొల్లేపల్లిలో భూస్వామ్య కుటుంబంలో రావి నారాయణరెడ్డి జన్మించారు. నిజాం కాలేజీలో ఉన్నత విద్యను అభ్యసిస్తూ గొప్ప క్రీడాకారునిగా దేశానికే ప్రాతినిధ్యం వహించే స్థాయికి చేరారు. కానీ ప్రజల కష్టాలను చూసి పిన్న వయసులోనే ఉద్యమ పంథాను ఎంచుకున్నారు. విద్యార్థి దశలోనే వందమంది యువకులతో కలిసి గాంధీజీ నిర్వహించిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ఆ స్ఫూర్తిని హైదరాబాద్ సంస్థానంలో నింపే ప్రయత్నం చేశారు. మహాత్మా గాంధీ హైదరాబాద్ వచ్చిన సందర్భంలో 'హరిజన సేవ సంఘం' ఆధ్వర్యంలో నడిచే పాఠశాలల కోసం తన భార్య నగలమ్మి రూ. 2000లను విరాళంగా ఇచ్చారు. దున్నే వానికే భూమి ఉండాలన్న నినాదంతో భూదాన ఉద్యమం కంటే ముందుగానే తన వాటాగా వచ్చిన ఐదు వందల ఎకరాల భూమిని దళితులు, ఇతర కులాల వారిగా దానం చేసి భూదాన యోధుడిగా నిలిచారు.

నిజాం పాలనలో జాగిర్దార్‌లు, దేశ్‌ముఖ్‌ల అధీనంలోని భూములను పేదలకు పంచితే తప్ప కూలీ నాలీల జీవితాల్లో సాంఘిక, ఆర్థిక మార్పులు సాధ్యం కాదని నిర్ణయించుకుని తొలుత సత్యాగ్రహ పోరాటం, ఆపై సాయుధ పోరాట రూపంలో 4 వేల గ్రామాల్లో ప్రజారాజ్యాల ఏర్పాటుకు నాయకత్వం వహించారు. రావి నాయకత్వంలో ప్రజా గెరిల్లాలు–గ్రామ రక్షక దళాల ఆధ్వర్యంలో విముక్తి ప్రాంతాల సంఖ్యను పెంచుకుంటూ పోతున్న సమయంలో భారత సైన్యాలు 'ఆపరేషన్ పోలో'లో భాగంగా హైదరాబాద్ సంస్థానంలో ప్రవేశించి దాన్ని భారత్‌లో విలీనం చేశాయి.


విలీనం తర్వాత నిర్బంధంతో ఎక్కువ కాలం గెరిల్లా పోరు చేయటం నష్టమన్న నిర్ణయంతో పంథా మార్చిన రావి తమ పోరును ఎన్నికల వైపు మళ్లించారు. తొలి లోక్‌సభ ఎన్నికల్లో నల్లగొండ నుండి పోటీచేసి ఏకంగా 3,91,162 ఓట్లు సాధించి దేశంలోనే అత్యధిక ప్రజా మద్దతుతో పార్లమెంటులో అడుగుపెట్టారు. 1957లో భువనగిరి అసెంబ్లీ నుండి విజయం సాధించి ప్రతి పక్షనాయ కునిగా వ్యవహరించారు. విద్యార్థి దశ నుండి చివరి అంకం వరకు దోపిడీ, పేదరికం లేని సమ సమాజం కోసం తపించిన మహానాయకుని స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉంది.

వ్యాసకర్త రావి నారాయణరెడ్డి మనవరాలు

(రేపు రానారె జయంతి సభ హైదరాబాద్‌లో జరగనుంది.)

ఇస్తడో ఇయ్యడో – వొస్తదో రాదో

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల లైటు బుగ్గలు ఎల్గినయి. గా దినం ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

పొద్దు మీకంగనే మా దోస్తులందరు పాన్ డబ్బ కాడ జమైతరు.

''కాంగ్రెస్ అన్ని పార్టీల అసువంటిది గాదు. దాని తీరే అలగ్'' అని యాద్గిరి అన్నడు.

''గదెట్ల?'' అని సత్నారి అడిగిండు.

''కర్నాటకల కాంగ్రెస్ సర్కార్ వొచ్చింది. కిరికిరి అయినంక ఆకర్కి సిద్దరామయ్య ముఖ్యమంత్రి అయ్యిండు. ముఖ్యమంత్రి కుర్సి గావాలని గాయిన, శివకుమార్ ఒక్క తీర్గ కొట్లాడిండ్రు. గని స్పీకర్ కుర్సి కోసం ఒక్క ఎమ్మెల్యే గుడ్క ముంగట్కి రాలేదు. నాకొద్దు అంటె నాకొద్దు అని గాల్లు అనబట్టిండ్రు.''

''గదేంది?''

''కర్నాటకల ఒకపారి స్పీకర్ కుర్సి మీద కూసున్నోల్లు మల్లొచ్చె ఎలచ్చన్ల ఓడిపోతున్నరట. దాంతోని తొమ్మిది పార్లు ఎమ్మెల్యే అయిన మాజీ మంత్రి దేశ్‌పాండె, ఏడుసార్లు ఎమ్మెల్యే అయిన జయచంద్ర గుడ్క స్పీకర్ కుర్సి నా కొద్దు అంటె నా కొద్దు అన్నరు.''

''స్పీకర్ సంగతిని ఎట్ల తప్ప జేసింద్రు?''

''ఒక్క తీర్గ బత్మిలాడి బుద్ధరిచ్చి మాజీ మంత్రి ఖాదర్‌ను స్పీకర్ కుర్సి మీద గూసుండబెట్టింద్రు.''

''గాయిన ఎట్ల ఒప్పుకుండు?''

''సిద్దరామయ్య రొండున్నర ఏండ్లు ముఖ్యమంత్రిగ ఉంటడు. గాయిన ముఖ్యమంత్రి కుర్సి మీద గూసున్నంత దన్క స్పీకర్ కుర్సి మీద గూసో. అటెంకల శివకుమార్ ముఖ్యమంత్రి అయితడు. గప్పుడు నీకు మంత్రి కుర్సి ఇస్తమని జెప్పింద్రు.''

''నిజంగ ఇస్తరా?''

''ఇస్తరో ఇయ్యరో నాకెర్క లేదు. గని గాయినకు మంత్రి కుర్సి ఇయ్యాలంటె ముందు గాల్ల సిద్దరామయ్య ముఖ్యమంత్రి కుర్సి మీద కెల్లి దిగాలె. ఒకపారి ముఖ్యమంత్రి అయినోడు కుర్సి మీది కెల్లి దిగుతడా? అర్గీజ్ దిగడు. రాజస్తాన్‌ల అశోక్ గెహ్లాత్ ముఖ్యమంత్రి కుర్సి మీది కెల్లి దిగిండా? సోనియ జెప్పినా ఇనలేదు. గాయిన తీర్గనే సిద్ద రామయ్య జేస్తె శివ కుమార్ ముఖ్యమంత్రి గాడు. ఖాదర్‌కు మంత్రి కుర్సి దొర్కదు.''



''శివ కుమార్ ఏమన్నడు?''

''హైకమాండ్ సూస్కుంటదన్నడు.''

''హైకమాండ్ జెప్పినా ఇంటదన్న గ్యారంటి లేదు. గాయిన శివ కుమార్‌కే గాకుంట ఖాదర్‌కు గుడ్క చెయ్యి ఇచ్చినా ఇస్తడు. కాంగ్రెస్ గుర్తే చెయ్యి గదా.''

''లీడర్ల మాటలకు అర్తాలు అలగుంటయి.''

''ఏ లీడర్ మాటలకో జెర జెప్పరాదు...''

''గిప్పుడున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందర్కి వొచ్చె ఎలచ్చన్ల టికిట్లు ఇస్తనని కేసీఆర్ అన్నడు. గని అటెంకల అందర్కి టికిట్లు ఇచ్చేటి సవాల్ లేదు అని అన్నడు.''

''గాయిన గట్ల అంటె బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఏం జేసింద్రు?''

''ఒక ఎమ్మెల్యే యాల పొద్దుగాలే నిద్ర లేసిండు. నెత్తి మీది కెల్లి తానం జేసిండు. కేసీఆర్ ఫోట్వకు పాలాబిసేకం జేసిండు. జేస్కుంట ఫోట్వ దిగిండు. గా ఫోట్వను పేపర్ల వొచ్చేటట్లు జూస్కున్నడు. ఇంకొక ఎమ్మెల్యే కేసీఆర్‌కు గుడి గట్టిచ్చిండు. దినాం పొద్దుగాలే లేసి గా గుల్లె పూజలు జెయ్య బట్టిండు. 'మదిని నిన్ను నమ్మి కొల్తురా కేసీఆరూ! ఎమ్మెల్యే టికిట్ నాకు ఇయ్యవా మా సారూ!' అని చిర్తలు గొట్టుకుంట బజన జెయ్య బట్టిండు. వేరొక ఎమ్మెల్యే కేసీఆర్ బొమ్మ బెట్టిండు. గా బొమ్మకు దినాం కాల్లు మొక్క బట్టిండు. మొక్కుకుంట వీడియో దీపిచ్చుకుండు. వీడియోను కేసీఆర్‌కు బంపిచ్చిండు.''

''గీ నడ్మ రాజమండ్రిల మహానాడు అయ్యింది.''

''చెంద్రబాబు, లోకేశ్ కటౌట్లల పెద్దగ బెట్టి ఉంటరు...''

''లే. ఎన్టీఆర్ కటౌట్లే పెద్దగ బెట్టింద్రు.''

''ఎన్టీఆర్ శత జయంతి అయ్యే బట్కె ఎన్టీఆర్ కటౌట్లు పెద్దయి బెట్టి ఉంటరు.''

''ఏం గాదు, చెట్టు పేరు జెప్పి కాయల మ్ముకునే తందుక్.''

''నేను, ఎన్టీఆర్ నడ్మ తర్గతి కెల్లి వొచ్చినోల్లం. నేను గుడ్క ఎన్టీఆర్ అసుంటోన్నే అని చెంద్రబాబు అన్నడు.''

''లోకేశ్ ఏమన్నడు?''

''చంద్రన్న, రాముని అసుంటోడు అని అన్నడు.''

''రాముడు అంటె యాదికొచ్చేది ఎన్టీఆరే గదా!''


గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింద్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

ఆస్వాదించడం

ఓ ఆశ్రమ గురువు జీవిత చరమాంకంలో మంచం మీద పడుకుని ఉన్నాడు. చుట్టూ నిలుచున్న శిష్యుల్లో ఒకరు గురువుగారికి ఎంతో ఇష్టమైన మామిడి పండుని తెచ్చాడు. ఆయన ఎంతో ఇష్టపడి ఆ పండుని అందుకుని తిన్నాడు. అనంతరం ఆ శిష్యుడిని దగ్గరకు పిలిచాడు. గురువుగారు 'ఆహా ఏమి రుచి' అంటూ కనులు మూశారు. ఆ మాటతో శిష్యుడు నిరాశ చెందాడు. చివరి క్షణాల్లో ఏదో నాలుగు మంచి మాటలు చెప్తారని అనుకుంటే పండు రుచిగా ఉందని చెప్తారేంటని నిరాశ చెందాడు.

కానీ ఆ తర్వాత స్థిమితంగా ఆలోచించాడా శిష్యుడు. అతనికి గురువుగారి మాటతో ఓ విషయం బోధపడింది. జీవితం చివరి క్షణాన్ని కూడా మరణభయం లేకుండా ఆస్వాదించడం తెలిసుండాలన్నదే గురువుగారి మాటలకు అర్థమని గ్రహించాడు. ఇక మరణం తప్పదని తెలిసినా జనులు దానినుంచి తప్పించుకోవడానికి పోరాడుతూ చివరివరకూ మనశ్శాంతి లేకుండా గడపడం అతడికి గుర్తొచ్చింది. అందుకు భిన్నంగా తన గురువుగారు చివరి క్షణాల్లోనూ నిశ్చింతగా తనకిష్టమైన మామిడిపండును ఆస్వాదించి కన్ను మూయడం అబ్బురమనిపించింది. జరిగేదాన్ని మనం నిరోధించలేని స్థితిలో ఉన్నప్పుడు హైరానా పడకుండా ప్రశాంతంగా మరణాన్ని కౌగలించుకోవడం సద్గతికి మార్గమవుతుందని గురువుగారు చెప్పకనే చెప్పారని ఆ శిష్యుడు గ్రహించాడు. అది ఒక్కటే సరైన మార్గమన్నది గురువుగారి హితవు.



జ్యోతిర్మయం

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు. చతుర్దశి ఉ.10.15 వరకు, తదుపరి పౌర్ణమి, **నక్షత్రం:** విశాఖ తె.5.11 వరకు (తెల్లవారితే ఆదివారం), తదుపరి అనూరాధ, **వర్జ్యం:** ఉ.9.29 నుండి 11.04 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.29 నుండి. 7.12 వరకు, **అమృతఘడియలు:** సా.6.55 నుండి 8.31 వరకు; **రాహుకాలం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **యమగండం:** ప.1.30 నుండి 3.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.27.

కాంగ్రెస్‌తోనే సామాజిక తెలంగాణ

పాదయాత్రలో మల్లు భట్టి విక్రమార్క



పాదయాత్రలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క


అచ్చంపేట: తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాస్వామ్య ప్రగతిశీల, సామాజిక తెలంగాణ నిర్మాణం జరుగుతుందని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పేర్కొన్నారు. పీపుల్స్ పాదయాత్ర సందర్భంగా 78వ రోజు అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూర్ మండలం అనంతవరం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా కార్నర్ మీటింగ్‌లో ఆయన మట్లాడుతూ...నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మ గౌరవం కోసం తెచ్చుకున్న తెలంగాణలో బీఆర్ఎస్ దశాబ్ద పాలనలో ఏ ఒక్క లక్ష్యం నెరవేరలేదన్నారు. తెలంగాణ వస్తే నాలుగున్నర కోట్ల ప్రజలు బాగుపడతారని మన నీళ్లు, మన సంపద, మన కొలువులు మనకే వస్తాయని ఎన్నో కలలుగని ఆనాడు ఉమ్మడి రాష్ట్రంలో డిప్యూటీ స్పీకర్‌గా తెలంగాణ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టి పాస్ చేశానని గుర్తు చేశారు. తెలంగాణ వస్తే రాష్ట్రం బాగుపడుతుందన్న కలలకు భిన్నంగా కేసీఆర్ పరిపాలన ఉందని, ప్రజలు దుర్భర స్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడంతో పాటు నిరుద్యోగులకు నెలకు రూ.4వేల భృతి ఇస్తామన్నారు. ఇంటి స్థలాలు లేని నిరు పేదలకు భూములు కొనుగోలు చేసి ప్లాట్లు పంపిణీ చేస్తామని, ఇళ్లు కట్టుకోవడానికి రూ.5లక్షల ఇస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మల్లు రవి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టరు చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు.

మనుషులతో పోలిస్తే కోతుల్లో వ్యాధులు లేకపోవడంపై భారీ అధ్యయనం

233 వానర జాతులకు చెందిన 809 జన్యుక్రమాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు

భారత్‌లో 19 వానర జాతులకు చెందిన 83 నమూనాలను విశ్లేషించిన సీసీఎంబీ

వానర రహస్యం రట్టయ్యిందా?



మన జన్యువుల్లో ఒక చిన్న మార్పు ఉన్నా ఏదో ఒక రకమైన వ్యాధికి గురికావడం ఖాయం. కానీ మనిషికి అతిదగ్గరి చుట్టంగా చెప్పుకొనే వానరాల్లో మాత్రం ఇలా ఉండదు. జన్యుపరమైన మార్పులు ఎన్ని ఉన్నా వాటికి మనలా వ్యాధులు అంటవు. ఎందుకిలా? ఈ విషయాన్ని తెలుసుకొనేందుకే హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) సహా అంతర్జాతీయ శాస్త్రవేత్తలు ఓ భారీ అధ్యయనాన్ని చేపట్టి పూర్తి చేశారు. ఇందులో భాగంగా సుమారు 233 వానర జాతులకు చెందిన 809 జన్యుక్రమాలను మానవ జన్యుక్రమాలతో పోల్చి చూశారు. భారత్‌లోని 19 వానర జాతులకు సంబంధించిన 83 నమూనాల జన్యుక్రమ నమోదు, విశ్లేషణ బాధ్యతలను సీసీఎంబీ చేపట్టింది. అంతరించిపోతున్న వానర జాతుల సంరక్షణకు, జన్యుపరమైన వ్యాధులను మరింత లోతుగా అర్థం చేసుకునేందుకు ఈ అధ్యయనం ఉపయోగపడుతుందని అంచనా.

మానవ, వానర జన్యుక్రమాలను పోల్చి చూసినప్పుడు రెండింటిలోనూ సుమారు 43 లక్షల మిస్‌సెన్స్ జన్యుమార్పులు ఉన్నట్లు స్పష్టమైంది. ఈ ప్రత్యేకమైన జన్యు మార్పులు శరీరానికి అవసరమైన అమైనోయాసిడ్ల రూపురేఖలను మార్చేస్తాయి. ఫలితంగా ఈ అమైనో యాసిడ్లతో తయారయ్యే ప్రొటీన్లు కూడా సక్రమంగా పనిచేయకుండా మనం వ్యాధుల బారిన పడుతూంటాం. అయితే ప్రస్తుతం ఏ మార్పుల కారణంగా మనకు వ్యాధులు వస్తున్నాయన్నది గుర్తించడంలో చాలా పరిమితులున్నాయి.

ప్రత్యేకమైన జన్యుమార్పులు గుర్తింపు...

జన్యుమార్పులు వందలు, వేల సంఖ్యలో ఉండటం దీనికి కారణం. మధుమేహం, గుండె జబ్బుల్లాంటి ప్రాణాంతక ఆరోగ్య సమస్యలకూ జన్యుపరమైన మూలకారణం ఇప్పటివరకూ తెలియకపోవడానికి కూడా జన్యు మార్పులకు సంబంధించిన సమాచారం లేకపోవడమూ ఒక కారణం. ఈ నేపథ్యంలోనే శాస్త్రవేత్తలు... వానరులు, మనుషుల జన్యుక్రమాలను సరిపోల్చే పరిశోధన చేపట్టారు. కొన్ని వ్యాధులు ఒకటి కంటే ఎక్కువ జన్యువుల్లో వచ్చిన మార్పుల వల్ల పుడతాయని... మొదట్లో వాటి ప్రభావం తక్కువగానే ఉన్నా క్రమక్రమంగా ఈ జన్యుమార్పులన్నీ కలసికట్టుగా పనిచేయడం మొదలుపెట్టి మధుమేహం, కేన్సర్ వంటి వ్యాధులుగా పరిణమిస్తాయని అంచనా.



లయన్ టెయిల్డ్ మకాక్

కొన్నింటిని గుర్తించాం...

మానవులు, వానరాలను వేరు చేసే 43 లక్షల ప్రత్యేకమైన జన్యుమార్పులు (మిస్‌సెన్స్ మ్యుటేషన్స్) లలో ఆరు శాతం వాటిని ఇప్పటికే గుర్తించామని, ఇవి మనుషుల కంటే వానరాల్లోనే చాలా ఎక్కువగా ఉన్నాయని కృత్రిమ మేధ కంపెనీ ఇల్యూమినా ఉపాధ్యక్షుడు కైల్ ఫార్ తెలిపారు. ఈ ఆరు శాతం జన్యుమార్పులు మానవ వ్యాధులు వానరాలకు అంటకుండా కాపాడుతున్నట్లు భావిస్తున్నామని ఆయన చెప్పారు. వ్యాధికారక జన్యుమార్పులను గుర్తించేందుకు తాము ప్రైమేట్ ఏఐ-3డీ అనే డీప్ లెర్నింగ్ అల్గారిథమ్‌ను ఉపయోగించామని చెప్పారు. ఈ అల్గారిథమ్ జన్యుశాస్త్రానికి సంబంధించిన చాట్‌జీపీటీ అనుకోవచ్చు. చాట్‌జీపీటీ మనుషుల భాషను అర్థం చేసుకుంటే ప్రైమేట్ ఏఐ-3డీ జన్యుక్రమాన్ని అర్థం చేసుకోగలదు. అంతే తేడా!

విస్తృత స్థాయిలో వానర జన్యుక్రమం నమోదు...

ఈ అధ్యయనంలో భాగంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేకానేక వానర జాతుల జన్యుక్రమాలను నమోదు చేశారు. ''ఐదు గ్రాముల బరువుండే చిన్న కోతి మొదలుకొని చింపాంజీల వరకూ... భారత్‌లోని ఈశాన్య రాష్ట్రాల్లో మాత్రమే కనిపించే వెస్టర్న్ హూలాక్ గిబ్బన్, పశ్చిమ కనుమల్లో నివసించే లయన్ టెయిల్డ్ మకాక్ వరకు అనేక వానర రకాల జన్యుక్రమాలను ఇందులో నమోదు చేశారు. ఈ స్థాయిలో వానర జన్యుక్రమ నమోదు జరగడం ఇదే మొదటిసారి''అని సీసీఎంబీ శాస్త్రవేత్త డాక్టర్ గోవింద స్వామి ఉమాపతి 'సాక్షి'తో మాట్లాడుతూ చెప్పారు. భూమ్మీద ఉన్న మొత్తం వానర జాతుల్లో దాదాపు సగం జాతుల జన్యుక్రమం ఇప్పుడు అందుబాటులో ఉందని అంచనా. ఈ విస్తృతస్థాయి జన్యుక్రమం ఫలితంగా వానరాల జన్యుక్రమాలను పోల్చి చూడటం సాధ్యమైందని, తద్వారా పరిణామ క్రమంలో వాటిలో వచ్చిన మార్పులను కూడా పరిశీలించే అవకాశం దక్కిందని డాక్టర్ ఉమాపతి తెలిపారు. అంతేకాకుండా వానరాలను మనుషులను వేరు చేసే అంశాలేమిటన్నది కూడా మరింత స్పష్టమవుతుందన్నారు. జన్యుక్రమాలు అందుబాటులోకి రావడం పరిణామ క్రమాన్ని అర్థం చేసుకోవడానికి మాత్రమే కాకుండా... మనకు వచ్చే వ్యాధుల వివరాలు తెలుసుకోవడానికి, వానరాల సంరక్షణకూ ఉపయోగపడుతుందని వివరించారు. ''వానర జన్యుక్రమ నమోదు.. వాటిని సంరక్షించాల్సిన అవసరాన్ని మరింత గట్టిగా చెబుతున్నాయి''అని సీసీఎంబీ డైరెక్టర్ వ్యాఖ్యానించారు. ఈ అధ్యయనం ఫలితం ఇంకొకటి కూడా ఉంది. మనిషికి మాత్రమే ప్రత్యేకమనుకున్న జన్యుపరమైన అంశాలు దాదాపు సగం తగ్గాయి! అంటే మనిషికి.. వానరానికి మధ్య ఉన్న అంతరం మరింత తగ్గిందన్నమాట!



వెస్టర్న్ హూలాక్ గిబ్బన్

\- సాక్షి, హైదరాబాద్

ఆరిజిన్ డెయిరీ భాగస్వామి.. ఆత్మహత్యాయత్నం

▶ మొదటి పేజీ తరువాయి

ఆత్మహత్య చేసుకుంటున్నానని పేర్కొంటూ.. న్యాయమూర్తులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు శాఖ, మీడియాను ఉద్దేశించి షెజల్ ఒక సూసైడ్ నోట్ రాసింది.

వేధింపులు, అవమానం భరించలేక..

హైదరాబాద్‌లోని మణికొండకు చెందిన షెజల్ ఢిల్లీలోని జంతర్‌మంతర్, తెలంగాణ భవన్, ఇండియా గేట్ వద్ద మూడురోజులు వినూత్నంగా నిరసన తెలియజేసింది. జాతీయ మానవహక్కుల కమిషన్, జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. నాలుగో రోజు శుక్రవారం మధ్యాహ్నం తెలంగాణ భవన్ పార్కింగ్ ప్రాంతంలో చెదలు నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. 'నన్ను ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆయన అనుచరులు భీమాగౌడ్, చిల్లరపు సంతోష్, కుమ్మరి పోచన్న, కొనుకి కార్తిక్‌లు కొంత కాలంగా మానసికంగా, రకరకాలుగా హింసిస్తున్నారు. ఎమ్మెల్యే చిన్నయ్య నన్ను వేధిస్తూ, అనుచరులతో చంపుతానని బెదిరిస్తుండడంతో ఢిల్లీకి వచ్చి నిరసన తెలియజేస్తున్నా. అయితే రెండురోజుల నుంచి ఎమ్మెల్యే అనుచరులు సోషల్ మీడియాలో నా ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ, నా గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తూ తీవ్ర మనస్తాపానికి గురిచేస్తున్నారు. గోలీ శివ, ఇంకో వ్యక్తి కూడా నా గురించి తప్పుడు ప్రచారం చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నారు. పలుసార్లు తెలంగాణ పోలీసులకు ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయకపోగా తిరిగి నా మీదే తప్పుడు కేసులు పెడుతూ చిత్రహింసలకు గురిచేస్తున్నారు. ఈ వేధింపులు, అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా. చనిపోయిన తర్వాతైనా నాకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నా..'అని షెజల్ నోట్‌లో పేర్కొంది. ఢిల్లీలో షెజల్ ఆత్మహత్యాయత్నం ఫొటోలు, వీడియోలు, సూసైడ్ నోట్ కొందరు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో వైరల్ అయ్యాయి. బెల్లంపల్లిలో ఇది చర్చనీయాంశమయ్యింది.

ఇదీ వివాదం..

ఆరిజిన్ డెయిరీకి చెందిన ఆదినారాయణ, షెజల్ బెల్లంపల్లిలో డెయిరీ ఏర్పాటు చేయాలని భావించారు. ఇందుకు సహకరించేలా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రైతులకు పాడి గేదెలు సబ్సిడీపై ఇప్పిస్తామని, పాలను తామే కొనుగోలు చేస్తామని రైతులకు చెప్పారు. వారి నుంచి రూ.లక్షలు వసూలు చేశారనే ఆరోపణలున్నాయి. అయితే నెలలు గడిచినా డెయిరీ ఏర్పాటు కాలేదు. ఈ క్రమంలో ఎమ్మెల్యే, ఆరిజిన్ డెయిరీ నిర్వాహకుల మధ్య విభేదాలు తలెత్తాయి. ఆదినారాయణ, షెజల్‌పై పోలీసు కేసులు నమోదు అయ్యాయి. పోలీసులు వారిని అరెస్టు చేసి జైలుకు పంపించడంతో ఎమ్మెల్యేతో విభేదాలు మరింత ముదిరాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే తనపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు కొన్ని నెలల క్రితం షెజల్ ఆరోపణలు చేసింది. ఈ మేరకు ఎమ్మెల్యేతో చేసిన వాట్సాప్ చాటింగ్‌లనూ ఆమె బహిర్గతం చేయడం సంచలనం సృష్టించింది.

సగం దేశానికి రాష్ట్రం అన్నం పెడుతోంది

ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: గత పాలకులు తెలంగాణలో వ్యవసాయం చేయడం దండగని చిత్రీకరించారని.. ఇప్పుడు అదే తెలంగాణ సగం దేశానికి అన్నం పెడుతోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లాలో శుక్రవారం నిర్వహించిన దశాబ్ది వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల ప్రాజెక్టు కాళేశ్వరంతో గోదావరి జలాలను అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయని పేర్కొన్నారు. మిషన్ కాకతీయతో చెరువులు అభివృద్ధి చెందడంతో.. ఒక్క పంటకు కూడా అనువుగా లేని భూముల్లో రెండు పంటలను పండిస్తున్నారని హరీశ్ వివరించారు.

ధాన్యం అమ్మిన రైతుల ఖాతాలకు డబ్బులు

- రాష్ట్ర అవతరణ కానుకగా ఒకేరోజు రూ.1,180 కోట్లు జమ
- మంత్రి గంగుల కమలాకర్



సాక్షి, హైదరాబాద్: యాసంగి ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లోకి శుక్రవారం ఒక్కరోజే పౌరసరఫరాల సంస్థ రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.1,180 కోట్లను జమ చేసింది. తెలంగాణ అవతరణ దినోత్సవ కానుకగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలతో ఈ నిధులను రైతుల బ్యాంకు అకౌంట్లలో జమ చేసినట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లకు నిధుల కొరత లేదని, ఎంత పంట వచ్చినా మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. 7,030 కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరిస్తున్న ధాన్యం వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ.. వాటికి అనుగుణంగా రైతుల ఖాతాలకు నిధులను నేరుగా బదిలీ చేస్తున్నట్లు వివరించారు.

సింగరేణి టర్నోవర్ రూ. 32,978 కోట్లు

తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సీఎండీ ఎన్.శ్రీధర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఆవిర్భావం తర్వాత సింగరేణి అద్భుత ప్రగతిని సాధించిందని సంస్థ సీఎండీ ఎన్ శ్రీధర్ ఉద్ఘాటించారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీధర్ మాట్లాడుతూ తెలంగాణకు ముందు సంస్థ టర్నోవర్ రూ.1,1,928 కోట్లు ఉండగా.. ప్రసుత్తం 176శాతం వృద్ధితో రూ.32,978 కోట్లకు పెరిగిందన్నారు. గతేడాది 421 శాతం వృద్ధితో రూ.2,184 కోట్లు లాభాలు వచ్చాయన్నారు. బొగ్గు ఉత్పత్తిలో 33శాతం, బొగ్గు రవాణాలో 39శాతం లాభాలొచ్చాయని, మరో వైపు కొత్తగా 14 గనులను ప్రారంభించామని వివరించారు. మరోవైపు రాష్ట్రం ఏర్పడిన తర్వాత 19,463 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించామన్నారు. కారుణ్య నియామకాల్లో భాగంగా 15,250 మంది వారసులకు, డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా 4,207 మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. కార్మికుల సంక్షేమానికి డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను భూపాలపల్లి, సత్తుపల్లి, కొత్తగూడెంలో నిర్మించామన్నారు.

దేశం గర్వించే స్థాయికి తెలంగాణ: వినోద్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: అభివృద్ధి సంక్షేమ రంగాల్లో యావత్ భారతదేశం గర్వించే స్థాయికి తెలంగాణ చేరుకుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. 2014లో వార్షిక బడ్జెట్ రూ.40వేల కోట్లు ఉండగా..నేడు రూ.2.5 లక్షలకు చేరిందని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనేక ప్రాజెక్టుల నిర్మాణాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగిందని, దీంతో ధాన్యం ఉత్పత్తి నాలుగు మిలియన్ టన్నుల నుంచి 13 మిలియన్ టన్నులకు పెరిగిందన్నారు. అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధిని సాధిస్తూ, ప్రణాళికాబద్ధంగా రాష్ట్రం పురోగతి సాధిస్తోందన్నారు. రానున్న పదేళ్ల కాలానికి ప్రణాళికలు రూపొందించి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో తీసుకెళ్తామని వినోద్ కుమార్ పేర్కొన్నారు.

డీజీపీ, ఏసీబీ కార్యాలయాల్లో అవతరణ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను శుక్రవారం డీజీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డీజీపీ కార్యాలయంలో పర్సనల్ విభాగం ఐజీ కమలాసన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఏసీబీ డీజీపీ రవిగుప్తా పాల్గొన్నారు. ఉత్తమ పనితీరు ప్రదర్శించిన అధికారులను రివార్డులతో అభినందించారు.

క్లుప్తంగా

అమెరికా నేషనల్ స్పెల్లింగ్ బీలో ... ఇండియన్ అమెరికన్ దేవ్ షా విజేత



వాషింగ్టన్: అమెరికా లోని స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ పోటీలో 2023 సంవత్సరానికిగాను భారతీయ సంతతికి చెందిన 14 ఏళ్ల వయసున్న దేవ్ షా విజేతగా నిలిచాడు. ఫ్లోరిడాకు చెందిన దేవ్ "psammophile" అనే పదం స్పెల్లింగ్‌ను సరిగ్గా చెప్పి చాంపియన్ అయ్యాడు. ఈ పోటీలో గెలవడంతో దేవ్‌షాకు 50 వేల అమెరికన్ డాలర్ల ప్రైజ్ మనీ లభిస్తుంది. మేరిల్యాండ్‌లో జరిగిన ఈ పోటీలో నెగ్గిన తర్వాత దేవ్ షా తాను చాంపియన్ అయ్యానంటే నమ్మలేకపోతున్నానన్నాడు. ఇంగ్లిష్ స్పెల్లింగ్ పోటీలలో అత్యధికంగా ప్రవాస భారతీయుల పిల్లలే విజేతలుగా నిలుస్తున్నారు.

అమెరికా రుణ పరిమితి బిల్లుకు
సెనేట్ ఆమోదం

వాషింగ్టన్/కొలరాడో: దివాలా(డిఫాల్ట్) ముప్పు నుంచి అగ్రరాజ్యం అమెరికా బయట పడినట్లే. రుణ పరిమితి పెంపునకు సంబంధించిన బిల్లుపై (ద్వైపాక్షిక ఒప్పందం) సెనేట్ తుది ఆమోద ముద్ర వేసింది. సుదీర్ఘమైన చర్చల అనంతరం గురువారం రాత్రి ఓటింగ్ నిర్వహించారు. 63–36 ఓట్లతో బిల్లు ఆమోదం పొందింది. సంతకం కోసం అధ్యక్షుడు జో బైడెన్ డెస్క్‌కు పంపించారు. ఆయన సంతకం చేస్తే బిల్లు చట్టరూపం దాల్చనుంది. దేశ రుణ పరిమితిని 31.4 ట్రిలియన్ డాలర్లకు పెంచుతూ బిల్లును రూపొందించారు. అంటే మొత్తం అప్పులు 31.4 ట్రిలియన్ డాలర్లు దాటకూడదు. బిల్లుకు సెనేట్ ఆమోదం లభించడంతో కొత్త అప్పులు తీసుకొని, పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. బడ్జెట్ కట్స్ ప్యాకేజీకి సైతం సెనేట్ ఆమోదం తెలిపింది. బిల్లు ఆమోదం పొందడంలో అమెరికా ఇక ఊపిరి పీల్చుకోవచ్చని సెనెట్ మెజార్టీ నాయకుడు చుక్ షూమర్ చెప్పారు. ఒ

ఇది అతిపెద్ద విజయం: బైడెన్

అమెరికా తన బాధ్యతలు నెరవేర్చే దేశం, బిల్లులు చెల్లించే దేశం అని డెమొక్రాట్లు, రిపబ్లికన్లు మరోసారి నిరూపించారని అధ్యక్షుడు జో బైడెన్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. అమెరికా తన బాధ్యతలను ఎప్పటికీ చక్కగా నెరవేరుస్తుందని చెప్పారు. బిల్లుపై త్వరగా సంతకం చేస్తానన్నారు. చర్చల్లో ఎవరికీ కోరుకున్నది మొత్తం దక్కకపోవచ్చని, అయినప్పటికీ తాము ఎలాంటి పొరపాటు చేయలేదని వ్యాఖ్యానించారు. ఈ ద్వైపాక్షిక ఒప్పందం అమెరికా ఆర్థిక వ్యవస్థకు, ప్రజలకు అతిపెద్ద విజయమని బైడెన్ అభివర్ణించారు.



ప్రమాద స్థలం వద్ద కొనసాగుతున్న సహాయక చర్యలు



ప్రమాదంలో గాయపడ్డ ప్రయాణికులు

మూడు రైళ్లు...మహా విషాదం!

ఒడిశాలో ఘోర ప్రమాదం • గూడ్సును ఢీకొన్న కోరమండల్? • పక్క ట్రాక్‌పై పడ్డ పలు బోగీలు

- వాటిని ఢీకొన్న హౌరా ఎక్స్‌ప్రెస్
- ప్రమాదంలో వందమందికి పైగా దుర్మరణం?
- 70కి పైగా మృతదేహాల వెలికితీత
- 350 మందికి పైగా క్షతగాత్రులు
- బోగీల్లో చిక్కిన వందలాది మంది
- రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి



గూడ్స్ బోగీపైకి దూసుకెళ్లిన ప్రయాణికుల బోగీ

భువనేశ్వర్/బాలాసోర్/హౌరా/సాక్షి, అమరావతి: ఒడిశాలో ఘోర రైలు ప్రమాదం జరిగింది. శుక్రవారం రాత్రి ఒకే చోటఏకంగా మూడు రైళ్లు ప్రమాదానికి గురయ్యాయి. ఈ దారుణంలో కనీసం వంద మందికిపైగా దుర్మరణం పాలైనట్టు భావిస్తున్నారు. ఇప్పటిదాకా 70కి పైగా మృతదేహాలను వెలికి తీశారు. 350 మందికి పైగా గాయపడ్డారు. వారిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వందలాది మంది బోగీల్లో చిక్కుబడి ఉండటంతో మృతుల సంఖ్య భారీగా పెరిగేలా కన్పిస్తోంది. సహాయక చర్యలకు పెను చీకటి అడ్డంకిగా మారింది. ఎన్డీఆర్ఎఫ్, రాష్ట్ర బృందాలు హుటాహుటిన రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాయి. మృతులు, క్షతగాత్రుల్లో ఆంధ్రప్రదేశ్ వాసులు కూడా ఉండొచ్చని చెబుతున్నారు.

ఏం జరిగింది...?

రాత్రి ఏడింటి ప్రాంతంలో బెంగుళూర్ నుంచి హౌరా వెళ్తున్న 12864 ఎక్స్‌ప్రెస్ బాలాసోర్ సమీపంలోని బహనాగా బజార్ రైల్వేస్టేషన్ వద్ద పట్టాలు తప్పిందని రైల్వే అధికారులు చెబుతున్నారు. దాని తాలూకు బోగీలను ఢీకొని షాలిమార్ నుంచి చెన్నై వెళ్తున్న కోరమండల్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ కూడా పట్టాలు తప్పిందని, దాని బోగీలు మరో ట్రాక్‌పై ఉన్న గూడ్స్‌పైకి దూసుకెళ్లాయని అంటున్నారు. కానీ వాస్తవానికి తొలుత ప్రమాదానికి గురైంది కోరమండల్ ఎక్స్‌ప్రెసేనన్నది ప్రత్యక్ష సాక్షుల కథనం. దానికి పొరపాటున లూప్ లైన్లోకి సిగ్నల్ ఇవ్వడంతో ఆ ట్రాక్‌పై నిలిచి ఉన్న గూడ్స్‌ను శరవేగంగా ఢీకొట్టిందన్నది వారు చెబుతున్నారు. ''ప్రమాద ధాటికి కనీసం ఏకంగా 14 బోగీలు పట్టాలు తప్పి చెల్లాచెదురుగా పడిపోయాయి. పలు బోగీలు గూడ్స్ బోగీల్లోకి దూసుకెళ్లాయి. దాంతో ప్రయాణికులు హాహాకారాలు చేస్తూ రైలు దిగి పరుగులు తీశారు. మరికొన్ని బోగీలు పక్క ట్రాక్‌పై పడ్డాయి. ఆ ట్రాక్‌పై ఎదురుగా వస్తున్న హౌరా ఎక్స్‌ప్రెస్ వాటిని ఢీకొని పట్టాలు తప్పింది'' అని వారంటున్నారు. ప్రమాదం జరిగిన తీరుపై రైల్వే అధికారులు సరైన సమాచారం ఇవ్వకపోవడం, దాంతో సైట్లు, వార్తా సంస్థలు ఒక్కోటి ఒకోలా రిపోర్టు చేయడం మరింత గందరగోళానికి దారితీసింది.

హుటాహుటిన సహాయ చర్యలు

ప్రమాద సమాచారం తెలియగానే అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించారు. కోచ్‌ల కింద చిక్కుకుపోయిన ప్రయాణికులను బయటకు తీస్తున్నారు. చీకటి వల్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడుతోందని అధికారులు చెప్పారు. 132 మంది క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించినట్టు ఒడిశా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రదీప్ జెనా తెలిపారు. మిగతా వారిని సొరో కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, గోపాల్‌పూర్ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, ఖొంటపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. జాతీయ విపత్తు స్పందన దళం కూడా రంగంలోకి దిగింది. ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శనివారం ఆయన ప్రమాద స్థలానికి వెళ్లనున్నారు. రైలు ప్రమాదంపై పరిస్థితిని తాను వ్యక్తిగతంగా ఎప్పటికప్పుడు అధికారులతో సమీక్షిస్తున్నానని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వెల్లడించారు.

హెల్ప్‌లైన్ నంబర్లు ఇవే

కోరమండల్ ఎక్స్‌ప్రెస్ రైలు ప్రమాద ఘటనకు సంబంధించి దక్షిణ మధ్య రైల్వే హెల్ప్‌లైన్ నంబర్లు ఏర్పాటు చేసింది. రైల్వేస్టేషన్లు.. విజయవాడలో 0866 2576924, రాజమండ్రిలో 0883 2420541, రేణిగుంటలో 9949198414, తిరుపతిలో 7815915571, నెల్లూరులో 0861 2342028, సామర్లకోటలో 7780741268, ఒంగోలులో 7815909489, గూడూరులో 08624250795, ఏలూరులో 08812232267 నంబర్లను అందుబాటులో ఉంచింది. అలాగే తెలంగాణలోని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 040 27788516 నంబర్‌ను ఏర్పాటు చేసింది. రైలు ప్రమాదంలో చిక్కుకున్న తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమాచారం తెలుసుకోవడానికి ఈ నంబర్లకు ఫోన్ చేయొచ్చని దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే హౌరాలో 033 2638227, ఖరగ్‌పూర్‌లో 8972073925, 9332392339, బాలాసోర్‌లో 8249591559, 7978418322, 8585039521, షాలిమార్‌లో 9903370746, సంత్రాగచ్చిలో 8109289460, 8340649469 నంబర్లను దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేసింది.

రాష్ట్రపతి, ప్రధాని సంతాపం..

రైలు ప్రమాదంపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భారీగా ప్రయాణికులు మృతి చెందడం తీవ్రంగా కలచివేసిందని చెప్పారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో ప్రధాని మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. బాధితులకు సాధ్యమైన సహాయం అందించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రమాదంపై దిగ్భ్రాంతి వెలిబుచ్చారు.

రూ.10 లక్షల పరిహారం..

ప్రమాద బాధితులకు రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్ పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు ప్రకటించారు.

మాటలకందని విషాదం: వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఒడిశా రైలు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విచారం వెలిబుచ్చారు. ''ఇది మాటలకు అందని విషాదం. మృతుల కుటుంబాలకు దేవుడు ఆ కష్టాన్ని తట్టుకునే శక్తిని ఇవ్వాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించడానికి అందరూ కృషి చేయాలి' అని పేర్కొన్నారు. మృతులకు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సహాయక చర్యలు ముమ్మరంగా సాగేలా అందరూ సహకరించాలని, మృతులు, క్షతగాత్రుల కుటుంబాలకు తోడుగా నిలవాలని ట్వీట్ చేశారు.

రద్దయిన రైళ్లు ఇవే...

12837 హౌరా–పూరీ ఎక్స్‌ప్రెస్ (02.06.2023); 12863 హౌరా–సర్ ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినల్ ఎక్స్‌ప్రెస్ (02.06.2023); 12839 హౌరా–చెన్నై మెయిల్ (02.06.2023); 12895 షాలిమార్–పూరీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (02.06.2023); 20831 షాలిమార్–సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ (02.06.2023); 02837 సంత్రాగచ్చి–పూరి (02.06.2023); 22201 సీల్దా–పూరీ దురంతో ఎక్స్‌ప్రెస్ 0(2.06.2023); 12074 భువనేశ్వర్–హౌరా జన్ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12073 హౌరా–భువనేశ్వర్ జన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12278 పూరీ–హౌరా శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12277 హౌరా–పూరీ శతాబ్ది ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12822 పూరీ–షాలిమార్ ధౌలీ ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 2821 షాలిమార్ – పూరి ధౌలీ ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12892 పూరి–బంగిరిపోసి (03.06.2023), 12891 బంగిరిపోసి–పూరి ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 02838 పూరీ–సంత్రగచ్చి స్పెషల్ (03.06.2023); 12842 చెన్నై–షాలిమార్ కోరమండల్ ఎక్స్‌ప్రెస్ (03.06.2023); 12509 ఎస్ఎంవీటీ బెంగళూరు–గౌహతి (02.06.2023)

ఛత్రపతి శివాజీ జీవితం స్ఫూర్తిదాయకం

- 'ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్'.. శివాజీ ఆశయాలకు ప్రతిబింబం
- ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- ఘనంగా ఛత్రపతి 350వ పట్టాభిషేక దినోత్సవాలు

ముంబై: మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ జీవితం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ప్రధాని మోదీ కొనియాడారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన నిరంతరం తపించారని చెప్పారు. శివాజీ విధానాలు, పాలనా వ్యవస్థ ఈనాటికీ అనుసరణీయమని పేర్కొన్నారు. మరాఠా రాజుగా ఛత్రపతి పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా మహారాష్ట్రలోని రాయ్‌గఢ్ కోటపై రాష్ట్రస్థాయి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఒక వీడియో సందేశం పంపించారు. శివాజీ దార్శనికత, అరుదైన వ్యక్తిత్వం చరిత్రలోని ఇతర రాజుల కంటే భిన్నమని మోదీ ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వ నినాదమైన 'ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్' శివాజీ మహారాజ్ ఆలోచనలు, ఆశయాలకు ప్రతిబింబమని వివరించారు. ఆయన వీరత్వం, భయానికి తావులేని కార్యాచరణ, వ్యూహాత్మక నైపుణ్యాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.



అమెరికా కాంగ్రెస్‌లో 22న మోదీ ప్రసంగం

వాషింగ్టన్: భారత ప్రధాని మోదీ జూన్ 21నుంచి 24వ తేదీ వరకు అమెరికాలో అధికారికంగా పర్యటించనున్నారు. 22న అమెరికా కాంగ్రెస్‌నుద్దేశించి ప్రసంగించనున్నారు. భవిష్యత్ భారతం, రెండు దేశాలు ఎదుర్కొంటున్న సవాళ్లపై ఆయన ప్రసంగిస్తారని కాంగ్రెస్ నేతలు వెల్లడించారు. 22న వైట్‌హౌస్‌లో అధ్యక్షుడు బైడెన్ ఇచ్చే విందులో మోదీ పాల్గొంటారు. ఉభయసభలైన ప్రతినిధుల సభ, సెనేట్‌నుద్దేశించి మోదీ మొదటిసారిగా 2016లో ప్రసంగించారు.

లూప్‌లైన్లోకి మళ్లించినందుకే?

- 20 సెకన్లలో 128 నుంచి 0 స్పీడ్‌కు
- ప్రమాదానికి గురైన కోరమండల్ ఎక్స్‌ప్రెస్ వేగ పతనమిదీ
- లూప్‌లైన్‌లోకి సిగ్నల్ ఇవ్వడమే ప్రమాదానికి కారణమా?
- గూడ్స్ రైలు లేదని చెబుతున్న అధికారులు
- కానీ.. ఫొటోలో స్పష్టంగా కనిపిస్తున్న గూడ్స్ బోగీ



ప్రమాద తీవ్రతకు అద్దం పడుతున్న ఒక బోగీ లోపలి దృశ్యం

సాక్షి, విశాఖపట్నం: ఊహించని ఉత్పాతం.. రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రమాదానికి గురై, పదుల సంఖ్యలో ప్రయాణికులు మృత్యువాత పడగా, వందల మంది క్షతగాత్రులయ్యారు. ప్రమాదం జరిగిన సమయంలో రైలు వేగాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు దాని తీవ్రతను అంచనా వేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల 55 నిమిషాల 28 సెకన్లకు గంటకు 128 కిలోమీటర్ల వేగంతో కోరమండల్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణిస్తోంది. అదే సమయంలో ప్రమాదం సంభవించడంతో 6 గంటల 55 నిమిషాల 51 సెకన్లకు వేగం సున్నాకు పడిపోయింది. సాధారణంగా గంటకు దాదాపు 130 కి.మీ. వేగంతో వెళ్లే రైలు వేగం సున్నాకు చేరుకునేందుకు అకస్మాత్తుగా బ్రేక్ వేస్తే 60 నుంచి 80 సెకన్లకు పైగా సమయం పడుతుంది. కానీ, ప్రమాదం జరిగి 23 సెకన్లలోనే జీరో స్పీడ్‌కు చేరుకుందంటే పట్టాలపై ఉన్న గూడ్సు రైలును ఎంత బలంగా ఢీకొట్టిందో అర్థం చేసుకోవచ్చని, దీన్నిబట్టి ప్రమాద తీవ్రతను ఊహించడానికే భయం కలుగుతోందని రైల్వే అధికారులు చెబుతున్నారు.

అధికారులు ఏం చెబుతున్నారంటే...

రైల్వే అధికార ప్రతినిధి అమితాబ్ శర్మ ప్రమాదం ఎలా జరిగిందన్న అంశంపై స్పందించారు. సాయంత్రం 6.55 గంటల సమయంలో బహనాగ రైల్వేస్టేషన్ వద్ద స్టాప్ లేకపోవడంతో వేగంగా వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ బోగీలు ఒక్కసారిగా పట్టాలు తప్పాయి. పక్కన ఉన్న ట్రాక్‌పైకి కోరమండల్ కోచ్‌లు పడిపోయాయి. అదే సమయంలో ఆ ట్రాక్‌పై వస్తున్న యశ్వంత్‌పూర్–హౌరా ఎక్స్‌ప్రెస్ పడిపోయిన కోచ్‌లని ఢీకొట్టడంతో ఆ ట్రైన్‌కు సంబంధించిన నాలుగు బోగీలు పట్టాలు తప్పాయని వివరించారు.

అసలు జరిగిందేమిటి?

అధికారులు చెబుతున్న దానికి, ప్రమాదం సంభవించిన పరిస్థితుల్ని గమనిస్తే.. ఒకదానికొకటి పొంతన లేకుండా ఉన్నాయి. వేగంగా వెళ్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిందని అధికారులు చెబుతున్నారు. కానీ, ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు చూస్తే అక్కడ గూడ్స్ రైలు కూడా ఉందని స్పష్టమవుతోంది. స్టేషన్ వద్ద.. మధ్యలో ఉన్న లూప్‌లైన్‌లో గూడ్స్ రైలు ఆగి ఉంది. స్టేషన్‌లో స్టాప్ లేనప్పుడు రైలుకు మెయిన్ లైన్‌లో ట్రాక్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉంటుంది. అయితే, కోరమాండల్‌కు లూప్‌లైన్‌లో సిగ్నల్ ఇచ్చారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెయిన్ లైన్‌లో నుంచి వెళ్లకుండా లూప్‌లైన్‌లోకి రావడం వల్ల అక్కడ ఆగి ఉన్న గూడ్స్ రైలుని బలంగా ఢీకొట్టడమే ప్రమాదానికి ప్రధాన కారణమన్న వాదన వినిపిస్తోంది. ఇది ముమ్మాటికీ రైల్వే శాఖ తప్పిదమని కొందరు సిబ్బంది చెబుతున్నారు. గంటకు 128 కి.మీ. వేగంతో వస్తున్న కోరమండల్ ఎక్స్‌ప్రెస్ లోకో గూడ్స్ రైలు బోగీపైకి వెళ్లినట్లు స్పష్టంగా కనిపిస్తున్నా అలాంటిదేమీ జరగలేదన్నట్లుగా రైల్వే అధికారులు చేస్తున్న ప్రకటనలు మరిన్ని అనుమానాలకు తావిస్తున్నాయి. ఈ ప్రమాదంపై పూర్తిస్థాయి దర్యాప్తునకు రైల్వే శాఖ ఆదేశాలు జారీ చేసింది.

దేశద్రోహానికి ఏడేళ్ల జైలు శిక్ష

భారత న్యాయ కమిషన్ సిఫార్సు

న్యూఢిల్లీ: దేశద్రోహం కేసుల్లో దోషులకు విధించే జైలుశిక్షను కనిష్టంగా మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ పెంచాలని భారత న్యాయ కమిషన్ సిఫార్సు చేసింది. దీనివల్ల నేర తీవ్రతను బట్టి శిక్ష విధించే అవకాశం న్యాయస్థానాలకు లభిస్తుందని వెల్లడించింది. ఈ మేరకు ఈ నివేదికను న్యాయ కమిషన్ చైర్మన్ జస్టిస్ రితూరాజ్ అవస్థీ (రిటైర్డ్) ఇటీవల కేంద్ర న్యాయ శాఖ మంత్రి మేఘ్వాల్‌కు సమర్పించారు. దేశద్రోహానికి జైలు శిక్షను ఏడేళ్లకు పెంచాలంటూ న్యాయ కమిషన్ సిఫార్సు చేయడాన్ని కాంగ్రెస్ ప్రతినిధి అభిషేక్ సింఘ్వీ తప్పుబట్టారు. దేశద్రోహ చట్టాన్ని మరింత క్రూరంగా మార్చేయడానికి బీజేపీ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు.

మెక్సికోలో కలకలం.. డజన్ల కొద్దీ బ్యాగుల్లో మానవ శరీర భాగాలు

మెక్సికో సిటీ: మెక్సికోలో పదుల సంఖ్యలో బ్యాగుల్లో మానవశరీర భాగాలు లభ్యమైన ఘటన సంచలనం రేపుతోంది. గ్వాడలజర శివారులోని లోయలో బయటపడిన ఈ బ్యాగుల్లో ఇటీవల అదృశ్యమైన ఏడుగురి శవాలు కూడా ఉండి ఉంటాయని వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత వారం నుంచి 8 మంది కనిపించడం లేదంటూ సంబంధీకులు ఇచ్చిన ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్న అధికారులు అటవీ ప్రాంతంలోని లోయలో అనుమానాస్పద బ్యాగులు పడి ఉన్నాయంటూ గురువారం స్థానికులిచ్చిన సమాచారంతో అప్రమత్తమయ్యారు. మిస్సయిన వారి శరీరభాగాలు ఇందులో ఉన్నాయా అనే దిశగా దర్యాప్తు చేపట్టారు. దీని వెనుక మాదకద్రవ్యాల ముఠాల హస్తం ఉండొచ్చని అనుమానిస్తున్నారు.

కేంద్ర ఆర్డినెన్స్‌పై ఆప్‌కు జేఎంఎం మద్దతు

రాంచీ: దేశ రాజధాని న్యూఢిల్లీలో పాలనా యంత్రాంగంపై నియంత్రణ కోసం కేంద్రం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఆప్‌కు మద్దతిస్తామని జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం) ప్రకటించింది. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, పంజాబ్ సీఎం మాన్ శుక్రవారం రాంచీలో జార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్‌తో భేటీ అయ్యారు. అనంతరం కేజ్రీవాల్, మాన్, సోరెన్ మీడియాతో మాట్లాడారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ఆర్డినెన్స్ స్థానంలో కేంద్రం ప్రవేశపెట్టే బిల్లును తప్పకుండా ఓడించాలన్నారు. కేంద్ర ఆర్డినెన్స్ విషయంలో ఆప్‌కు జేఎంఎం మద్దతుగా నిలుస్తుందని ఆ పార్టీ చీఫ్, సీఎం సోరెన్ చెప్పారు. ఆర్డినెన్స్‌పై మద్దతు కూడగట్టేందుకు కేజ్రీవాల్ బీజేపీయేతర పార్టీల నేతలను కలుస్తున్న విషయం తెలిసిందే.

కోర్టు బోనెక్కి సాక్ష్యం చెప్పనున్న ప్రిన్స్ హ్యారీ



లండన్: బ్రిటన్ రాజు చార్లెస్ –3 చిన్న కుమారుడు ప్రిన్స్ హ్యారీ సాక్ష్యం ఇవ్వడానికి వచ్చే వారంలో కోర్టుకు హాజరుకానున్నారు. రాజకుటుంబానికి చెందినవారు ఇలా కోర్టు బోనెక్కడం 130 ఏళ్లలో ఇది తొలిసారి. డైలీ మిర్రర్, సండే మిర్రర్ వంటి వార్తా పత్రికల ప్రచురణ సంస్థ మిర్రర్ గ్రూప్ న్యూస్‌పేపర్స్ (ఎంజీఎన్) సెలబ్రిటీల వ్యక్తిగత అంశాలను సేకరించడం కోసం చట్ట విరుద్ధంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిందన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణలపై 100 మంది సెలబ్రిటీలతో పాటు ప్రిన్స్ హ్యారీ కూడా మిర్రర్ గ్రూప్‌పై కోర్టులో పిటిషన్ వేశారు. ఈ కేసును విచారిస్తున్న లండన్ హైకోర్టులో ప్రిన్స్ హ్యారీ హాజరై ఫోన్ ట్యాంపింగ్‌పై సాక్ష్యం ఇవ్వనున్నారు. గతంలో 1870లో ఎడ్వర్డ్–7 ఒక విడాకుల కేసులో సాక్ష్యమిచ్చారు.

ఎన్ఐఏ కస్టడీకి పీఎఫ్ఐ సభ్యులు

సాక్షి, చెన్నై: నిషేధిత పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా(పీఎఫ్ఐ)కి చెందిన ఐదుగురిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) శుక్రవారం కస్టడీలోకి తీసుకుంది. ఐసిస్‌కు అనుకూలంగా, దేశంలో మైనారిటీ పాలనే లక్ష్యంగా పీఎఫ్ఐ సాగిస్తున్న ప్రయత్నాలపై అనుమానంతో వివిధ ప్రాంతాల్లో దాడులు జరిపి తమిళనాడుకు చెందిన 10 మంది సహా దేశ వ్యాప్తంగా 106 మందిని ఎన్ఐఏ ఇటీవల అరెస్టు చేసింది. వీరిచ్చిన సమాచారం ఆధారంగా చెన్నై, మదురై, దిండుగల్, తేనిలకు చెందిన అయిదుగురిని ఎన్ఐఏ అదుపులోకి తీసుకుంది.

బీజేపీని త్వరలో మట్టికరిపిస్తాం

ప్రతిపక్షాల ఐక్యత సాధిస్తాం: రాహుల్

- సాధారణ ఎన్నికల్లో ఆశ్చర్యకర ఫలితాలు
- ఐయూఎంఎల్ పూర్తి సెక్యులర్ పార్టీ



వాషింగ్టన్: త్వరలో మూడు, నాలుగు రాష్ట్రాల అసెంబ్లీలకు జరగనున్న ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపిస్తామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. భారత ప్రజానీకంలో అత్యధికుల మద్దతు లేని బీజేపీని ఓడించేందుకు అవసరమైన సాధనసంపత్తి, సత్తా తమ పార్టీకున్నాయని తెలిపారు. అమెరికాలో పర్యటిస్తున్న రాహుల్ గాంధీ గురువారం భారతీయ అమెరికన్లతో, నేషనల్ ప్రెస్ క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. ప్రముఖ భారతీయ అమెరికన్ ఫ్రాంక్ ఇస్లాం ఇచ్చిన విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అంశాలపై మాట్లాడారు. 'ఆర్ఎస్ఎస్, బీజేపీలను ఎవరూ అడ్డుకోలేరనే ఒక రకమైన ధోరణి ప్రజల్లో ఉంది. కానీ, అది నిజం కాదు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కర్ణాటకలో మాదిరిగానే ఆ పార్టీని దీటుగా ఢీకొంటాం. ముఖాముఖి పోరులో బీజేపీ ఓటమి ఖాయం'అని ఒక ప్రశ్నకు సమాధానమిచ్చారు. రానున్న సాధారణ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలు రానున్నాయని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల ఐక్యత మరింత బలపడుతుందన్నారు. కేరళలో కాంగ్రెస్–ఐయూఎంఎల్ పొత్తుపై రాహుల్ గాంధీ స్పందిస్తూ..ముస్లింలీగ్ పూర్తి సెక్యులర్ పార్టీ. ఆ పార్టీలో సెక్యులర్ కాదని చెప్పేందుకు ఏమీ లేదు'అంటూ రెండు పార్టీల మైత్రిని సమర్థించుకున్నారు. ప్రధాని మోదీకి ప్రపంచవ్యాప్తంగా వస్తున్న ఆదరణపై ఆయన స్పందిస్తూ..దేశంలోని మీడియా సహా అన్ని వ్యవస్థలపై మోదీ ప్రభుత్వం పట్టుబిగించింది. మోదీకి ఆదరణ అంటూ వస్తున్న వార్తలను నేను నమ్మను'అని అన్నారు. భారత్‌లో ప్రజాస్వామ్య వ్యవస్థలు కుప్పకూలితే యావత్ ప్రపంచంపైనే ప్రభావం పడుతుందని చెప్పారు. కాగా, ఐయూఎంఎల్‌ను సెక్యులర్ పార్టీ అంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశ విభజన కారకుడు అలీ జిన్నా స్థాపించిన ఆలిండియా ముస్లిం లీగ్ సిద్ధాంతాలనే ఐయూఎంఎల్ పాటిస్తోందంటూ ఆరోపించింది. హిందూ టెర్రరిజం అంటూ మాట్లాడే రాహుల్, ముస్లింలీగ్‌ను మాత్రం సెక్యులర్ అంటున్నారని విమర్శించింది.



వివాహానంతరం అమ్మాన్‌లో ఆహూతులకు అభివాదం చేస్తున్న జోర్డాన్ యువరాజు హుస్సేన్, రజ్వా అల్ సైఫ్ దంపతులు. గురువారం అంగరంగ వైభవంగా జరిగిన వారి వివాహ వేడుకల్లో పలు దేశాల రాచ కుటుంబీకులు పాల్గొన్నారు. సౌదీ అరేబియా రాజ కుటుంబానికి చెందిన రజ్వా ఆర్కిటెక్ట్‌గా పని చేస్తున్నారు.

సాక్షి
హైదరాబాద్
శనివారం ; 3 ; జూన్ ; 2023


గోల్కొండ కోటలో వైవిధ్యంగా సాగిన నృత్యప్రదర్శనలు

ఉష్ణోగ్రత
గరిష్టం 40.8°
కనిష్టం 28.4°

న్యూస్‌రీల్

రేపు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పోలీసు విభాగం ఆదివారం సురక్ష దినోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా సంజీవయ్య పార్క్–చార్మినార్ మధ్య గస్తీ వాహనాల ర్యాలీ, అంబేడ్కర్ విగ్రహం వద్ద టెక్నాలజీ ఎగ్జిబిషన్, ట్యాంక్‌బండ్‌పై ఉమెన్ సేఫ్టీ కార్నివాల్, ఎంజే మార్కెట్ నుంచి చార్మినార్ వరకు పాదయాత్ర కార్యక్రమాలు జరుగనున్నాయి. వీటి నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో వేర్వేరు సమయాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తూ ట్రాఫిక్ చీఫ్ జి.సుధీర్‌బాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివారం ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 12 వరకు సంజీవయ్య పార్క్–చార్మినార్ మధ్య మార్గంలో, ఉదయం ఆరు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ట్యాంక్‌బండ్, పీవీఎన్ఆర్ మార్గ్‌లో, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్యాంక్‌బండ్‌పై, రాత్రి 10 నుంచి 11 గంటల వరకు ఎంజే మార్కెట్–చార్మినార్ మార్గంలో ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయి. ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ట్రాఫిక్ పోలీసు అధికారిక సోషల్‌మీడియాతో పాటు 9010203626 నెంబర్‌లో సంప్రదించాలని సుధీర్‌బాబు కోరారు.

4న దుర్గం చెరువులో డ్రోన్ షో

గచ్చిబౌలి: దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని దుర్గంచెరువులో ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు డ్రోన్ షో నిర్వహిస్తున్నట్లు సైబరాబాద్ పోలీసులు తెలిపారు. తెలంగాణ ప్రగతిని ప్రతిబింబిస్తూ 500 డ్రోన్‌లు రంగురంగుల కాంతులు విరజిమ్ముతూ ప్రదర్శనలో పాల్గొంటాయన్నారు. హోం మంత్రి మహమూద్ అలీ హాజరుకానున్నారు. ప్రజలు వీక్షించేందుకు, మీడియాకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేస్తారు. డ్రోన్ షో కారణంగా ఆరోజు సాయంత్రం 4 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు దుర్గం చెరువు కేంద్రంగా ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.

ఈ నెల 22 వరకు 'అవతరణ' కార్యక్రమాలు

సాక్షి, సిటీబ్యూరో: ఈ నెల 22వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు నగరంలో జీహెచ్ఎంసీ ఏర్పాట్లు చేపట్టింది. ఆమేరకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. అవెన్యూ ప్లాంటేషన్‌లు బాగా చేసిన కాలనీలు, వార్డులను బెస్ట్ కాలనీ,వార్డుగా ఎంపికచేయనున్నారు. అలాగే బెస్ట్ నర్సరీ, బెస్ట్ నైట్‌షెల్టర్, బెస్ట్ కంపోస్టింగ్ యూనిట్‌లకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ఇళ్లవద్దే తడి–పొడి చెత్తగా వేరు చేసే వార్డు, కాలనీలను గుర్తించి ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ఇంకా బెస్ట్ నైట్‌షెల్టర్, బెస్ట్ స్ట్రీట్ వెండర్స్‌కు సైతం ప్రశంసాపత్రాలు అందజేస్తారు. సెల్ఫ్‌హెల్ప్‌గ్రూపు మహిళలకు, స్ట్రీట్‌వెండర్స్‌కు ఎక్కువ రుణాలిచ్చిన బ్యాంకును బెస్ట్ బ్యాంక్‌గా గుర్తిస్తారు. సెల్ఫ్‌హెల్ప్ గ్రూపుల్లో బాగా పనిచేస్తున్న గ్రూపుల్ని గుర్తిస్తారు. తొమ్మిదేళ్లలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి విస్తృతంగా ప్రచారం చేస్తారు. 16వ తేదీన పట్టణ ప్రగతి దినోత్సవంగా పాటిస్తూ ర్యాలీలు, మానవహారాలు వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు, గ్లవ్స్, అప్రాన్స్ వంటివి అందజేస్తారు. 19వ తేదీన హరితోత్సవంలో భాగంగా ఖాళీప్రదేశాల్లో మొక్కలు నాటడం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు పేర్కొన్నారు.

వందేళ్లకు సరిపడా నీటి నిల్వలు

- జలమండలి ఎండీ దానకిశోర్

సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం నిర్మించిన భారీ రిజర్వాయర్లతో హైదరాబాద్ నగర ప్రజలకు వందేళ్లకు సరిపడా నీటి నిల్వకు భరోసా కలిగిందని జలమండలి ఎండీ దానకిశోర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి ఎండీ ముఖ్య అతిథిగా హాజరై త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ ఇప్పటి వరకు ఎన్నో మార్పులు వచ్చాయని, అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని వివరించారు. నగర దహార్తిని తీర్చేందుకు మంచి నీటి నిల్వకోసం భారీ రిజర్వాయర్లను నిర్మించడంతోపాటు దినసరి ఉత్పన్నమయ్యే మురుగు నీటిని 100 శాతం శుద్ధి చేయడానికి ఎస్టీపీలను నిర్మిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో మన వంతు పాత్రగా తాగునీటి సరఫరా, మురుగు శుద్ధి నిర్వహణలో సమర్థంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఈడీ డా.ఎం.సత్యనారాయణ, ఈఎన్సీ, ఆపరేషన్స్ డైరెక్టర్–1 అజ్మీరా కృష్ణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీధర్ బాబు పాల్గొన్నారు.


జాతీయ గీతాలాపనలో అధికారులు




అవతరణోత్సాహం

నగరంలో ఘనంగా తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు శుక్రవారం నగరంలో కన్నుల పండువగా జరిగాయి. ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ, పలు ప్రైవేట్ సంస్థల కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. అన్ని రాజకీయ పార్టీలు, ఉద్యమ సంస్థలు, ఘనంగా వేడుకలను నిర్వహించాయి. గన్‌పార్క్ అమరుల స్థూపం వద్ద తెలంగాణ అమరులకు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. మరోవైపు అన్ని ప్రభుత్వ కార్యాలయాలను అందంగా అలంకరించారు. రంగు రంగుల విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటేవిధంగా పలుచోట్ల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. గోల్కొండ కోటలో కేంద్ర సాంస్కృతికశాఖ విభాగం ఆధ్వర్యంలో నృత్య, సంగీత కార్యక్రమాలు ఆహ్లాదంగా సాగాయి. కోటలోని రాణి మహల్ ఎదురుగా ఉన్న ప్రాంగణం వీటికి వేదికైంది. డాక్టర్ ఆనంద్ శంకర్ అండ్ గ్రూప్, మంజుల రామస్వామి గ్రూప్ వారి నృత్య కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖ సింగర్స్ శంకర్‌మహదేవన్, మంగ్లీ, మధుప్రియల గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. – సాక్షి, సిటీబ్యూరో


సచివాలయంలో కవిత, సానియా మీర్జా


గోల్కొండ కోటలో మంగ్లీ


గోల్కొండ కోటలో శంకర్‌మహదేవన్


గన్‌పార్క్ వద్ద మేయర్ విజయలక్ష్మి నివాళులు


బషీర్‌బాగ్ నుంచి గాంధీభవన్ వరకు ర్యాలీలో కాంగ్రెస్ నేతలు


రాజ్‌భవన్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు...


సచివాలయంలో సీఎంకు అభివాదం చేస్తున్న సీపీ సీవీ ఆనంద్


రాజ్‌భవన్‌లో నృత్య ప్రదర్శన..


గోల్కొండ కోటలో డప్పు వాయిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఉసురు తీస్తున్న ఉల్లంఘనలు

వారికి పొరపాటు.. వీరికి గ్రహపాటు!

- ప్రాణాలు తీస్తున్న ఎదుటి వారి నిర్లక్ష్యం
- చట్టంలో మార్పు రావాలన్న నిపుణులు
- అవగాహన పెంచుకోవాలన్న పోలీసులు
- ఎల్బీనగర్‌లో చిన్నారి మృతితో కలకలం

సాక్షి, సిటీబ్యూరో: 'తొంభై తొమ్మిది సార్లు ఉల్లంఘించినా ఏ ఇబ్బందీ రాకపోవచ్చు... ధోరణి మారకుంటే వందోసారైనా మూల్యం చెల్లించుకోక తప్పదు' ట్రాఫిక్ ఉల్లంఘనల విషయంలో అధికారులు పదేపదే చెప్పే మాట ఇది. ఈ మూల్యం ఉల్లంఘనకు పాల్పడిన వాహనచోదకుడు చెల్లిస్తే ఒక ఎత్తు. అదే ఏ పాపం ఎరుగని ఎదుటి వ్యక్తిపై ప్రభావం చూపితే..ఆ కుటుంబం బాధ, వ్యథ వర్ణనాతీతం. ప్రస్తుతం నగరంలో నిత్యం అనేక కుటుంబాలు ఈ క్షోభను అనుభవిస్తున్నాయి. గురువారం ట్యాంక్‌బండ్‌పై 30 ఏళ్ల యువకుడు గోవింద్, శుక్రవారం ఎల్బీనగర్‌లో రెండేళ్ల చిన్నారి ధనలక్ష్మి మృతికి ఇలాంటి 'పొరపాటు'లే కారణం.

వారు తీసింది డోర్ కాదు.. ప్రాణం...

నో పార్కింగ్ ప్రాంతాల్లో, అవసవ్య దిశలో వాహనాలు నిలపడమనేది అనేక మంది దృష్టిలో చాలా చిన్న విషయం. ట్రాఫిక్ పోలీసులో, మరొకరో ప్రశ్నించినా 'ఇప్పుడే వెళ్లిపోతాం' అంటుంటారు. అయితే ఇలా ఆపిన వాహనాల డోర్లు కూడా ప్రాణాలు తీస్తాయని తెలుసా. ఇలాంటి ఉల్లంఘన ధనలక్ష్మి మృతికి కారణమైంది.

ఆ రూటు 'రాంగే'...


కాస్తదూరం వెళ్లి 'యూ టర్న్' తీసుకోవాలంటే బద్ధకం. అది వన్ వే అని తెలిసినా నిర్లక్ష్యం. ఏం జరుగుతుందిలే అనే ధీమా...వెరసి సిటీలో రాంగ్‌రూట్‌లో దూసుకుపోయే వారికి కొదవే లేదు. ఇవి నిత్యం చిన్న చిన్న ప్రమాదాలకు కారణంగా మారుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఎదుటి వారి ఉసురు తీయడంతో పాటు కుటుంబాన్నే కకలావికలం చేస్తున్నాయి. షేక్ అలీముద్దీన్ అనే యువకుడు తన బైక్‌పై రాంగ్‌రూట్‌లో దూసుకువస్తూ..మరో బైక్‌ను ఢీ కొట్టాడు. ఈ ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇరువురిలో సెక్యూరిటీ గార్డు కుమారుడు సత్యసాయి (15) దుర్మరణం చెందాడు. పదో తరగతి పరీక్షలు రాసిన ఇతడు భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నాడు. నింబోలిఅడ్డా ప్రాంతానికి చెందిన వస్త్ర వ్యాపారి గోవింద్‌కర్వా (30) తన ద్విచక్ర వాహనంపై సికింద్రాబాద్ నుంచి కాచిగూడ వస్తున్నారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న చిల్డ్రన్స్ పార్క్ వద్ద రాంగ్‌రూట్‌లో వచ్చిన కారు ఇతడి బైక్‌ను ఢీ కొట్టి కొద్ది దూరం ఈడ్చుకెళ్లింది. అటుగా వచ్చిన మరో కారు ఢీ కొనడంతో గోవింద్ కన్నుమూశాడు.

మద్యం మత్తు, అతి వేగంతో 'చిత్తు' చేస్తున్నారు...

మద్యం తాగడం కొందరికి సరదా అయితే మరెందరికో వ్యసనం. తమ ఆనందం కోసం మత్తులో జోగుతూ వాహనాలు నడుపుతున్న డ్రైవర్లు తమ ప్రాణాల మీదికి తెచ్చుకోవడమే కాకుండా... అభం శుభం తెలియని వారి జీవితాల్నీ చిత్తు చేస్తున్నారు. పట్టపగలూ యథేచ్ఛగా మత్తులో 'విహరిస్తున్నారు'. ఇలాంటి వారి బారినపడి నిత్యం అనేక మంది గాయపడటం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. ఇక అతివేగం విషయానికి వస్తే మణికొండ ప్రాంతానికి చెందిన శాంతమ్మ (55) తన భర్తతో కలిసి ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తోంది. అదే సమయంలో రేసింగ్‌లో దూసుకుపోతున్న మూడింటిలో ఒక కారు వీరి వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శాంతమ్మ చనిపోగా..ఆమె భర్తకు గాయాలయ్యాయి.

ని'బంధనాలు' కాదని గుర్తించాలి: ట్రాఫిక్ కాప్స్

రోడ్డు నిబంధనల్ని బంధనాలుగా భావించే వారే 80 శాతం ఉంటున్నారని ట్రాఫిక్ పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఈ ఉద్దేశమే అనేక సందర్భాల్లో ఉల్లంఘనలకు ప్రేరేపిస్తోందని స్పష్టం చేస్తున్నారు. వీరి వ్యవహార శైలితో ఏ పాపం ఎరుగని వారు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉందని చెప్తున్నారు. నిబంధనలు అనేవి కేవలం భద్రత కోసం ఏర్పాటు చేసినవని గుర్తించడంతో పాటు వాటిపై అవగాహన పెంచుకోవడం, కచ్చితంగా పాటించడంతోనే ఇలాంటి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చేసే అవకాశం ఉందని చెప్తున్నారు.



సి'వీక్'సెన్స్‌కు తోడు లోపాలు: నిపుణులు

ఇలాంటి ప్రమాదాలు జరగడానికి ప్రధానంగా వాహనచోదకుల్లో కొరవడిన సెన్స్, ఆర్టీఏ విధానంలో ఉన్న లోపాలే కారణమని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. అనేక కారణాల నేపథ్యంలో కార్లతో పాటు ఇతర వాహనాలు కొనుగోలు చేస్తున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అయితే వీటిని డ్రైవ్ చేయడం దగ్గర నుంచి వాటి నిర్వహణ, పార్కింగ్, ఎక్కడం, దిగడం వంటి వాటిపై చోదకులకు అవగాహన ఉండట్లేదు. డ్రైవింగ్ స్కూళ్లు సైతం ఇవన్నీ బోధించాల్సిన ఆవశ్యకతను గుర్తించట్లేదు. కంప్యూటర్, ట్రాక్ టెస్ట్‌ల ద్వారా వీటిని పరీక్షించిన తరవాత మాత్రమే లైసెన్స్ జారీ చేయాల్సిన ఆర్టీఏ విభాగంలోనూ అనేక లోపాలు ఉంటున్నాయి. వీటన్నింటి కారణంగా ఇలాంటివి ఉత్పన్నం అవుతున్నాయని నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుతం చట్టంలో ఉన్న లోపాల కారణంగా అన్ని రకాల ప్రమాదాలను ఒకే గాడినకట్టి కేసు నమోదు చేస్తున్నారని, ఈ విధానం మార్చడానికి వాహనం, డ్రైవర్ తీరుతెన్నుల ఆధారంగా కేసులు నమోదు చేసేలా చట్టంలోనూ సవరణలు రావాలని సూచిస్తున్నారు.

నడి రోడ్డుపై నరకం..

గోతిలో ఇరుక్కుపోయిన సిటీ బస్సు

- గంటల పాటు ట్రాఫిక్ జామ్
- ఎండలో ఉడికిపోయిన వాహనదారులు

పంజగుట్ట: అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణాల కోసం తవ్విన గోతిలో ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. దీంతో మిట్ట మధ్యాహ్నం వాహనదారులు ఎర్రటి ఎండలో నరకాన్ని చూశారు. సోమాజిగూడ ఆర్టీఏ కార్యాలయం వద్ద నుంచి సివిల్ సప్లయ్ భవన్ వరకు అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శుక్రవారం ప్రణవ బిల్డింగ్ వద్ద మంచినీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీరు లీకేజీ అయింది. ఈ నీరు కాస్తా కేబుళ్ల కోసం తవ్విన గోతుల్లోకి చేరాయి. దీంతో ఈ మార్గంలో వెళుతున్న ఆర్టీసీ బస్సు అందులో దిగబడింది. దీంతో ఎర్రమంజిల్ నుంచి పంజగుట్ట, అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్ వరకు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు క్రేన్ సహాయంతో బస్సును అక్కడి నుంచి తరలించారు.


గోతిలో దిగబడిన ఆర్టీసీ బస్సు


నిలిచిపోయిన వాహనాలు

వేర్వేరు ప్రాంతాల్లో రెండు బస్సులు దగ్ధం

బాలానగర్: వేర్వేరు ప్రాంతాల్లో రెండు ప్రైవేట్ బస్సులు షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. బాలానగర్ నుంచి కూకట్‌పల్లి వై జంక్షన్ వైపు వెళుతున్న ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు దగ్ధమైన సంఘటన కూకట్‌పల్లి వై జంక్షన్ సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద చోటు చేసుకుంది. బస్సులో నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో అప్రమత్తమైన బస్సు డ్రైవర్ ప్రయాణికులను కిందకు దించి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో బస్సు పూర్తిగా దగ్ధమైంది. ఈ కారణంగా బాలానగర్ నుంచి వచ్చే వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది అదుపులోకి తెచ్చారు.

మదీనాగూడ చౌరస్తాలో..

మియాపూర్: కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు శుక్రవారం మధ్యాహ్నం బీరంగూడ నుంచి కూకట్‌పల్లి వైపు వస్తుండగా మదీనాగూడ ప్రాంతంలో బస్సు ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. దీనిని గుర్తించిన స్థానికులు, వాహనదారులు బస్సు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడంతో అతను బస్సును జాతీయ రహదారి పక్కన ఆపి ఫైర్ ఇంజిన్‌కు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు.


దగ్ధమైన ఆరెంజ్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు

రూ.కోటి కొల్లగొట్టిన కేటుగాళ్లు

ఇద్దరి నుంచి భారీ మొత్తంలో స్వాహా

హిమాయత్‌నగర్: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోయారు. ఇద్దరి నుంచి రూ.కోటికి పైగా కొట్టేసి మరిన్ని లక్షలు కావాలంటూ డిమాండ్ చేస్తుండటంతో బాధితులు శుక్రవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నగరానికి చెందిన ఇద్దరు యువకులు వేర్వేరుగా గూగుల్‌లో పార్ట్‌టైం ఉద్యోగాల కోసం అన్వేషిస్తుండగా ఇద్దరు నేరగాళ్లు టెలిగ్రామ్ ద్వారా వారితో పరిచయం చేసుకున్నారు. ఇంటి వద్దనే ఉండి రూ. కోట్లు సంపాదించే ఐడియా ఇస్తామంటూ ఆశ చూపారు. తాము వర్క్ ఇచ్చేలోపు తాము చెప్పిన వెబ్‌సైట్‌లలో ఇన్వెస్ట్ చేయాలని కోరారు. పార్ట్‌టైం కంటే ఇన్వెస్ట్‌మెంట్‌లో ఎక్కువ లాభాలు ఉంటాయని, అత్యంత తక్కువ సమయంలో కోటీశ్వరులు కావొచ్చంటూ ఎర వేశారు. వారి మాటలు నమ్మిన వారిద్దరూ అందుకు అంగీకరించారు. తొలిరోజుల్లో రెండింతలు లాభాలు ఇచ్చి నమ్మకాన్ని రెట్టింపు చేసుకున్నారు. ఆ తర్వాత ఓ వ్యక్తి నుంచి రూ.94 లక్షలు, మరో వ్యక్తి నుంచి రూ.14లక్షలు పెట్టుబడి పెట్టించి టాస్క్‌లు అంటూ మాయ మాటలు చెప్పి కాలయాపన చేశారు. లాభాలు లేక పోయినా పర్వాలేదు తమ డబ్బు తమకివ్వాలని కోరినా స్పందించకుండా మరిన్ని రూ.లక్షలు డిమాండ్ చేస్తుండటంతో పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపారు.

సైబరాబాద్ పోలీసులకు ప్రతిభా పురస్కారాలు



సైబరాబాద్ కమిషనరేట్‌లో పతకాలు అందజేస్తున్న సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైబరాబాద్ పోలీసు సిబ్బందికి ప్రతిభా పురస్కారాలను అందజేశారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర పతకాలను ప్రదానం చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట సేవలందించిన పోలీసులకు ప్రభుత్వం అవార్డులు ప్రకటించింది. ఈ సందర్భంగా సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన పోలీస్ సిబ్బందిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వారిని సేవా పతకాలతో సత్కరిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రజలకు సేవలు అందించాలన్నారు.

93 మంది పోలీసులకు పతకాలు, ప్రశంసాపత్రాలు

2022 సంవత్సరానికి గాను సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 93 మంది పోలీసులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ఇందులో 8 అతి ఉత్కృష్ట, 18 ఉత్కృష్ట, 10 సేవా పతకాలు కలిపి 36 మెడల్స్, 57 ప్రశంసాపత్రాలు అందజేస్తున్నామన్నారు. వీరిలో హోంగార్డు నుంచి ఏడీసీపీ ర్యాంక్ స్థాయి అధికారులు ఉన్నారన్నారు. డీజీపీ కమాండేషన్ తీసుకున్న వారిలో అదనపు డీసీపీ సీపీఎస్‌జీ నర్సింహారెడ్డి, సీపీఎస్ శశాంక్‌రెడ్డి, ఏసీపీ చంద్రశేఖర్, ఏసీపీ శ్యామ్‌బాబు, ఏసీపీ రఘునందన్‌రావు, బాలానగర్ సీపీఎస్ ఇన్‌స్పెక్టర్ బాలరాజు, శంకర్‌పల్లి ఇన్‌స్పెక్టర్ ప్రసన్నకుమార్, చేవెళ్ల ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వాసు ఉన్నారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ ట్రాఫిక్ నారాయణ్‌నాయక్, డీసీపీ యెగేష్ గౌతమ్, రితిరాజ్, నితికా పంత్, రష్మీపెరుమాల్, కవిత, శ్రీనివాసరావు, నారాయణరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసరావు, సందీప్, పలువురు ఏడీసీపీలు, ఏసీపీలు, సీఏఓ అడ్మిన్ గీత, ఇన్‌స్పెక్టర్లు, మినిస్టీరియల్ స్టాఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మార్బుల్స్ లోడ్‌తో వెళుతున్న వ్యాన్ బోల్తా

ఒకరి దుర్మరణం , ముగ్గురికి గాయాలు



సంజీవ మృతదేహం



జాతీయ రహదారిపై బోల్తా పడిన వ్యాన్

ఘట్‌కేసర్: మార్బుల్స్ లోడుతో వెళుతున్న వ్యాన్ బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు గాయపడిన సంఘటన ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అశోక్ లేలాండ్ వ్యాన్‌లో డ్రైవర్ పవన్ కుమార్ బీబీనగర్ నుంచి మార్బుల్స్ లోడ్ తీసుకుని రాంపల్లికి వెళుతున్నాడు. అతి వేగం కారణంగా ఘట్‌కేసర్ బైపాస్ రోడ్డు మైసమ్మగుట్ట హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద వ్యాన్ డివైడర్‌ను ఢీకొట్టి జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో మార్బుల్స్ మీద పడి సంజీవ (45) అనే వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. బీహార్‌కు చెందిన కూలీలు వికంద్‌రాయ్, సంతోశ్‌కుమార్, సురేందర్‌కు తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ లోకేశ్‌కుమార్



హెచ్ఎండీఏ కార్యాలయంలో..

సాక్షి, సిటీబ్యూరో: హెచ్ఎండీఏ, హెచ్‌జీసీఎల్ కార్యాలయాల వద్ద తెలంగాణ అవతరణ వేడుకలు ఘనంగా జరిగాయి. అమీర్‌పేట్‌లోని హెచ్ఎండీఏ ప్రధాన కార్యాలయం ఆవరణలో సెక్రెటరీ పి.చంద్రయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించగా, నానక్‌రామ్ గూడ లోని హెచ్‌జీసీఎల్ వద్ద మేనేజింగ్ డైరెక్టర్ (ఇన్ చార్జ్) బీఎల్ఎస్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

- బేగంపేట్‌లోని హైదరాబాద్ మెట్రో రైల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలోఎండీ ఎన్వీఎస్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. పలువురు ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
- ఖైరతాబాద్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో జరిగిన వేడుకలలో హైదరాబాద్ జేటీసీ పాండురంగ్ నాయక్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ప్రాంతీయ రవాణా అధికారి రాంచందర్, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఐసీసీసీలో..

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు బంజారాహిల్స్‌లోని తెలంగాణ స్టేట్ ఇండిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో (టీఎస్ ఐసీసీసీ) ఘనంగా జరిగాయి. జాయింట్ సీపీ పరిమళ నూతన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.



మెట్రో రైల్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎన్వీఎస్ రెడ్డి



ఆర్టీఏ కార్యాలయంలో మాట్లాడుతున్న జేటీసీ పాండురంగ్ నాయక్



ఇండిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో..

కోటలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా కేంద్ర సాంస్కృతికశాఖ విభాగం వారు గోల్కొండ కోటలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కోటలోని రాణీ మహల్ ఎదురుగా ఉన్న ప్రాంగణం వీటికి వేదికైంది. డాక్టర్ ఆనంద్ శంకర్ అండ్ గ్రూప్, మంజుల రామస్వామి గ్రూప్ వారి నృత్య కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రముఖ గాయని మంగ్లీ గీతాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పాల్గొని వివిధ పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందించారు.

దివ్యాంగులకు ఉచిత విద్య



వంశీరామరాజు

అబ్దుల్లాపూర్‌మెట్ : దివ్యాంగులైన చిన్నారులకు ఆంగ్ల మాధ్యమంలో ఒకటవ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉచిత విద్య అందిస్తామని వేగేశ్న ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ వంశీరామ రాజు, చైర్‌పర్సన్ సుంకరపల్లి శైలజ తెలిపారు. రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలను పురస్కరించుకుని వారు మాట్లాడుతూ.. 35 ఏళ్లుగా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కుంట్లూర్‌లో తమ ఫౌండేషన్ ద్వారా దివ్యాంగులకు ఎనలేని సేవలందిస్తున్నామన్నారు. వేగేశ్న ఫౌండేషన్ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నట్లు వారు తెలిపారు. తమ ఫౌండేషన్‌ద్వారా ఉచిత సేవలను పొందాలనుకునే వారు కుంట్లూర్‌లోని వేగేశ్న ఫౌండేషన్‌లో ఈ నెల 13 నుంచి సంప్రదించాలని కోరారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

నిందితుడి అరెస్ట్

రాజేంద్రనగర్: బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఓ మైనర్ బాలుడిని మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అతడికి సహకరించిన మరో ముగ్గురు స్నేహితులు పరారీలో ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. మహారాష్ట్రకు చెందిన మహిళ భర్త మృతి చెందడంతో కుమార్తె(13)తో సహా ఏడాది క్రితం నగరానికి వలస వచ్చి కాటేదాన్ మధుబన్‌కాలనీలో నివాసం ఉంటూ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తుంది. వీరి ఇంటి పక్కనే ఉంటున్న మైనర్ బాలుడు సదరు బాలికను గురువారం తన గదిలోకి పిలిచి లైంగిక దాడికి పాల్పడ్డాడు. మరో ముగ్గురు స్నేహితులు అతనికి సహకరించారు. బాధితురాలు సాయంత్రం ఈ విషయాన్ని తన తల్లికి తెలిపింది. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం నిందితుడిని అరెస్టు చేశారు. మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని తెలిపారు.

మా'పని'తో వచ్చేది పొట్టే!

మంత్రి మల్లారెడ్డి వ్యాఖ్యలపై పోలీసుల స్పందన

సాక్షి, సిటీబ్యూరో: పోచారం ఐటీ కారిడార్‌లో కొత్తగా ఏర్పాటైన పోలీసుస్టేషన్ ప్రారంభోత్సవం గురువారం జరిగింది. ఇందులో పాల్గొన్న రాష్ట్ర మంత్రి సి.మల్లారెడ్డి పొట్ట ఉన్న పోలీసులకు పదోన్నతులు ఇవ్వొద్దంటూ వ్యాఖ్యానించారు. ఇవి శుక్రవారం పోలీసు గ్రూపుల్లో వైరల్‌గా మారాయి. దీనిపై అటు అధికారులు, ఇటు సిబ్బంది కూడా ఘాటుగా స్పందిస్తున్నారు. తమలో ఈ పరిస్థితి నెలకొనడానికి అనేక కారణాలున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్రంలోని ఇతర శాఖలతో పోలిస్తే ఫిట్‌నెస్ అనేది పోలీసు వారికి అత్యంత కీలకమైన అంశం. ఎంపిక, శిక్షణ, విధి నిర్వహణ ఇలా అన్ని స్థాయిల్లోనూ ఇది పరిగణలోకి తీసుకుంటారు. ఎంపిక, శిక్షణ దశల్లో ఉన్న దారుఢ్యం ప్రస్తుతం అతి తక్కువ మందిలోనే కనిపిస్తోంది.

ఈ స్థితికి కారణాలు అనేకం...

పోలీసు ఉద్యోగం కోసం ఎంపికయ్యే, శిక్షణలో ఉన్నప్పుడు తీసుకున్నంత ఆరోగ్య శ్రద్ధ విధుల్లో చేరిన తరవాత తీసుకోకపోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. మరోపక్క సమయం, సందర్భం లేకుండా బందోబస్తు, ఇతర విధులు నిర్వర్తించే సిబ్బందికి ఆహారం, నిద్ర సరైన సమయానికి సాధ్యం కావు. అన్ని రోజుల్లోనూ ఒకే సమయంలో తీసుకోవడం కూడా అసంభవమే. ఇది పొట్ట, ఊబకాయం పెరగడంతో పాటు అనేక ఇతర రుగ్మతలకూ మూలంగా మారుతోందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ఈ ఇబ్బందులతో పాటు మహిళా సిబ్బంది విషయంలో మరికొన్ని కారణాలతో ఊబకాయం సమస్యకు లోనవుతున్నారు. సిటీలో పనిచేసే సిబ్బంది బందోబస్తులతో మరింత 'భారం'గా మారుతున్నారు. నగరంలో పని చేసే వారిలో సగం కంటే ఎక్కువ మంది దాదాపు 160 నుంచి 180 రోజుల వరకు ఈ విధుల్లో గడపాల్సిందే. ఇందులో భాగంగా కొన్ని ప్రత్యేక సందర్భాల్లో మినహాయిస్తే ఒకే ప్రాంతంలో గంటల తరబడి కూర్చోవడం, ఎక్కువగా బయట తయారు చేసి, నూనె ఉత్పత్తులు తీసుకోవడం అనివార్యంగా మారుతోంది. ఈ కారణంగానే సిబ్బంది తమ బరువుపై అదుపు కోల్పోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది.

అప్పటిలా కనిపించని డ్రిల్స్...

పోలీసు విభాగంలో పని చేసే సిబ్బంది కచ్చితంగా ఫిట్‌నెస్‌తో ఉండాలన్న ఉద్దేశంతో డ్రిల్స్‌ను ప్రవేశపెట్టారు. గతంలో ఇవి పోలీసుస్టేషన్లు, డివిజన్ల వారికీ ప్రతి వారం జరిగేవి. ఇందులో భాగంగా దాదాపు మూడునాలుగు గంటల పాటు వ్యాయామం, ఇతర కసరత్తులు చేయించే వారు. అయితే ప్రస్తుతం బందోబస్తులు, ఇతర పనులకే సమయం చాలకపోవడంతో డ్రిల్స్ మూలనపడ్డాయి. ఎవరికి వారూ సొంతంగా చేసుకోవడానికీ అవకాశం చిక్కట్లేదు.

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్

గోల్కొండ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో గోల్కొండ రాణీమహల్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల ఫొటో ఎగ్జిబిషన్ సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో కేంద్ర ప్రభుత్వం 9 ఏళ్లలో సాధించిన విజయాలకు సంబంధించిన ఛాయాచిత్రాలను ఏర్పాటు చేశారు. స్వాతంత్ర సమరయోధులు అల్లూరి సీతారామ రాజు, మల్లు స్వరాజ్యం, కొమురం భీం, గౌతు లచ్చన్నల ఛాయాచిత్రాలు ఆకట్టుకున్నాయి.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కోటలో తెలంగాణ ఆవిర్భావ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పోతరాజుల నృత్యాలు, తలలపై బోనాలతో మహిళల పూనకాలు, డప్పు కళాకారుల విన్యాసాలు అలరించాయి.





క్లుప్తంగా...

సోనియా వల్లే తెలంగాణ రాష్ట్రం



సోనియా చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సుశీల్‌కుమార్

వెంగళరావునగర్: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ వల్లే తెలంగాణ రాష్ట్రం సాకారం అయ్యిందని కాంగ్రెస్ పార్టీ వెంగళరావునగర్ డివిజన్ అధ్యక్షుడు బిట్ల సుశీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం వెంగళరావునగర్‌లో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు అర్జున్, వీరస్వామి, ఆగమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం చూపి స్కూల్ తరలించండి



మంత్రి వేములకు వినతిపత్రం ఇస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పంజగుట్ట: నిమ్స్ ఆస్పత్రి విస్తరణలో భాగంగా తొలగించనున్న ఎర్రమంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రత్యామ్నాయం చూపే వరకు తొలగించరాదని కోరుతూ ఖైరతాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి లేఖ సమర్పించారు. ఈ సందర్భంగా ఖైరతాబాద్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, సీనియర్ నాయకుడు కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ... పాఠశాలలో 400 మంది విద్యార్థులు చదువుతున్నారని వారి భవిష్యత్తును, తల్లిదండ్రులు పడుతున్న ఆవేదనను దృష్టిలో పెట్టుకుని ప్రత్యామ్నాయం చూపించేవరకు పాఠశాల తొలగించరాదన్నారు. కార్యక్రమంలో నేతలు మెట్టు రాజు, బోనగిరి కృష్ణ, సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



జన్ ఔషధి కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

శ్రీనగర్‌కాలనీ: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎర్రగడ్డ డివిజన్‌లో డాక్టర్ ఆర్‌వీ గాయత్రి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి జన్ ఔషధి కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో సెంట్రల్ బీజేపీ ప్రెసిడెంట్ గౌతమ్‌రావు, నేతలు లంకల దీపక్‌రెడ్డి, ఆదిత్య, కుంబాల గంగరాజు, రాజేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరిన రిటైర్డ్ ఎస్‌ఐ



శివను పార్టీలోకి ఆహ్వానిస్తున్న వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల

బంజారాహిల్స్: హైదరాబాద్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన యెహో శివ వైఎస్సార్ టీపీలో చేరారు. శుక్రవారం లోటస్ పాండ్‌లో వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వై.ఎస్.షర్మిల ఆయనకు పార్టీ కండువా వేసి ఘనంగా ఆహ్వానించారు. శివతో పాటు ఆయన అనుచరులు కూడా పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. వైఎస్సార్ టీపీ ఖైరతాబాద్ నియోజకవర్గం సమన్వయ కర్త యర్రవరపు రమణ పాల్గొన్నారు.

తొలిరోజే చోరీ కేసు నమోదు

వెంగళరావునగర్: మధురానగర్ పోలీస్ స్టేషన్ ప్రారంభమైన తొలిరోజే ఓ చోరీ కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు... వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని వీడియోగల్లీలో శివ అనే ప్రైవేటు ఉద్యోగి నివసిస్తున్నాడు. గత నెల 31న అతని పల్సర్ బైక్ ఇంటి ముందు పార్కు చేసి నిద్రించాడు. ఉదయం లేచి చూసే సరికి ద్విచక్ర వాహనం కనిపించలేదు. చుట్టుపక్కల విచారించిన అనంతరం శుక్రవారం మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబరాన్నంటిన ‘దశాబ్ది’ సంబురం

- వాడవాడలా జాతీయ పతాకాల ఆవిష్కరణ
- అమరవీరులకు ఘనంగా నివాళి
- పలు ప్రాంతాల్లో సేవాకార్యక్రమాలు
- ప్రజలకు పెద్ద ఎత్తున అన్నదానం



ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు వాడవాడలా ఘనంగా జరిగాయి. శుక్రవారం బస్తీ నుంచి కార్యాలయాలు, పోలీస్ స్టేషన్ల వరకు నిర్వహించిన దశాబ్ది వేడుకల్లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్ని పోలీస్ స్టేషన్లు, మండల కార్యాలయాలు, జీహెచ్‌ఎంసీ కార్యాలయాల్లో నిర్వహించిన ఈ వేడుకల్లో అధికారులు పాల్గొని జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

- నందినగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం తెలంగాణ రాష్ట్ర సాధనకు అమరవీరులు చేసిన కృషి ఈ పదేళ్ల కేసీఆర్ పాలనలో రాష్ట్రం సాధించిన విజయాలను గుర్తు చేసుకున్నారు. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో వీసీ సీతారామారావు జెండాను ఆవిష్కరించారు. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి షేక్‌పేట మండల కార్యాలయంలో తహసిల్దార్ రామకృష్ణ, జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రవి కిరణ్, ఉదయ్‌నగర్‌లో ఖైరతాబాద్ కాంగ్రెస్ నాయకురాలు పి.విజయారెడ్డి తదితరులు ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ జోనల్ కార్యాలయంలో...

- తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ ఉత్సవాలు జీహెచ్‌ఎంసీ ఖైరతాబాద్‌లోని జోనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జోనల్ కమిషనర్ రవి కిరణ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.

పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో...

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఇన్‌స్పెక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఎస్‌ఐలు శ్రీనివాస్, విజయ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో...

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్లలో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్ పటేల్‌లు వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జెండాలను ఆవిష్కరించారు. భారతీయ జనతాపార్టీ జాతీయ మహిళా మోర్చ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ పద్మ వీరపనేని నియోజకవర్గంలోని అనేక కాలనీలు, బస్తీల్లో జెండా ఎగురవేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్‌లో ఘనంగా వేడుకలు జరిగాయి. స్కూల్ చైర్మన్ శిరీష భవానీ శంకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు.

రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో...

- **రహమత్‌నగర్:** రహమత్‌నగర్, బోరబండ డివిజన్లలో ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరిగాయి. రహమత్‌నగర్ కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి పలు ప్రాంతాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. కాంగ్రెస్ నాయకులు మల్లేశ్ యాదవ్ నేతృత్వంలో సోనియాగాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. బోరబండ డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు.



జెండాను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ దేదీప్య విజయ్



రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి...



జూబ్లీహిల్స్ పీఎస్‌లో జెండా వందనం చేస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్‌రెడ్డి



ఫిలింనగర్ పీఎస్‌లో జెండా ఎగుర వేస్తున్న ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ



నందినగర్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ



ఖైరతాబాద్ జోనల్ కార్యాలయంలో జెడ్‌సీ రవికిరణ్



ఫిలింనగర్ రౌండ్‌టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో...



పంజగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ మోహన్ కుమార్



మోతీనగర్‌లో బీజేపీ నాయకురాలు డాక్టర్ పద్మ వీరపనేని...



సాయిసరస్వతి విద్యానికేతన్ స్కూల్‌లో చైర్మన్ శిరీష భవానీశంకర్



గౌరీ శంకర్ కాలనీలో కార్పొరేటర్ విజయారెడ్డి

మధురానగర్ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా శ్రీనివాస్



బి.శ్రీనివాస్

వెంగళరావునగర్: నూతనంగా ఏర్పాటు చేసిన మధురానగర్ పోలీస్ స్టేషన్ తొలి ఇన్‌స్పెక్టర్‌గా బి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో జూబ్లీహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించారు.

పేద రోగులకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలే లక్ష్యం



లక్డీకాపూల్: నిజామ్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) పురోభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని నిమ్స్ ఇంచార్జి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. శుక్రవారం నిమ్స్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ జెండాను ఎగురవేసిన డైరెక్టర్ మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణ, సీఎం ఓఎస్‌డీ డాక్టర్ గంగాధర్, ఆరోగ్యశ్రీ నోడల్ అధికారి డాక్టర్ స్వర్ణలత, డిప్యూటీ రిజిస్ట్రార్ పి.రాజ్ కుమార్, మాజీ ఈఆర్ పరంజ్యోతి, వైద్యులు సతీష్, సదాశివుడు, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరణానంతరం మహిళ శరీరదానం



శరీర, నేత్రదానం చేసిన పార్వతి

బంజారాహిల్స్: సమాజ సేవలో భాగంగా తన వంతు బాధ్యతగా ఓ మహిళ తాను బతికున్నప్పుడే శరీరం, నేత్రాలు దానం చేస్తూ నగరానికి చెందిన అమ్మ అవయవ నేత్ర శరీరదాన ప్రోత్సాహకుల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. గురువారం రాత్రి కాజాగూడలోని తన నివాసంలో కన్నుమూసిన దేవరపార్వతి(61) శరీరాన్ని, నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నేత్రాలను వాసన్ ఐ బ్యాంక్‌కు, శరీరాన్ని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీకి అందజేశారు. తన మరణానంతరం వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం శరీరాన్ని దానం చేస్తూ ఆమె తీసుకున్న నిర్ణయం పట్ల సర్వత్రా ప్రశంసలు లభించాయి.

సీపీఆర్‌పై శిక్షణను భారత్‌లో మరింత విస్తృతం చేస్తాం

బ్రిస్బేన్ అంతర్జాతీయ సదస్సులో ఫెడరేషన్ చైర్మన్ చక్రరావ్



సదస్సులో పాల్గొన్న వైద్యులు

బంజారాహిల్స్: కార్డియక్ అరెస్ట్ మరణాల నిరోధంలో సీపీఆర్‌పై శిక్షణను భారత్‌లో మరింత విస్తృతం చేస్తున్నామని ఇండియన్ రెసిసిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్ చైర్మన్ ఎస్.ఎస్.చక్రరావ్ తెలిపారు. తొలిసారిగా ఇండియన్ రెసిసిటేషన్ కౌన్సిల్ ఫెడరేషన్‌కు అంతర్జాతీయ లైజన్ కమిటీ ఆన్ రెసిసిటేషన్ గుర్తింపు లభించిందని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన తెలిపారు. ఆస్ట్రేలియాలోని బ్రిస్బేన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ లైజన్ కమిటీ ఆన్ రెసిస్టేషన్ సదస్సులో తమ ఫెడరేషన్‌కు తొలిసారిగా ఈ గుర్తింపు లభించిందన్నారు. ఈ సదస్సులో కౌన్సిల్ ఫెడరేషన్ ప్రతినిధులు డాక్టర్ లోకేష్ తివారి, డాక్టర్ వాకేష్ గార్గ్, డాక్టర్ లోకేష్ ఈదెల, ప్రొఫెసర్ సుశీల, డాక్టర్ సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారని తెలిపారు. దేశంలో పెరుగుతున్న కార్డియక్ అరెస్ట్ నివారణలో సీపీఆర్ శిక్షణను విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని దీనికి అంతర్జాతీయ రెసిస్టేషన్ కౌన్సిల్ సహాయ సహకారాలు కూడా అవసరమని ఈ సందర్భంగా వారు కోరారు. దేశం నలుమూలల నుంచి నిపుణులను ఆహ్వానిస్తూ ఫెడరేషన్ ఏర్పాటు చేశామని అన్నారు. దీనిలో పీడీయాట్రిషియన్స్, ఎమర్జెన్సీ మెడికల్ ఫిజీషియన్స్, క్రిటికల్‌కేర ఫిజీషియన్స్, ఐఎంఏ, ఫెడరేషన్ ఆఫ్ ప్రసూతి, గైనకాలజిస్టులను చేర్చడం జరిగిందన్నారు. 2018 నుంచి ఇప్పటి వరకు 13 లక్షల మందికి సీపీఆర్ గురించి శిక్షణ ఇచ్చామన్నారు.

ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ ప్రారంభం



ఫిలింనగర్: ఫిలింనగర్ నూతన పోలీస్ స్టేషన్‌లో పని విధానం ప్రారంభమైన సందర్భంగా శుక్రవారం ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో పాటు ఎస్‌ఐలు, సిబ్బంది ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. మొదటి ఫిర్యాదును మహ్మద్ షబ్బీర్ నుంచి స్వీకరించారు. షేక్‌పేట అల్హంరా కాలనీకి చెందిన మహ్మద్ షబ్బీర్ అకౌంటెంట్‌గా పని చేస్తుంటాడు. గుర్తు తెలియని వ్యక్తులు తన కార్యాలయంలోకి ప్రవేశించి ఎయిర్ కండీషన్లకు ఉన్న కాపర్ వైర్లను దొంగిలించారంటూ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుకు సంబంధించి మొదటి ఎఫ్‌ఐఆర్‌ను ఆయన అందజేశారు.

పని చేయించుకొని డబ్బులు ఇవ్వడం లేదు...

తాను చేసిన పనికి డబ్బులు ఇవ్వకుండా ఓ డిజైనర్ వేధిస్తున్నదంటూ ఓయూ కాలనీకి చెందిన తాజుద్దీన్ అనే ఫ్యాన్సీ మగ్గం వర్క్ డిజైనర్ ఫిలింనగర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఓయూ కాలనీలో ఉంటూ ఆన్‌లైన్ దుస్తుల వ్యాపారం చేస్తున్న శృతి అనే డిజైనర్ వద్ద తాను మగ్గం వర్క్ చేశానని రూ. 44 వేలు బాకీ పడిందని ఎన్నిసార్లు అడిగినా ఇవ్వడం లేదని బాధితుడు ఫిర్యాదు చేశారు. ఫిలింనగర్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.



అట్టహాసంగా ఎమ్మెల్యే మాగంటి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్యే గోపీనాథ్‌కు గజమాల వేస్తున్న కార్పొరేటర్ రాజ్‌కుమార్



శుభాకాంక్షలు చెబుతున్న నేతలు అప్పుఖాన్, తన్నుఖాన్

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూసుఫ్‌గూడలోని సవేరా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనతో కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు కేక్‌లు కట్ చేయించి పూలబొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ప్రత్యేకంగా తయారు చేయించిన గజమాలను కేన్‌ల ద్వారా తెప్పించి ఆయనకు వేశారు. కొందరు కార్యకర్తలు అందించిన కత్తితోపాటు బాణాన్ని ఆయన సంధించి ప్రజలకు అభివాదం చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు సి.ఎన్.రెడ్డి, దేదీప్య విజయ్, నాయకులు సంతోష్, నర్సింగ్‌దాస్, సంజీవ, విజయ్‌కుమార్, విజయ్‌సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారిక లేఖలో ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన ప్రాణం ఉన్నంతవరకు ప్రజలకు సేవ చేసుకుంటూ ఉంటానన్నారు.

ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్‌కాలనీలో...

శ్రీనగర్‌కాలనీ: ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్ కాలనీ బీఆర్‌ఎస్ నేతలు అప్పుఖాన్, తన్నుఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వనం సంగీత, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.



మధురానగర్‌లో అవిభక్త కవలలు వీణావాణీలకు బహుమతులు ఇస్తున్న ఎమ్మెల్యే గోపీనాథ్

ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ ప్రారంభం



పీఎస్‌ను ప్రారంభిస్తున్న డీసీపీ వెంకటేశ్వర్లు

ఖైరతాబాద్: సెంట్రల్ జోన్ పరిధిలోని నూతనంగా ఏర్పాటు చేసిన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం డీసీపీ వెంకటేశ్వర్లు ప్రారంభించారు. బిగ్రేడ్ పోలీస్ స్టేషన్‌గా ఏర్పాటైన పోలీస్ స్టేషన్‌ను సైఫాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ భవనం మొదటి అంతస్తులో ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పి.నిరంజన్‌రెడ్డి, డీఐగా సి.హెచ్.పరుశురాం బాధ్యతలు చేపట్టారు. కార్యక్రమంలో అడిషినల్ డీసీపీ రమణారెడ్డి, సైఫాబాద్ డివిజన్ ఏసీపీ సంజయ్‌కుమార్, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బోరబండ పీఎస్ ప్రారంభం



సర్వమత ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎస్‌హెచ్‌ఓ

రహమత్‌నగర్: కొత్తగా ఏర్పాటైన బోరబండ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం లాంఛనంగా ప్రారంభించారు. బోరబండ పీఎస్ తొలి స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. పంజగుట్ట ఏసీపీ మోహన్‌కుమార్, ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ సైదులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



వైభవంగా ఆలయ ముఖద్వార నిర్మాణ పూజలు

వెంకటేశ్వరకాలనీ: పంజగుట్ట ప్రతాప్‌నగర్ ఆర్య సమాజ్ వద్ద కొలువుదీరిన శ్రీ నల్లపోచమ్మ తల్లి దేవాలయం, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, శ్రీ బండ మైసమ్మతల్లి దేవాలయం, శ్రీ హనుమాన్ ఆలయాల ముఖద్వార శంకుస్థాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. పంజగుట్ట బస్తీ కమిటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కమిటీ నేతలు వై.గోపాల్, బి. మల్లేశ్వర్ యాదవ్, ఆనంద్‌కుమార్, పవన్‌కుమార్‌ముదిరాజ్, బి. శ్రీనివాస్ యాదవ్, నటరాజ్, వై. గణేష్, ఎస్. యాదయ్య యాదవ్,ఎం. అశోక్, ప్రవీణ్ కుమార్ యాదవ్, జి. ఆనంద్, శాంతి స్వరూప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

తెలంగాణను గుజరాత్‌ని పోల్చి చూద్దామా!

విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: 'తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని మీ నేత, ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌తో పోల్చి చూద్దామా'అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. డబుల్ ఇంజిన్ సర్కార్లు అంటూ గొప్పలు చెప్పుకుంటున్న బీజేపీ, గుజరాత్‌లో ఒరగబెట్టిందేమీ లేదని దుయ్యబట్టారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ, ఉద్యోగాల కల్పనపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. మొత్తం బీజేపీ పాలిత రాష్ట్రాలలో కలిపి కూడా గడిచిన తొమ్మిదేళ్లలో తెలంగాణలో ఇచ్చినన్ని ఉద్యోగాలు కల్పించ లేకపోయారని అన్నారు. సరైన ప్రత్యామ్నాయం లేకనే కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రత్యామ్నాయం ఉన్న చోట వేరే పార్టీలే విజయం సాధిస్తున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉనికి కోసమే బీజేపీ పడరానిపాట్లు పడుతోందని ఎద్దేవా చేశారు. తెలంగాణ గురించి మాట్లాడే నైతికత కిషన్‌రెడ్డికి లేదన్నారు. బీజేపీ కుట్రలు రాష్ట్రంలో పనిచేయవని, మొత్తం తెలంగాణ సమాజం కేసీఆర్ వెంటే ఉందని అన్నారు.

అరెస్టు చేశాం.. పోలీసు మార్జాలాలు ఉండవు

ఎలాన్ మస్క్ ట్వీట్‌పై ఢిల్లీ పోలీసుల స్పందన



న్యూఢిల్లీ: ట్విట్టర్ అధినేత, బిలియనీర్ ఎలాన్ మస్క్ చేసిన ట్వీట్‌కు ఢిల్లీ పోలీసులు ఇచ్చిన సమాధానం నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. పర్‌ఫెక్ట్ రిప్లై ఇచ్చారంటూ పొగడ్తల్లో ముంచెత్తుతున్నారు. అసలేం జరిగిందంటే.. పోలీసు జాగిలాలు (కుక్కలు) ఉంటాయని మనకు తెలుసు, మరి పోలీసు మార్జాలాలు (పిల్లులు) కూడా ఉంటాయా? అని తన కుమారుడు లిటిల్ ఎక్స్ అడిగాడంటూ మస్క్ గురువారం ట్వీట్ చేశారు. ఈ ట్వీట్‌పై ఢిల్లీ పోలీసు శాఖ శుక్రవారం స్పందించింది. ''హాయ్ ఎలాన్ మస్క్! పోలీసు పిల్లులు ఉండవు. ఎందుకంటే నేరాలు ఘోరాలు చేసినందుకు వాటిని ఎప్పుడో అరెస్టు చేసేశాం. ఈ సంగతి మీ లిటిల్ ఎక్స్‌కు చెప్పండి''అని ట్వీట్ చేసింది. భలేగా స్పందించారంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.



శుక్రవారం గుంటూరు చుట్టగుంట సెంటర్‌లో 2,562 ట్రాక్టర్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

ఇదిగో గ్రామ స్వరాజ్యం

ప్రతి అడుగులోనూ రైతులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం

- వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద పరికరాల పంపిణీలో ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు : రాష్ట్ర ప్రభుత్వం అన్నదాతలను అన్నివిధాలా చేయి పట్టుకుని నడిపించడంలో భాగంగా రైతన్నలే ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లన్నింటినీ అతి తక్కువ అద్దెతో మిగిలిన రైతులకు అందుబాటులోకి తేవడం గ్రామ స్వరాజ్యానికి నిజమైన అర్థం అని ఏపీ సీఎం వైఎస్ జగన్ అన్నారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో భాగంగా శుక్రవారం ఆయన గుంటూరు చుట్టుగుంట సెంటర్‌లో రాష్ట్ర స్థాయి రెండో మెగా పంపిణీ కింద రూ.361.29 కోట్ల విలువ గల 2,562 ట్రాక్టర్లు, 100 కంబైన్డ్ హార్వెస్టర్లు, 13,573 ఇతర వ్యవసాయ పనిముట్లను రైతులకు అందజేసే కార్యక్రమాన్ని లాంఛనంగా జెండా ఊపి ప్రారంభించారు. అంతకు ముందు ట్రాక్టర్‌ను, కంబైన్డ్ హార్వెస్టర్ స్వయంగా నడిపారు. అనంతరం రూ.125.48 కోట్ల సబ్సిడీ సొమ్మును కంప్యూటర్‌లో బటన్ నొక్కి నేరుగా రైతన్నల గ్రూపుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ ప్రతి ఆర్బీకే పరిధిలో ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ కింద రైతులకు కావాల్సిన ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న రైతులే ఒక గ్రూపుగా ఏర్పడి దానిని ఒక కమ్యూనిటీ హైరింగ్ సెంటర్ కిందకు తీసుకుని వచ్చి, ఆ ఆర్బీకే పరిధిలో ఉన్న మిగిలిన రైతులందరికీ తక్కువ ధరకు ఈ యంత్రాలన్నింటినీ అందుబాటులోకి తీసుకొచ్చే గొప్ప కార్యక్రమానికి తమ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. తద్వారా 10,444 ఆర్బీకేల పరిధిలో రైతులకు ట్రాక్టర్లతో కూడిన వ్యవసాయ పనిముట్లు తక్కువ అద్దెతో అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు.

దామరచర్ల @ 46.8!

నల్లగొండ జిల్లా దామరచర్లలో ఈ వేసవిలోనే అత్యధిక ఉష్ణోగ్రత

- రాష్ట్రవ్యాప్తంగా ఠారెత్తిస్తున్న ఎండలు
- రెండ్రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు: వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. వివిధ ప్రాంతాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. రాష్ట్ర ప్రణాళికా విభాగం సేకరిస్తున్న గణాంకాల ప్రకారం నల్లగొండ జిల్లా దామరచర్లలో శుక్రవారం ఈ వేసవిలోనే అత్యధికంగా 46.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది, అలాగే పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 46.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. మరోవైపు రానున్న రెండ్రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయని, వడగాడ్పులు కూడా వీస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రజలు అత్యవసరమైతే తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి వాయవ్య, పశ్చిమ దిశల నుంచి తక్కువ ఎత్తులో బలమైన గాలులు వీస్తున్నాయని పేర్కొంది. శని, ఆదివారాల్లో పలు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 డిగ్రీల సెల్సియస్ నుంచి 44 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా గ్రేటర్ హైదరాబాద్ సమీప జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల నుంచి 41 డిగ్రీల మధ్య నమోదు కావొచ్చని పేర్కొంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ఠ ఉష్ణోగ్రత
దామరచర్ల	నల్లగొండ	46.8
ముత్తారం	పెద్దపల్లి	46.4
తంగుల	కరీంనగర్	45.9
మునగాల	సూర్యాపేట	45.7
మహదేవ్‌పూర్	భూపాలపల్లి	45.6

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.3	25.4	ఖమ్మం	43.2	28.2
భద్రాచలం	42.8	28.5	మహబూబ్‌నగర్	42.0	26.6
హకీంపేట	40.2	26.8	మెదక్	42.3	25.0
దుండిగల్	40.2	27.3	నల్లగొండ	43.0	23.4
హనుమకొండ	41.5	25.0	నిజామాబాద్	43.0	29.9
హైదరాబాద్	40.8	28.4	రామగుండం	42.0	25.6

తెలంగాణ వేడుకలతో సమతాభావం

ఉజ్జయినిలో రాష్ట్ర అవతరణ వేడుకల్లో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్



వేడుకల్లో మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్, ప్రిన్సిపల్ సెక్రటరీ నరహరి

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: మధ్యప్రదేశ్‌లో తెలంగాణ వేడుకల నిర్వహణ ఇరు రాష్ట్రాల పౌరుల మధ్య సమతాభావం పెంపునకు దోహదపడుతుందని మధ్యప్రదేశ్ గవర్నర్ మంగూభాయ్ పటేల్ అన్నారు. శుక్రవారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కీర్తి మందిర్ విక్రమ్ యూనివర్సిటీ క్యాంపస్‌లో జరిగిన వేడుకలకు గవర్నర్ ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాలను ప్రారంభించారు. 'ఏక్ భారత్-శ్రేష్ఠ భారత్'కార్యక్రమం కింద తెలంగాణ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. తెలంగాణ చరిత్రను తెలిపే లఘుచిత్రాన్ని ప్రదర్శించి, రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. పలు తెలుగు సంఘాల ఆధ్వర్యంలో తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే బతుకమ్మ పాటలు, జానపదాలను దాదాపు 1200 మంది కళాకారులు ఉత్సాహంగా ప్రదర్శించారు. అనంతరం ఆ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి, ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసి నరహరి మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని తెలిపారు.

హస్తినలో ఘనంగా 'తెలంగాణ దశాబ్ది వేడుకలు'

21 రోజుల పాటు జరుగనున్న ఉత్సవాలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మంద జగన్నాథం తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి వేడుకలను ప్రారంభించారు. మరో ప్రత్యేక ప్రతినిధి కె.ఎం. సాహ్ని, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఓఎస్డీ సంజయ్ జాజులతో కలిసి తెలంగాణ తల్లి విగ్రహానికి, అమరవీరుల స్తూపానికి, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీలోని ఫ్రాన్స్ ఎంబసీ ప్రతినిధి లారెంట్ ట్రిపోనే విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లోనూ 21రోజుల పాటూ ఘనంగా నిర్వహించనున్నట్లు మంద జగన్నాథం తెలిపారు. అనంతరం అతిథులందరూ కలిసి భవన్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రగతిపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. అదే విధంగా హెల్త్ క్యాంపును, వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను కూడా ప్రారంభించారు.

తెలంగాణ కోసమే తెలంగాణ జర్నలిస్టులు..

తెలంగాణ ఆవిర్భావం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి, తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆపై కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

సింగరేణిలో 'గుర్తింపు' కసరత్తు

ఎన్నికల నిర్వహణపై ఈనెల 13న కార్మిక సంఘాలతో సమావేశం



కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కేంద్ర కార్మిక సంక్షేమ శాఖ సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రక్రియను ప్రారంభించింది. ఇందులో భాగంగా సింగరేణి యాజమాన్యంతో పాటు సంస్థలో రిజిస్టర్ అయిన కార్మిక సంఘాలతో సమావేశాన్ని నిర్వహించనుంది. ఆరు జిల్లాల పరిధిలోని 11 ఏరియాల్లో మొత్తం 24 భూగర్భ గనులు, 18 ఓపెన్ కాస్ట్ గనులు సింగరేణిలో విస్తరించి ఉన్నాయి. ఇందులో మొత్తం 42 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు.

నాలుగేళ్లు పూర్తయినా..

చివరిసారిగా 2017 అక్టోబర్ 5న జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అనుబంధ కార్మిక సంఘమైన తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీజీబీకేఎస్) గెలుపొందింది. దీని కాలపరిమితి 2021 అక్టోబర్‌తో ముగిసింది. అయితే కరోనా కారణంగా అప్పుడు ఎన్నికల గురించి ఆలోచన చేయలేదు. దీంతో 2022 నవంబర్‌లో ఏఐటీయూసీ నేతలు హైకోర్టును ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ చేపట్టిన హైకోర్టు వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని డిసెంబర్ చివరి వారంలో సింగరేణిని ఆదేశించింది. అయితే సింగరేణి లేవనెత్తిన కొన్ని అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం జూన్ 1 నుంచి ఆగస్టు 31లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలంటూ ఈ ఏడాది మార్చి 29న తుది ఆదేశాలు జారీ చేసింది. తెలంగాణ హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తూ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్(హైదరాబాద్) ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈనెల 13న కార్మిక సంఘాలు, యాజమాన్యంతో సమావేశం ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో జరిగే ఈ సమావేశం అనంతరం ఎన్నికల నిర్వహణ తేదీపై స్పష్టత వస్తుందని కార్మిక సంఘాల నేతలు చెపుతున్నారు.

నగర వార్తలు

తెలంగాణ మార్చ్‌లో శేరిలింగంపల్లి నాయకులు



గచ్చిబౌలి: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక మార్చ్ నిర్వహించారు. ఈ మార్చ్‌లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోటింరెడ్డి వినయ్‌రెడ్డితో పాటు పలువురు శేరిలింగంపల్లి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ద ఉత్సవాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉత్సాహంగా నిర్వహించారు.

జిల్లా అభివృద్ధికి సహకరించాలి



సాక్షి,సిటీబ్యూరో: తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం హైదరాబాద్ కలెక్టరేట్‌లో ఘనంగా జరుపుకున్నారు. జిల్లా అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులందరూ రాష్ట్ర అభివృద్ధికి పునరంకితులై అన్ని రంగాల్లో జిల్లాను ముందుకు నడిపేందుకు తమవంతు సహకారాన్ని అందిచాలని అడిషనల్ కలెక్టరు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు సంగీత, సంతోషి, కుమారి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఫార్మాలిటికా



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ఫార్మాలిటికా ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనలో మందుల తయారీ విధానానికి ఉపయోగపడే అన్ని కంపెనీల యంత్రపరికరాలు అందుబాటులో ఉన్నాయి. ల్యాబ్‌లలో ఉపయోగించే కొలతల పరికరాలు, సేఫ్టీ వస్తువులు, యంత్రాల విడిభాగాలు ప్రదర్శనలో కొలువుదీరాయి. ఈ ప్రదర్శన రేపటితో ముగియనుంది.

శరవేగంగా చర్లపల్లి టర్మినల్ అభివృద్ధి

- డిసెంబర్ నాటికి సేవలు అందుబాటులోకి...
- ఆ తరువాత చర్లపల్లి నుంచే రైళ్లరాకపోకలు
- సికింద్రాబాద్ స్టేషన్ నిర్మాణం దృష్ట్యా రైళ్ల నిలిపివేత
- రూ.300 కోట్లతో చేపట్టిన చర్లపల్లి టర్మినల్ విస్తరణ



సాక్షి, సిటీబ్యూరో : చర్లపల్లి రైల్వే టర్మినల్ విస్తరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. డిసెంబర్ నాటికి అన్ని పనులు పూర్తి చేసి వినియోగంలోకి వచ్చేలా పనుల్లో వేగం పెంచారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరభివృద్ధి పనుల దృష్ట్యా ప్రత్యామ్నాయంగా చర్లపల్లి టర్మినల్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు దక్షిణమధ్య రైల్వే ప్రణాళికలను రూపొందించింది. ప్రస్తుతం సికింద్రాబాద్ స్టేషన్‌లో టిక్కెట్ బుకింగ్ కార్యాలయం, ఆర్పీఎఫ్ కేంద్రం, భారీ నీటి ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. ఉత్తర దక్షిణాల్లో టవర్‌లు, పార్కింగ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరో 6 నెలల్లో స్టేషన్ పునరభివృద్ధి పనులు మరింత వేగం పుంజుకోనున్నాయి. దీంతో వచ్చే జనవరి తరువాత ఏ క్షణంలోనైనా సరే సికింద్రాబాద్ నుంచి రైళ్ల రాకపోకలను నిలిపివేసి చర్లపల్లి మీదుగా నడిపేందుకు వీలుగా చర్లపల్లి స్టేషన్ విస్తరణ కొనసాగిస్తున్నారు. విజయవాడ, కాజీపేట్ వైపు నుంచి వచ్చే అన్ని రైళ్లను చర్లపల్లి నుంచి నడిపేందుకు అవకాశం ఉంటుంది. సికింద్రాబాద్ రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టు పూర్తయ్యే వరకు ముంబయి వైపు నుంచి వచ్చే రైళ్లను లింగంపల్లి మీదుగా మళ్లించనున్నారు.

నాలుగో టర్మినల్...

సికింద్రాబాద్ స్టేషన్ రీడెవలప్‌మెంట్ కంటే ముందే చర్లపల్లి విస్తరణ పనులను మూడేళ్ల క్రితం సుమారు రూ.300 కోట్లతో ప్రారంభించారు. నగరంలో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ తరువాత నాలుగో టర్మినల్‌గా చర్లపల్లి వినియోగంలోకి రానుంది. ముఖ్యంగా సికింద్రాబాద్‌పైన పెరిగిన ఒత్తిడిని దృష్టిలో ఉంచుకొని చర్లపల్లి విస్తరణ చేపట్టారు. మొదట్లో సుమారు వంద ఎకరాల్లో విస్తరించాలని ప్రతిపాదించినా ప్రభుత్వం నుంచి భూమి లభించకపోవడంతో రైల్వేకు అందుబాటులో ఉన్న స్థలంలోనే స్టేషన్ విస్తరణ ప్రారంభించారు. రెండు ప్లాట్‌ఫాంలను 5 ప్లాట్‌ఫాంలకు పెంచారు. అలాగే మరో రెండు పిట్‌లైన్‌లను అదనంగా నిర్మించారు. కనీసం 50 రైళ్ల రాకపోకలు సాగించేందుకు వీలుగా విస్తరణ జరిగింది. చర్లపల్లి పనులు ప్రస్తుతం తుదిదశకు చేరుకున్నాయి. అప్రోచ్ రోడ్లు, ఇతర మౌలికసదుపాయాలకు సంబంధించిన పనులు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. ప్రయాణికులు ఔటర్ మీదుగా చర్లపల్లికి చేరుకొనేందుకు వెసులుబాటు ఉంటుంది. అలాగే చర్లపల్లి నుంచి మల్కాజిగిరి మీదుగా నగరంలోకి వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించవచ్చు. చర్లపల్లి స్టేషన్ అభివృద్ధికి కేంద్రం ఈ ఏడాది మరో రూ.82 కోట్లను విడుదల చేసింది. దీంతో పనులు వేగంగా జరుగుతున్నట్లు అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్ నుంచి రోజుకు 150 రైళ్లు...

దక్షిణమధ్య రైల్వేలోనే ప్రధాన స్టేషన్ అయిన సికింద్రాబాద్ నుంచి ప్రతి రోజు సుమారు 150 రైళ్లు నడుస్తాయి.వీటిలో 80 కి పైగా ఎక్స్‌ప్రెస్ రైళ్లు, మిగతావి ఎంఎంటీఎస్, సబర్బన్ రైళ్లు.ప్రతి రోజు 1.85 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తారు. సికింద్రాబాద్‌లో 10 ప్లాట్‌ఫామ్‌లు ఉన్నప్పటికీ రైళ్లు నిలిపేందుకు అవకాశం లేక దూరంగా ఎక్కడో ఒక చోట ఆపాల్సి వస్తుంది.స్టేషన్ రీడెవలప్‌మెంట్ దృష్ట్యా భవిష్యత్‌లో సికింద్రాబాద్ నుంచి రైళ్లను రద్దుచేస్తే ఆ ఒత్తిడిని చర్లపల్లి టర్మినల్ ఏ మేరకు తట్టుకోగలదనేది సందేహమే. అన్ని రైళ్లను చర్లపల్లి నుంచే మళ్లించకుండా నాంపల్లి, కాచిగూడ,లింగంపల్లి స్టేషన్‌లలో కూడా రైళ్ల నిర్వహణను గరిష్ఠ స్థాయికి పెంచాలని అధికారులు భావిస్తున్నారు.

వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం తెలంగాణ



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న బెన్‌హర్ మహేష్ దత్ ఎక్కా

సాక్షి, సిటీబ్యూరో: డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి (ఎంసీఆర్ హెచ్ఆర్డీ) ఇన్‌స్టిట్యూట్‌లో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన డైరెక్టర్ బెన్‌హర్ మహేష్ దత్ ఎక్కా సిబ్బంది, అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు. 13.9 శాతం వృద్ధి రేటు సాధించిన తెలంగాణ దేశంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా మారిందని ఆయన అన్నారు. 19 వేల ఎకరాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న హైదరాబాద్ ఫార్మా సిటీ దేశంలోనే తొలిదని, వినూత్న ఒరవడికి ఇది శ్రీకారమని పేర్కొన్నారు.



గన్‌పార్కు వద్ద అమర వీరులకు నివాళులర్పిస్తున్న నగర బీఆర్ఎస్ నాయకులు

'సంస్కృతీ సంప్రదాయాలకు పెద్దపీట'



పురస్కార గ్రహీతలతో ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి

నాంపల్లి: తెలుగు సంస్కృతి సంప్రదాయాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి అన్నారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నాంపల్లిలోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఎన్టీఆర్ కళా మందిరంలో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని విభిన్న రంగాల్లోని ప్రతిభా వంతులైన 20 మందికి తెలుగు కీర్తి పురస్కారాలను అందించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విభిన్న రంగాలకు చెందిన వ్యక్తులను సత్కరించడం అభినందనీయమని అన్నారు. తెలుగు సంస్కృతికి, కళాకారులకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సాహిత్య అకామి చైర్మన్ జూలూరి గౌరీ శంకర్ మాట్లాడుతూ... దశాబ్ది తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. కవులు, కళాకారులను కూడా ప్రభుత్వ పరంగా సత్కరిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ జనువాడ రామస్వామి, డాక్టర్ పిట్టా జాకబ్‌లకు ప్రతిష్టాత్మక తెలంగాణ ఆణిముత్యం పురస్కారాలు, మరో 20 మంది ప్రముఖులకు తెలుగు కీర్తి పురస్కారాలు అందించడం అభినందనీయమని తెలిపారు. పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ పూర్వ అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్, అమెరికాకు చెందిన గ్లోబల్ క్రియేటివ్ ఆర్ట్స్ అకాడమీ చైర్‌పర్సన్ సీత మాడభూషి, డాక్టర్ జల్లి విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

4న జరిగే ర్యాలీకి హాజరు కావొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

పంజగుట్ట: ఈ నెల 4వ తేదీన లింగాయత్‌లు నిర్వహిస్తున్న ర్యాలీకి వీరశైవ లింగాయత్ లింగ బలిజలు ఎవరూ హాజరు కారాదని రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ ముస్తాఫర్ పిలుపునిచ్చారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సమితి మహిళా అధ్యక్షురాలు రుద్రమదేవి, యువజన అధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్ తదితరులు మాట్లాడారు. రాష్ట్రంలో వీరశైవ లింగాయత్‌లు 95 శాతం ఉంటే లింగాయత్‌లు మూడు నుండి 5 శాతం ఉన్నారని వారు అందరం ఒక్కటే అని వీరశైవ లింగాయత్‌లను కలుపుకుపోయి మనది ప్రత్యేక ధర్మం అంటూ, మైనార్టీల్లో కలపాలని ర్యాలీ తీస్తున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. తెలంగాణ లింగాయత్‌లు ఈ ర్యాలీకి ఎవ్వరూ రావడంలేదని కర్నాటక, మహారాష్ట్ర నుండి వచ్చి ఇక్కడి లింగాయత్‌లను, వీరశైవ లింగాయత్‌లను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు.

స్టార్టప్‌ల విజయగాథలపై జాతీయ స్థాయి వెబినార్

రాయదుర్గం: స్టార్టప్‌ల విజయగాథలపై జాతీయ స్థాయి వెబినార్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు స్టార్టప్‌ల ఏర్పాటుపై దృష్టి సారించాలన్నారు. స్టార్టప్‌లు ప్రజా సమస్యలు పరిష్కరించేలా ఉండాలన్నారు. ప్రస్తుతం ప్రతి విద్యాసంస్థ కూడా తమ ప్రాంగణంలో కూడా స్టార్టప్‌ల ఏర్పాటు చేసే వారిని ప్రోత్సహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారన్నారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. కార్యక్రమంలో స్టార్టప్ లైఫ్ స్టైల్ హబ్ వ్యవస్థాపకుడు అర్జున్ పంచాల్, టాయ్ ట్రంక్ ప్రైవేట్ లిమిటెడ సీఈఓ అజయ్ వైద్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ
శనివారం
3-6-2023







లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకు ఆసక్తి

- నగరంలో 2023 క్యూ1లో 14,280 ఇళ్ల విక్రయం
- ఇందులో 46% వాటా నూతన గృహాలదే
- అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడి

కొత్త గృహాలే కావాలంటున్నారు!



సాక్షి, హైదరాబాద్: గృహ కొనుగోలుదారుల అభిరుచిలో మార్పులు వచ్చాయి. గతంలో గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ఇళ్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపించిన కస్టమర్లు.. క్రమంగా లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో కొనేందుకు మొగ్గుచూపిస్తున్నారు. దీంతో ఈ ఏడాది తొలి త్రైమాసికం (క్యూ1)లో హైదరాబాద్‌లో విక్రయమైన ఇళ్లలో లాంచింగ్ యూనిట్ల వాటానే ఎక్కువగా ఉంది. దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో కొత్త గృహాల విక్రయాలలో హైదరాబాద్ తొలి స్థానంలో నిలిచిందని అనరాక్ గ్రూప్ నివేదిక వెల్లడించింది.

- 2023 క్యూ1లో నగరంలో 14,280 ఇళ్లు విక్రయం కాగా.. ఇందులో 46 శాతం గృహాలు కొత్తవే. మిగిలిన యూనిట్లు 2023 క్యూ1 కంటే ముందు ప్రారంభమైనవి. అదే 2019 క్యూ1లో 5,400 యూనిట్లు విక్రయం కాగా.. కొత్త ఇళ్ల వాటా కేవలం 28 శాతమే. గృహాల సరఫరా పెరగడం, బ్రాండెడ్ నిర్మాణ సంస్థలపై విశ్వాసం, కొనుగోలుదారుల అభిరుచి మేరకు ఆధునిక వసతులు ఉండటం, పెట్టుబడిదారుల కార్యకలాపాలు ఊపందుకోవటం తదితర కారణాలతో లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో గృహాలకు డిమాండ్ పెరిగిందని అనరాక్ గ్రూప్ ఛైర్మన్ అనూజ్ పూరి తెలిపారు.
- దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో ఈ ఏడాది క్యూ1లో 1.14 లక్షల గృహాలు అమ్ముడుపోగా.. ఇందులో 41 శాతం కొత్త ఇళ్లే. గతేడాది క్యూ1లో 99,550 యూనిట్లు సేల్ కాగా.. ఇందులో కొత్త గృహాల వాటా 36 శాతమని తెలిపింది. అలాగే 2019 క్యూ1లో 78,520 యూనిట్లు అమ్ముడుపోగా.. కొత్త ఇళ్ల వాటా కేవలం 26 శాతం.

నగరాల వారీగా విక్రయాలలో కొత్త గృహాల వాటా

నగరం	గృహ విక్రయాలు	కొత్త ఇళ్ల వాటా(%లో)
ఎన్‌సీఆర్	17,160	30
ఎంఎంఆర్	34,690	40
బెంగళూరు	15,660	43
పుణే	19,920	45
హైదరాబాద్	14,280	46
చెన్నై	5,880	41
కోల్‌కతా	6,190	38

- ఏడు నగరాలలో 2023 క్యూ1లో 1.14 లక్షల యూనిట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో బ్రాండెడ్, నాన్-బ్రాండెడ్ డెవలపర్ల వాటా 59:41 నిష్పత్తిగా ఉంది. ఇదే 2015లో వీటి నిష్పత్తి 41:59గా ఉండేది. నూతన గృహాల కొనుగోళ్లలో హైదరాబాద్ తొలిస్థానంలో నిలవగా.. ఎన్‌సీఆర్ చివరి స్థానంలో నిలిచింది. ఎన్‌సీఆర్‌లో 2023 క్యూ1లో 17,160 విక్రయం కాగా.. ఇందులో 30 శాతం వాటా కొత్త యూనిట్లవి.
- దేశంలోని చాలా నగరాలలో ఏళ్ల కొద్దీ నిర్మాణాలు సాగుతుండటం, గడువులోగా ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడంలో విఫలమవుతుండటంతో కొనుగోలుదారులు గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్న ప్రాజెక్ట్‌లలో కొనుగోళ్లకే మొగ్గు చూపించేవారు. కానీ, ప్రస్తుతం ట్రెండ్ మారుతుంది. లాంచింగ్ ప్రాజెక్ట్‌లలో విక్రయాలకు పెరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణాలు.. బ్రాండెడ్ నిర్మాణ సంస్థల నుంచి గృహాల సరఫరా పెరగడం, పెట్టుబడిదారులు నివాస సముదాయ మార్కెట్‌లోకి పునఃప్రవేశించడమేనని నివేదిక వెల్లడించింది. ఆయా ప్రాజెక్ట్‌ల డెవలపర్లు రెరా నిబంధనలను పాటిస్తూ గడువులోగా ప్రాజెక్ట్‌లను పూర్తి చేస్తున్నారు కాబట్టే వీటిల్లో కొనుగోళ్లకు కస్టమర్లు ఆసక్తిని కనబరుస్తున్నారు.

3 కోట్లకు పైగా ఇళ్ల కొరత



సాక్షి, హైదరాబాద్: మన దేశంలో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలు ఎక్కువ కావటంతో అందుబాటులో గృహాలకు నేటికీ డిమాండ్ ఉందని ఓ ఆన్‌లైన్ పోర్టల్ నిర్వహించిన సర్వే వెల్లడించింది. దేశంలో సుమారు 3 కోట్లకు పైగా ఇళ్ల కొరత ఉందని తెలిపింది. దీంతో బడా డెవలపర్లు సైతం అఫర్డబుల్ గృహ నిర్మాణాల వైపు దృష్టిసారించారని పేర్కొంది. ప్రవాస భారతీయులు, ఐటీ ఉద్యోగుల కొనుగోళ్లు ఆశించిన స్థాయిలో లేకపోవటంతో బడా నిర్మాణ సంస్థలు తక్కువ విస్తీర్ణ ఇళ్లకు, స్థానిక కొనుగోలుదారులకు అందుబాటులో ఉండే ఇళ్ల నిర్మాణాలకు మొగ్గు చూపిస్తున్నాయని వివరించింది. అందుబాటు ధర, నిర్మాణంలో నాణ్యత ఉంటే చాలు ఈ తరహా గృహాల మార్కెట్‌కు డిమాండ్ ఎల్లవేళలా ఉంటుంది. ఇతర మెట్రో నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో భూముల ధరలు తక్కువగా ఉండటంతో నగరంలో అఫర్డబుల్ నిర్మాణాలు చేపట్టేవారి సంఖ్య ఎక్కువగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఆతిథ్యం అధరహో!



- ఈ ఏడాది కొత్తగా 12 వేల హోటల్ గదులు
- సీబీఆర్ఈ దక్షిణాసియా నివేదిక వెల్లడి

సాక్షి, హైదరాబాద్: కరోనా మహమ్మారితో పీకల్లోతు కష్టాల్లోకి వెళ్లిపోయిన ఆతిథ్య రంగం క్రమంగా పుంజుకుంటుంది. ఈ ఏడాది దేశంలో హాస్పిటాలిటీ విభాగం పూర్వవైభవం సంతరించుకుంటుందని సీబీఆర్ఈ దక్షిణాసియా నివేదిక తెలిపింది. కరోనా వ్యాక్సినేషన్ డ్రైవ్ విజయవంతం కావటం, ప్రయాణ ఆంక్షలు తొలగిపోవటం, స్థిరమైన ఆర్థికాభివృద్ధి వంటి కారణాలతో ఆతిథ్య రంగం పుంజుకుంటుందని వెల్లడించింది. ఈ ఏడాది దేశంలో కొత్తగా 12 వేల హోటల్ గదులు అందుబాటులోకి వస్తాయని తెలిపింది. వచ్చే 2-5 ఏళ్లలో దేశీయ హాస్పిటాలిటీ రంగంలోకి 2.3 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేసింది. 2021లో దేశీయ సందర్శకులు 151 బిలియన్ డాలర్లను వెచ్చించారని, అంతకుక్రితం ఏడాదితో పోలిస్తే ఇది చాలా ఎక్కువ. హైస్పీడ్ రైళ్ల ప్రారంభం, వందే భారత్ ఎక్స్‌ప్రెస్ వంటి మౌలిక సదుపాయాల కార్యక్రమాలు దేశీయ పర్యాటక రంగానికి ఊతమిచ్చాయని, దీంతో సందర్శకుల సంఖ్య మరింత పెరుగుతుందని నివేదిక అభిప్రాయపడింది.





క్లుప్తంగా...

లోక్‌సభతో పాటే అసెంబ్లీ ఎన్నికలు: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభతో పాటే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని తాను భావిస్తున్నానని నల్లగొండ ఎంపీ కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. మోదీ చరిష్మాతోనే మళ్లీ ఎన్నికలను ఎదుర్కోవాలని బీజేపీ భావిస్తోందని, అందుకే లోక్‌సభతో పాటు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరపడం ద్వారా లబ్ధి పొందాలి అనుకుంటోందని వ్యాఖ్యానించారు. రెండు ఎన్నికలు ఒకేసారి జరిగితే కాంగ్రెస్ పార్టీకే లాభం జరుగుతుందని చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టి మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ ఊపు తగ్గుతోందన్నారు. మద్యం కుంభకోణంలో శరత్‌చంద్రారెడ్డి అప్రూవర్‌గా మారితే కేసు సీరియస్ టర్న్ తీసుకుని, ఆమ్ ఆద్మీ పార్టీకి చావుదెబ్బ తగులుతుందన్నారు.

వనరులున్నా నిరుద్యోగమెందుకు?

సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణ



సాక్షి, హైదరాబాద్: ప్రత్యేక తెలంగాణలో అన్ని వనరులున్నా.. నిరుద్యోగులు ఎందుకు అలమటిస్తున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ డిమాండ్ చేశారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మఖ్దూం భవన్‌లో నారాయణ జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. దళితబంధులో ఇస్తున్న రూ.10 లక్షల్లో రూ.మూడు, నాలుగు లక్షలు మాత్రమే లబ్ధిదారులకు దక్కుతున్నాయ ని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్త సచివాలయం ప్రారంభానికి తనను కూడా ఆహ్వానించలేదని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ వ్యాఖ్యానించడంలో అర్థం లేదన్నారు.

అవినీతి పాలనకు త్వరలో ముగింపు: పొంగులేటి



ఖమ్మం మయూరి సెంటర్: తొమ్మిదేళ్ల అవినీతి పాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని, కష్టపడి సాధించుకున్న తెలంగాణలో సుపరిపాలన కోసం అందరం కలిసి మంచి నిర్ణయం తీసుకునే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. ఎందరో బలిదానాలు, సబ్బండ వర్గాల కృషితో సాధించుకున్న రాష్ట్రంలో ప్రజల కలలను కల్వకుంట్ల కుటుంబం కల్లలుగా మార్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు తెలంగాణ ఉద్యమకారులను సన్మానించారు.

'తెలంగాణ' ఏర్పాటులో టీడీపీది కీలకపాత్ర: కాసాని



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సరికొత్త చరిత్ర అని, అందులో తెలుగుదేశం పార్టీ పోషించిన పాత్ర కీలకమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. టీటీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ జెండాను ఆవిష్కరించిన కాసాని మీడియాతో మాట్లాడుతూ..తెలంగాణకు అనుకూలంగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు లేఖ ఇవ్వడం వల్లనే కొత్త రాష్ట్రం కల నెరవేరిందన్నారు.

తెలుగు మహిళ నూతన కార్యవర్గం

సాక్షి, హైదరాబాద్: టీటీడీపీ అనుబంధ సంస్థ తెలుగు మహిళ విభాగం నూతన రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. తెలుగు మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా ఇప్పటికే భవనం షకీలా రెడ్డిని నియమించగా, 36 మందితో పూర్తి స్థాయి కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తూ టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉపాధ్యక్షులుగా ఏడుగురు మహిళా నాయకురాళ్లను నియమించారు. ప్రధాన కార్యదర్శులుగా 8 మందిని, అధికార ప్రతినిధులుగా ఆరుగురికి అవకాశం లభించింది.

బీజేపీ తెరలను తొలగించుకోండి

గవర్నర్ వ్యాఖ్యలపై రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ తన కళ్లకున్న బీజేపీ తెరలను తొలగించుకుంటే తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కనిపిస్తుందని తెలంగాణ పునరుత్పాదక శక్తి అభివృద్ధి సంస్థ (రెడ్కో) చైర్మన్ వై.సతీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి తోడ్పాటును అందించాల్సిన రాష్ట్ర గవర్నర్ ఓ వైపు పురోగతికి అడ్డు తగులుతూ మరోవైపు అభివృద్ధి జరగడం లేదని ప్రతిపక్ష నేత తరహాలో మాట్లాడటం సిగ్గుచేటన్నారు.

కొందరి అభివృద్ధి కాదు..

అందరి అభివృద్ధి కావాలి

- గవర్నర్ తమిళిసై సౌందరరాజన్
- అప్పుడే స్వరాష్ట్ర సాధకత పరిపూర్ణత
- నేను ప్రజలతో ఉన్నాను.. ప్రజలు నాతో ఉన్నారు
- 1969 ఉద్యమకారులకు సత్కారం
- రాజ్‌భవన్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలు



రాజ్‌భవన్‌లో జరిగిన రాష్ట్రావతరణ వేడుకల్లో కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళి సై

సాక్షి, హైదరాబాద్: కేవలం కొంత మంది అభివృద్ధి కాకుండా, రాష్ట్రం మొత్తం జరిగితేనే అది నిజమైన అభివృద్ధి అనిపించుకుంటుందని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ అన్నారు. అప్పుడే తెలంగాణ ఉద్యమానికి సంపూర్ణ సార్థకత సమకూరుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర అభివృద్ధిలో ఇక్కడివారితో పాటు అంతర్జాతీయంగా ఉన్న తెలంగాణ వాసులంతా ఉద్యమ స్ఫూర్తితో మరింత చురుకైన పాత్ర పోషించాలని.. అంతా కలసి సరికొత్త తెలంగాణకు శ్రీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. శుక్రవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను రాజ్‌భవన్‌లో ఘనంగా నిర్వహించారు. 1969లో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న 30 మందిని ఈ కార్యక్రమానికి ప్రత్యేకంగా ఆహ్వానించారు. వారందరినీ గవర్నర్ తమిళిసై శాలువాతో సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరికీ రాష్ట్ర ఆవిర్భావ శుభాకాంక్షలంటూ.. తెలుగులో ప్రసంగం ప్రారంభించిన గవర్నర్, ప్రసంగం ఆ సాంతం తెలుగులోనే కొనసాగించారు. 'తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రపంచంలోని తెలంగాణ వాసులందరికీ శుభాకాంక్షలు. జై తెలంగాణ అన్నది కేవలం ఒక నినాదం కాదు. ఆత్మగౌరవ నినాదం. నా జీవితంలో ప్రతి క్షణం ప్రజాసేవకే అంకితం. నేను తెలంగాణ ప్రజలతో ఉన్నాను. తెలంగాణ ప్రజలు నాతో ఉన్నారు. రాష్ట్ర అభివృద్ధిలో నా పాత్ర కచ్చితంగా ఉంటుంది. దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుదాం. తెలంగాణ సాధనలో 1969 ఉద్యమంలో పాల్గొన్న 30 మంది పోరాట యోధులను ఈ సందర్భంగా సత్కరించుకోవడం సంతోషంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అనేక రంగాల్లో ఈ పదేండ్లలో తెలంగాణ తన ప్రత్యేకతను చాటుకుంది. హైదరాబాద్ అంతర్జాతీయ నగరంగా పేరు సాధించింది. అయితే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి అంటే హైదరాబాద్‌తోపాటు తెలంగాణలోని మారుమూల పల్లెలకు అభివృద్ధి ఫలాలు చెందాలి' అని గవర్నర్ ఆకాంక్షించారు.

కేక్ కట్ చేసిన గవర్నర్..

శుక్రవారం గవర్నర్ పుట్టినరోజు కూడా అయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఆమె తెలంగాణ తొలి దశ ఉద్యమకారుల దగ్గరకు స్వయంగా వెళ్లి కేక్ తినిపించారు. 'రాష్ట్రాల అవతరణ దినోత్సవాలను అన్ని రాష్ట్రాల రాజ్‌భవన్‌లలో చేయాలని ప్రధాని మోదీ సూచించడం ఎంతో సంతోషించే అంశం. శుక్రవారం సాయంత్రం పుదుచ్చేరి రాజ్‌భవన్‌లో నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొంటున్నా'అని అన్నారు. గవర్నర్ వ్యవస్థ అలంకారప్రాయమైనదని, దాన్ని రద్దు చేయాలని ఇటీవల కేసీఆర్.. కేజ్రీవాల్, భగవంత్‌సింగ్‌మాన్‌లతో కలసి చేసిన వ్యాఖ్యలపై విలేకరులు ప్రశ్నించగా..గవర్నర్ అలంకారప్రాయమన్న వ్యాఖ్యలకు ఈ రోజు రాజ్‌భవన్‌లో జరుగుతున్న వేడుకలే సమాధానమన్నారు. అవతరణ వేడుకలకు ప్రభుత్వం నుంచి తనకు ఆహ్వానం అందిందా..లేదా అన్నది సమస్య కాదని, దానిపై తాను వ్యాఖ్యానించదలచుకోలేదన్నారు. తానెప్పుడూ ప్రజలతోనే ఉన్నానని, వారు కూడా తనతో ఉన్నారని మరోమారు స్పష్టం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గవర్నర్ తమిళిసై చిన్నారులతో కలసి ఉత్సాహంగా కాసేపు కాలు కదిపారు. అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.



అమరవీరుల కుటుంబాలను సన్మానించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి. చిత్రంలో చింతల రామచంద్రారెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి

అమరుల కుటుంబాల భావోద్వేగం

- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సమక్షంలో.. గోల్కొండ కోటలో కంటనీరు పెట్టించిన సన్నివేశాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అమరవీరుల కుటుంబసభ్యుల భావోద్వేగాలతో గోల్కొండ కోటలో శుక్రవారం ఒక్కసారిగా వాతావరణం ఉద్విగ్నంగా మారింది. 'తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం'సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన అధికారిక కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి జాతీయజెండా ఎగురవేశాక సీఆర్‌పీఎఫ్ పోలీస్ బ్యాండ్, సైనిక బలగాల వందనాన్ని స్వీక రించారు. ఆ తర్వాత పక్కనే ఏర్పాటు చేసిన వేదికపైకి అమరుల కుటుంబాల సభ్యులు, దగ్గరి బంధువులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో అమరుల ప్రస్తావన వచ్చినపుడు వారి కుటుంబసభ్యులు భావోద్వేగానికి గురై కంటతడిపెట్టారు. దీంతో కిషన్‌రెడ్డి వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. తెలంగాణ సాధన ఉద్యమం సందర్భంగా ప్రత్యేక రాష్ట్రం ఏర్పడదేమోనన్న బెంగతో ఆత్మహత్యలకు పాల్పడిన వారి కుటుంబ సభ్యులను శాలువా, జ్ఞాపికలను అందించారు. మందడి యాదిరెడ్డి మాతృమూర్తి చంద్రమ్మ, వేణుగోపాల్‌రెడ్డి తల్లి లక్ష్మమ్మ పలుమార్లు కంటనీరు పెట్టుకున్నారు. సిరిపురం యాదయ్య సోదరుడు మహేశ్, దయాకర్‌రెడ్డి బంధువు రామిరెడ్డిలను ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీఎమ్మెల్యే నల్లు ఇంద్రసేనారెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, మర్రిశశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకరరెడ్డిలతో కలిసి కిషన్‌రెడ్డి సన్మానించారు. గోల్కొండ కోటలో ఏర్పాటు చేసిన ఫొటో, పెయింటింగ్‌ల ప్రదర్శనను కిషన్‌రెడ్డి ప్రారంభించారు.

కలకలం సృష్టించిన వ్యక్తి...

కిషన్‌రెడ్డి వేదికపైకి రాగానే ఓ వ్యక్తి ఆయన వద్దకు వచ్చి చేతులెత్తి పెద్దగా అరుస్తూ ఏదో చెప్పేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడిని అక్కడి నుంచి పక్కకు తీసుకెళ్లారు. కాగా, తన పేరు మహ్మద్ ఇలియాస్ అని, గోల్కొండకు సమీపంలో ఏర్పాటుచేసిన గోల్ఫ్‌కోర్స్‌లో ఎస్సీ, బీసీలకు సంబంధించిన 52 ఎకరాల భూమి పోతోందని, అందులో తనభూమి కూడా ఉందని, ఈ విషయమై ఇప్పటికే తాను కేంద్రమంత్రికి వాట్సాప్ ద్వారా విజ్ఞప్తి చేసినట్టు తెలియజేశాడు. ఇప్పుడు కిషన్‌రెడ్డిని స్వయంగా కలిసి వినతిపత్రం సమర్పించే ప్రయత్నం చేసినట్టు తెలిపాడు.

నేటి నుంచి బీజేపీ 'కౌంటర్'

- 21 రోజుల పాటు జరిగే దశాబ్ది ఉత్సవాలకు 'రివర్స్ గేర్' పేరిట నిరసనలు
- ప్రభుత్వ పాలనా వైఫల్యాలపై అంశాల వారీగా కార్యక్రమాలు
- దరువు ఎల్లన్న, పుల్లారావులకు బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలకు వ్యతిరేకంగా పలు కార్యక్రమాలు (కౌంటర్ ప్రోగ్రామ్స్) నిర్వహించేందుకు బీజేపీ సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం 21 రోజుల పాటు నిర్వహిస్తున్న వివిధ అధికారిక కార్యక్రమాలపై శాఖలు, విభాగాల వారీగా వ్యతిరేక ప్రచారం (నెగటివ్ క్యాంపెయిన్) చేపట్టాలని, నిరసనలతో కేసీఆర్ సర్కార్ తీరును ప్రజల్లో ఎండగట్టాలని (రివర్స్ గేర్) నిర్ణయించింది. శుక్రవారం పార్టీ కార్యాలయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అధ్యక్షతన జరిగిన పార్టీ నేతల సమావేశంలో ఆయా విభాగాల వారీగా చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా సంజయ్ మాట్లాడుతూ ప్రతీరోజు ఆయా రంగాల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపడంతో పాటు ప్రజల ఇబ్బందులను ఎండగట్టేలా వివిధ రూపాల్లో, వినూత్న రీతిలో కార్యక్రమాలు రూపొందించినట్లు తెలిపారు. శనివారం ప్రభుత్వం రైతు దినోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో.. కేసీఆర్ పాలనలో వ్యవసాయ రంగం ఏవిధంగా దెబ్బతిందో, రైతులకిచ్చిన హామీలను అమలు చేయడంలో ఎలా విఫలమైందో ప్రజలకు వివరించనున్నారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్రంలోని పార్టీ సీనియర్ నేతలందరినీ భాగస్వాములను చేయనున్నారు.

ఏ రోజు ఏ అంశంపై..

ఈ నెల 3న రైతు వ్యతిరేక విధానాలపై, 4న పోలీస్ వ్యవస్థను కేసీఆర్ కుటుంబం సొంత ప్రయోజనాలకు వాడుకుంటున్న విధానంపై, 5న విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై పడుతున్న భారం, విద్యుత్ సంస్థలు దివాలా తీయడంపై నిరసన కార్యక్రమాలుంటాయి. అలాగే 6న కేసీఆర్ పాలనలో పారిశ్రామిక రంగం సంక్షోభం, 7న, సాగునీటి ప్రాజెక్టుల్లో దోపిడీపై, 8న చెరువుల కబ్జాలపై, 9న సంక్షేమ రంగం ప్రమాదంలో పడటంపై, 10న పెచ్చరిల్లిన అవినీతిపై, 11న తెలంగాణలో కవులు, కళాకారులతో పాటు సాహిత్యకారులకు జరుగుతున్న అన్యాయంపై ప్రచారోద్యమం ఉంటుంది. 12న 'తెలంగాణ రన్'కు వ్యతిరేకంగా యువ, మహిళా మోర్చా ఆధ్వర్యంలో 'రివర్స్ రన్'ఉంటుంది. 13న మహిళలకు అన్యాయంపై, 14న కుంటుపడ్డ వైద్యం-ప్రజల తిప్పలు, 15, 16 తేదీల్లో స్థానిక సంస్థల నిర్వీర్యం, ప్రజాప్రతినిధుల బాధలపై, 17న గిరిజన హామీలు, పోడుభూములు, ఏజెన్సీల్లో ప్రజల ఇబ్బందులపై, 18న మంచినీటి సమస్యపై (ఖాళీ బిందెలతో నిరసన), 19న హరిత హారానికి కేంద్రం ఇచ్చిన నిధుల దుర్వినియోగంపై, 20న విద్యా వ్యవస్థ దుర్గతిపై, 21న దేవాలయ భూముల కబ్జా, హిందువులపై జరుగుతున్న దాడులపై, 22న తెలంగాణ అమర వీరుల కుటుంబాలతో పాటు ఉద్యమకారులకు జరుగుతున్న అన్యాయంపై వినూత్న కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్లు పార్టీ నేతలు తెలిపారు. ఆ బాధ్యతలను దరువు ఎల్లన్న, పుల్లారావులకు అప్పగించారు.

పదేళ్లవుతున్నా పేదల బతుకులు మారలేదు

టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: 'రాజకీయంగా భూస్థాపితం అవుతామని తెలిసినా కాంగ్రెస్ పార్టీ తెలంగాణను ఏర్పాటు చేసింది. స్వరాష్ట్రం ఏర్పడి పదేళ్లవుతున్నా పేదల బతుకులు మారలేదు. దొరల గడీలు మాత్రం కొత్త రంగులు వేసుకుంటున్నాయి'అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గాంధీ భవన్‌లో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాగానే కాంగ్రెస్ పార్టీలో తన పార్టీని విలీనం చేస్తానన్న కేసీఆర్ మాట తప్పారని విమర్శించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటికో ఉద్యోగం, ముస్లింలు, కోటి ఎకరాలకు సాగునీరు లాంటి హామీలిచ్చి మోసగించారని మండిపడ్డారు. ఢిల్లీ మద్యం కుంభకోణంలో ఎమ్మెల్సీ కవిత పాత్ర ఉన్నా ఆమెను అరెస్టు చేయకపోవడం బీజేపీ, బీఆర్‌ఎస్‌లు ఒక్కటేననేందుకు నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామని, గిట్టుబాటు ధరలకు పంటలు కొంటామని, 2 లక్షల ఉద్యోగాలిస్తామని, ఉద్యోగాలిచ్చే వరకు నెలకు రూ. 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని వెల్లడించారు. అమెరికాలో ఉన్న టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి న్యూజెర్సీలో జరిగిన రాష్ట్ర అవతరణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ వీహెచ్, పొన్నం ప్రభాకర్, గద్దర్, సీనియర్లు చిన్నారెడ్డి, నిరంజన్, అంజన్‌కుమార్ యాదవ్, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వచ్చాక ఏమున్నది గర్వకారణం

▶ మొదటి పేజీ తరువాయి

అప్పులు అభివృద్ధి, సంక్షేమానికి ఖర్చు చేయాల్సింది పోయి వేల రూ.కోట్ల అవినీతి చేస్తున్నరు. ఈ అప్పుల కోసమా మనం తెలంగాణ తెచ్చుకున్నది?'అని ప్రశ్నించారు. శుక్రవారం గోల్కొండ ఖిల్లాలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాల్లో భాగంగా కిషన్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక ఏమున్నది గర్వకారణం.. అన్ని రంగాల్లో అవినీతి, అహంకారం, నియంతృత్వం, దుర్మార్గం, కుటుంబ పాలన రాజ్యమేలుతోంది అని వ్యాఖ్యానించారు.

మాఫియాలు రాజ్యమేలుతున్నాయి...

ఉద్యోగాల పేరుతో టీఎస్పీఎస్సీ పేపర్‌లీకేజీ, దళిత బంధు దోపిడీ మాఫియా, కాంట్రాక్టర్ల మాఫియా, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియా, ధరణితో భూముల మాఫియా, గొర్రెల పంపిణీలో మాఫియా, డబుల్ బెడ్ రూమ్‌ఇండ్లలో మాఫియా, బొగ్గు గనుల కేటాయింపులో మాఫియా, పెద్ద నగరాలలో ఇండ్ల నిర్మాణానికి పర్మిషన్లలో కూడా మాఫియా, చెరువుల భూముల ఆక్రమణలో మాఫియా.. ఇలా అన్ని రంగాల్లోనూ మాఫియాలు రాజ్యమేలుతున్నాయని కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తాను రాజకీయాల కోసం ఈ వ్యాఖ్యలు చేయడం లేదన్న కిషన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల హృదయాల్లో వ్యక్తమైన భావాలు, ఆవేదనలు, జనంలో రగులుతున్న ఆలోచనలు, మాటలనే తాను వ్యక్తీకరిస్తున్నానని చెప్పారు. ఒక కుటుంబం, ఒక వ్యక్తి, ఒక పార్టీతోనే తెలంగాణ రాలేదని, యావత్ తెలంగాణ ప్రజల సంఘటిత పోరాటంతోనే రాష్ట్రం ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రజలు, ఉద్యమ ఆకాంక్షలకు అనుగుణంగా ఇక్కడ మంచి ప్రభుత్వం ఏర్పడుతుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

అరాచక శక్తులను పెంచి పోషించి..

'నేతల ఫామ్‌హౌజ్‌లు పెరుగుతున్నయి కానీ.. పేదోడికి డబుల్‌బెడ్‌రూమ్‌ఇండ్లు లేవు. రుణాలు మాఫీగాక రైతులు, చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచ్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి వారికి వెన్నుపోటు పొడిచింది'అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. 'కేజీ టు పీజీ విద్య ఏమైంది? గిరిజనులకు రిజర్వేషన్లు ఏమైనయి? తెలంగాణ బంగారం కాలేదు కానీ.. అధికారంలో ఉన్న నేతల కుటుంబాలు బంగారం అయ్యాయి'అని అన్నారు. ప్రశ్నించే గొంతుకలైన జర్నలిస్టులు, ప్రతిపక్షాలు, సామాజిక కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, అరాచక శక్తులను పెంచి పోషించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు.



గాంధీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న గద్దర్. చిత్రంలో ఉత్తమ్, మీరాకుమార్, ఠాక్రే, వీహెచ్ తదితరులు

తొమ్మిదేళ్లయినా తీరని కష్టాలు

▶ మొదటి పేజీ తరువాయి

మాజీ స్పీకర్ మీరాకుమార్ చెప్పారు. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు పూర్తవుతున్నందుకు సంతోషంగా ఉందని, అదే సమయంలో ఈ తొమ్మిదేళ్లలో కూడా ప్రజల కష్టాలు తీరనందుకు బాధగా ఉందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన సభలో మీరాకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

మార్పు రానందుకు దుఃఖం వస్తోంది..

నాడు తెలంగాణ రాష్ట్రాన్ని రాజ్యాంగ పరిధిలోనే ఏర్పాటు చేశామని, పార్లమెంటు తలుపులు మూసేశామని, తల్లిని చంపారని కొందరు మాట్లాడడం హాస్యాస్పదమని మీరాకుమార్ పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటై తొమ్మిదేళ్లు పూర్తయిన తర్వాత కూడా ఇక్కడి రైతులు, కార్మికుల సమస్యలు అలాగే ఉన్నాయని, వారి పరిస్థితుల్లో మార్పు రానందుకు దుఃఖం వస్తోందని అన్నారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని, ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడం ద్వారానే ఈ మార్పు సాధ్యమవుతుందన్నారు.

కాంగ్రెస్ సర్కారు తెచ్చుకుందాం: ఠాక్రే

తెలంగాణలో ఉద్యోగాల్లేక యువత ఇబ్బందులు పడుతోందని, రైతులు సమస్యలతో సతమతమవుతున్నారని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తెచ్చుకుని ఆకాంక్షలను నెరవేర్చుకుందామని చెప్పారు. నల్లగొండ ఎంపీ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ప్రధాని మోదీ అపహాస్యం చేశారని, ఇందుకు తెలంగాణ ప్రజలకు మోదీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందిన రోజున కేసీఆర్ సభలో కూడా లేరని, మీరాకుమార్ ఎంతో ధైర్యంగా ఆ బిల్లును పాస్ చేయించారని చెప్పారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ తదితరులు మాట్లాడారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు గన్‌పార్కులోని అమరవీరుల స్తూపం వద్ద మీరాకుమార్ నివాళులర్పించారు. అబిడ్స్‌లోని బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి కూడా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గాంధీభవన్ వరకు కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు.

తెలుగు చాలా బాగుంటుంది: మీరాకుమార్

మీరాకుమార్ తెలుగు భాషతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. 'నాకూ తెలుగులో మాట్లాడాలని ఉంది. తెలుగు భాష చాలా బాగుంటుంది. మా నాన్న ఇక్కడకు వచ్చేవారు. అప్పటి నుంచే నాకు తెలుగుతో అనుబంధం ఉంది. కానీ మాట్లాడలేను. హిందీలో మాట్లాడుతున్నాను.'అని ఆమె వ్యాఖ్యానించారు. సభ అనంతరం ఉద్యమకారులను టీపీసీసీ తరఫున సన్మానించారు . తెలంగాణ బిల్లును ఆమోదించిన మీరాకుమార్‌ను సన్మానించారు. సభా వేదికపైకి రావడానికి ముందుకు ఆమె బోనమెత్తుకున్నారు.

తెలంగాణ అమరుల లక్ష్యం నెరవేరలేదు

గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళులర్పించిన అనంతరం మీరాకుమార్ మాట్లాడుతూ.. ఏ లక్ష్యం కోసం ఆత్మ బలిదానాలు చేసి రాష్ట్రాన్ని సాధించారో ఆ లక్ష్యం నెరవేరలేదన్నారు. వారి లక్ష్యం నెరవేరాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలన్నారు.

మీరాకుమార్‌కు అగ్గిపెట్టెలో ఇమిడే చీర

సిరిసిల్ల: సిరిసిల్ల నేత కళాకారుడు నల్ల విజయ్ కుమార్ తాను నేసిన అగ్గిపెట్టెలో ఇమిడే పట్టు, బంగారు పోగుల చీరను శుక్రవారం గాంధీభవన్‌లో మీరాకుమార్‌కు అందజేశారు. కరీంనగర్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కోరిక మేరకు విజయ్‌కుమార్ 2 గ్రాముల బంగారం పోగులతో 48 అంగుళాల వెడల్పు, ఐదున్నర మీటర్ల పొడవుతో ఈ చీరను నేశాడు. ఈయన తండ్రి నల్ల పరంధాములు నాలుగు దశాబ్దాల కిందటే అగ్గి పెట్టెలో పట్టే పట్టుచీరను నేసి ప్రపంచానికి సిరిసిల్ల చేనేత కళా వైభవాన్ని చాటిచెప్పారు.

---

4 కోట్ల ప్రజలకు డబ్బిస్తే

నలుగురు దోచుకుంటున్నారు

సీఎం కేసీఆర్ ఆ నలుగురికే పంపకాలు చేస్తున్నారు.. బండి సంజయ్ ఆరోపణలు

- తెలంగాణ సమాజాన్ని గాలికొదిలేశారు..
- రాష్ట్రంలో ఏ వర్గాన్ని కదిలించినా కష్టాలు, కన్నీళ్లే..
- ప్రజలు అంతోఇంతో బాగున్నారంటే కేంద్ర నిధులు, మోదీ చలవే..
- బీజేపీ కార్యాలయంలో తెలంగాణ ఆవిర్భావ వేడుకలు



బీజేపీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న బండి సంజయ్. చిత్రంలో పార్టీ నేతలు

సాక్షి, హైదరాబాద్: కేంద్రం గత తొమ్మిదేళ్లలో తెలంగాణ అభివృద్ధికి, 4 కోట్ల ప్రజల కోసం రూ.4 లక్షల కోట్లు కేటాయిస్తే, ఆ డబ్బును నలుగురు మాత్రమే దోచుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆరోపించారు. సీఎం కేసీఆర్ డబ్బును ఆ నలుగురికే పంచుతూ తెలంగాణ సమాజాన్ని గాలికొదిలేశారని అన్నారు. కొట్లాడి సాధించిన రాష్ట్రం వారి చెరలో బందీ అయ్యిందంటూ తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణలో అంతో ఇంతో అభివృద్ధి జరిగిందంటే, ప్రజలు బాగున్నారంటే కేంద్ర నిధులు, మోదీ అమలు చేస్తున్న పథకాలే కారణమని పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని పార్టీ కార్యాలయంలో సంజయ్ జాతీయ జెండా ఎగురవేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ కోసం ఎంతోమంది యువకులు ఆత్మ బలిదానాలు చేసుకుంటుంటే.. 'మీరు ఆత్మహత్య చేసుకోవద్దు. తెలంగాణ కల సాకారం చేస్తాం..'అంటూ సుష్మా స్వరాజ్ పార్లమెంట్ వేదికగా చెప్పడమే కాకుండా, తెలంగాణ బిల్లుకు మద్దతు ప్రకటించారని చెప్పారు.

బీజేపీ ధాటికి తట్టుకోలేక దేశమ్మీద పడ్డారు..

దేశాభివృద్ధికి మోదీ ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుంటే, తెలంగాణలో మాత్రం మూర్ఖపు పాలన సాగుతోందని బండి విమర్శించారు. తెలంగాణలో సంపద సృష్టికి కేంద్రం లక్షల కోట్లు కేటాయిస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోగా కేంద్ర పథకాలను అమలు కూడా చేయడం లేదన్నారు. తెలంగాణకు ఇచ్చిన కేంద్ర నిధులతో పాటు, చేసిన అభివృద్ధిపై చర్చకు రమ్మంటే కేసీఆర్ పారిపోతున్నాడని, బీజేపీ ధాటికి తట్టుకోలేక టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చుకుని దేశమ్మీద పడ్డారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మూర్ఖపాలనలో తెలంగాణ అధోగతి పాలైందని, ఏ వర్గాన్ని కదిలించినా కష్టాలు, కన్నీళ్లే అని అన్నారు.

ఉద్యమకారులు కలిసి రావాలి..

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలపై భారం పడకుండా ఉచితంగా విద్య, వైద్యాన్ని అందిస్తామని, నిలువనీడలేని పేదలందరికీ ఇండ్లు కట్టిస్తామని సంజయ్ హామీ ఇచ్చారు. ఫసల్ బీమా అమలు చేయడంతో పాటు 25 వేల టీచర్ పోస్టులు సహా ఉద్యోగ ఖాళీలన్నిటినీ భర్తీ చేస్తామని అన్నారు. బీజేపీని దెబ్బతీసేందుకు, వివిధ ఎన్నికల్లో డిపాజిట్లు రాని కాంగ్రెస్‌ను లేపేందుకు బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తోందని ఆరోపించారు. బీఆర్‌ఎస్ సర్కార్ ఓటమి లక్ష్యంగా గతంలో చేసిన మిలియన్ మార్చ్, వంటావార్పు, సకల జనుల సమ్మె స్ఫూర్తితో కలిసి పోరాడదామని, బీజేపీ చేసే పోరాటాలకు ఉద్యమకారులందరూ కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. పార్టీ నేతలు నల్లు ఇంద్రసేనారెడ్డి, జి.వివేక్, పొంగులేటి సుధాకర్ రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, రవీంద్రనాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చాక దారుస్సలాం స్వాధీనం

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవంలో ఒవైసీ పాల్గొనకపోవడంపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్ సమాధానం చెప్పాలని సంజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన జెండా ఎగురవేయని వారికి రాష్ట్రంలో పోటీ చేసే అర్హత లేదన్నారు. అక్కడ జెండా ఎగరవేయనందుకు కేసీఆర్‌కు దమ్ముంటే దారుస్సలాంకు తాళం వేయాలన్నారు. ఆర్నెల్లలో తాము అధికారంలోకి వచ్చాక దారుస్సలాంను స్వాధీనం చేసుకుని పేద ముస్లింలకు ఇచ్చేస్తామని చెప్పారు.

రేవంత్‌లా పార్టీలు మారడం నాకు చేతకాదు

తనకు రేవంత్‌రెడ్డి మాదిరిగా పార్టీలు మారడం చేతకాదని బండి వ్యాఖ్యానించారు. ఆయనలాగా ఓటుకు నోటు కేసులో మాదిరి డబ్బులు పంచడం కూడా రాదన్నారు. తనకు పార్టీ నడపడం రాదని చెబుతున్న రేవంత్.. ఏ విధంగా పార్టీని నడిపిస్తున్నారో జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి, జగ్గారెడ్డి వంటి నేతలను అడిగితే తెలుస్తుందని చెప్పారు. తమది కుటుంబ పార్టీ కాదని, అయ్య పేరు చెప్పి కూతురు, కొడుకు సీఎంలు అయ్యే పార్టీ కాదని, అలాగే అయ్య లేకుంటే బిడ్డ, బిడ్డ లేకుంటే కొడుకు సీఎం అయ్యే పార్టీ కూడా కాదని చెప్పారు.

క్లుప్తంగా...

కొత్త రాష్ట్రమైనా దేశానికే ఆదర్శం: శ్రీనివాస్‌గౌడ్



గన్‌ఫౌండ్రీ (హైదరాబాద్): తెలంగాణ రాష్ట్ర చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ నేతృత్వంలో అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నామ న్నారు. కొత్త రాష్ట్రమైనా దేశంలో పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'కొత్త తెలంగాణ చరిత్ర బృందం' సదస్సు 4న

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో చరిత్ర పరిశోధనలో ఉన్న 'కొత్త తెలంగాణ చరిత్ర బృందం' జూన్ 4న జాతీయ స్థాయి చరిత్ర సదస్సును నిర్వహించనుంది. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'తెలంగాణ చరిత్ర తొవ్వల్లో మనం–గమ్యం, గమనం' పేరుతో రవీంద్రభారతిలో సదస్సు నిర్వహిస్తున్నట్టు ఆ బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కీసరగుట్టలోని తొలితరం తెలుగు శాసనం 'తొలుచువాండ్రు'ను మరోసారి అన్వేషించి వెలుగులోకి తెచ్చి ఇటీవలే మృతి చెందిన దీకొండ నర్సింగరావు పేరుతో సభా ప్రాంగణం ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. సదస్సులో 20 వరకు పరిశోధన పత్రాలను సమర్పిస్తామన్నారు.

పీవీ ముని మనవడికి 'ప్రెసిడెంట్స్' అవార్డు



సనత్‌నగర్ (హైదరాబాద్): అమెరికా లాస్‌ఏంజెలిస్‌లో విద్యనభ్యసిస్తున్న మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు మునిమనవడు (ఎమ్మెల్సీ వాణీదేవి మనవడు) ఆహాన్ సాయి నెల్లుట్ల ప్రతిష్టాత్మక 'ప్రెసిడెంట్స్ ఎడ్యుకేషన్'పురస్కారం అందుకున్నారు. ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అండ్ అచీవ్‌మెంట్‌కుగాను ఈ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వాణీదేవి హర్షం వ్యక్తం చేస్తూ ఆహాన్ సాయికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

రోబోటిక్స్‌లో ఎంటెక్

బంజారాహిల్స్: ప్రముఖ విద్యాసంస్థ మహీంద్ర యూనివర్సిటీ రోబోటిక్స్‌లో ఎంటెక్ ప్రోగ్రామ్ ప్రారంభించింది. రోబోటిక్స్, సాంకేతికతల్లో ప్రతిష్టాత్మక సంస్థ నార్వేలోని ఆగ్దర్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో ఈ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. రోబోటిక్స్ రంగంలో అధునాతన జ్ఞానం, ఆచరణాత్మక నైపుణ్యాలతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఈ ప్రోగ్రామ్ తీసుకొచ్చినట్లు మహీంద్రా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ యాజులు మెధురి తెలిపారు. రెండు యూనివర్సిటీల మధ్య సహకారం ప్రపంచస్థాయి విద్యా అనుభవాన్ని అందించేందుకు, నైపుణ్యం, వనరులను సమకూర్చేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించండి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను క్రమబద్ధీకరించాలని ఉథాట్స్ రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఎమ్మెల్సీ విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘాల రాష్ట్ర కమిటీ ప్రతినిధుల బృందం తెలంగాణ సచివాలయం భవన్‌లో మంత్రి సబితా ఇంద్రారెడ్డికి కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాజేశ్వర్ రెడ్డి, అధ్యాపక నాయకులు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల్లోని విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఏవిధంగా క్రమబద్ధీకరించారో.. ఆ విధంగానే చేయాలని, అలా కానిపక్షంలో సుప్రీంకోర్టు ఉమాదేవి కేసులో ఇచ్చిన తీర్పు ప్రకారం వన్ టైం సెటిల్మెంట్ కింద అయినా ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన మంత్రి సబిత కాంట్రాక్ట్ అధ్యాపకుల క్రమబద్ధీకరణకు నివేదిక తయారు చేయాలని విద్యాశాఖ కార్యదర్శి కరుణను ఆదేశించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ తెలంగాణ స్టేట్ (ఉథాట్) అధ్యక్షుడు డాక్టర్ పరశురామ్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరి నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కరుణాకర్ రావు పాల్గొన్నారు.

ప్రజలంతా సంతోషంగా ఉండాలని వేడుకున్నా..

ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ ఏఐఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శుక్రవారం ట్విట్టర్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సంతోషంగా ఉండాలని 'అల్లా'ను వేడుకున్నానని, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఇదే విధంగా కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు.

ఎంఎస్.. చలో యూఎస్



రాష్ట్రంలోని ఇంజనీరింగ్ విద్యార్థుల్లో ఏటేటా పెరుగుతున్న ఆసక్తి

అత్యధిక ఉద్యోగాలు, డిమాండ్ దృష్ట్యా ఎంఎస్ కోర్సులవైపే మొగ్గు

చదువుకుంటూనే ఉపాధి పొందే అవకాశం ఉండటం కూడా కారణం

52,000	60,000
గతేడాది వెళ్లినవారు	ఈ ఏడాది వెళ్లొచ్చని అంచనా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసిన తర్వాత చాలా మంది విద్యార్థులు అమెరికాలో ఎంఎస్ కోర్సు చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. అమెరికా వెళ్తే చదువుకుంటూనే ఉపాధి సైతం పొందవచ్చని భావిస్తున్నారు. కోవిడ్ కాలంలో అమెరికా వెళ్లాలనే ఆకాంక్ష విద్యార్థుల్లో కాస్త తగ్గినా గతేడాది నుంచి మళ్లీ ఆసక్తి పెరిగింది. ఆర్థిక మాంద్యంతో అక్కడ ఉపాధి అవకాశాలు తగ్గినా విద్యార్థులు మాత్రం దీన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. ఎంఎస్ పూర్తయ్యే నాటికి పరిస్థితులు సాధారణ స్థాయికి చేరుకుంటాయని ఆశిస్తున్నారు. దీంతో అప్పులు చేసి మరీ విదేశీ చదువుల కోసం పరుగులు పెరుగుతున్నారు. రాష్ట్రంలో 2020లో దాదాపు 40 వేల మంది విద్యార్థులు అమెరికా వెళ్లగా 2022లో ఈ సంఖ్య 52 వేలకు పెరిగిందని, ఈ ఏడాది ఆగస్టు నాటికి వారి సంఖ్య 60 వేల వరకు ఉండొచ్చని ఓ కన్సల్టెంట్ తెలిపారు. దేశం నుంచి ఈ ఏడాది దాదాపు 7 లక్షల మంది విద్యార్థులు ఆగస్టులో అమెరికా, ఆస్ట్రేలియా ఇతర దేశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారన్నారు.

జాబ్ వచ్చే కోర్సులే గురి...

దేశంలో ఏ కోర్సులో ఇంజనీరింగ్ చేసినా అమెరికాలో ఎంఎస్ మాత్రం సాఫ్ట్‌వేర్ అనుబంధ రంగాల్లోనే చేయాలని విద్యార్థులు లక్ష్యంగా పెట్టుకుంటున్నారు. ముఖ్యంగా డేటా సైన్స్ వైపు మొగ్గుచూపుతున్నారు. డిజిటల్ ఎకానమీలో అత్యధికంగా ఉదోగాలు ఉండటం, నైపుణ్య విభాగాలైన బిజినెస్, టెక్నాలజీ, డేటా సైన్స్‌కు భవిష్యత్తులోనూ మంచి డిమాండ్ ఉంటుందని భావిస్తున్నారు. ఈ అంచనాలతోనే ఎక్కువ మంది డేటా సైన్స్‌లో విదేశీ విద్య పూర్తి చేయాలని భావిస్తున్నారు. ఇప్పటివరకు అందిన నివేదికల ప్రకారం డేటా అనాలసిస్‌లో 23 శాతం, డేటా విజువలైజేషన్‌లో 10 శాతం, ప్రాబబిలిటీ అండ్ స్టాటిస్టిక్స్‌లో 26 శాతం, మెషీన్ లెర్నింగ్‌లో 41 శాతం మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో చదువుతున్నారు. వారి లక్ష్యం మాత్రం ఈ కోర్సుల డిమాండ్‌ను అందిపుచ్చుకోవడమే. దేశంలో 2020–21 మధ్య డేటా సైన్స్‌లో ఉద్యోగాలు 47.10 శాతం మేర పెరిగాయి. ఎంఎస్ పూర్తి చేసిన వారికి ఎక్కువగా ఉద్యోగ అవకాశాలు వస్తున్నట్లు సర్వేలు చెబుతున్నాయి.

రంగంలోకి కన్సల్టెన్సీలు...

విదేశాలకు వెళ్లే విద్యార్థులను వెతికి పట్టుకొనేందుకు కన్సల్టెన్సీలు పోటీపడుతున్నాయి. వాస్తవానికి విదేశాల్లో ఎంఎస్ కోర్సు చేసేందుకు ట్యూషన్ ఫీజు, ఇతర ఖర్చులు, విమాన ప్రయాణ చార్జీలు కలిపి రూ. 30 లక్షల నుంచి రూ. 50 లక్షల వరకు ఖర్చవుతుంది. చదువుతూ ఉద్యోగం చేయడానికి చాలా దేశాలు ఒప్పుకోవు. కాబట్టి అక్కడ చదివే సమయంలో కావల్సిన మొత్తం తమ వద్ద ఉందని విద్యార్థి వెళ్లే ముందే ఆధారాలు చూపించాలి. ఈ ప్రక్రియలో కన్సల్టెన్సీలు అవసరమైన తోడ్పాటు అందిస్తున్నాయి. విద్యార్థి ఖాతాలో డబ్బులు వేయడం, అతను విదేశాలకు వెళ్లిన తర్వాత తిరిగి తీసుకోవడం సర్వసాధారణంగా జరిగిపోతున్నాయి. విదేశాల్లో విద్యార్థులు చదువును త్వరగా పూర్తి చేసి వీసా గడువులోగా ఎక్కువ ఉపాధి మార్గాలపై దృష్టి పెడుతున్నారు. ఇలాంటి వారికి కన్సల్టెన్సీలు ఏదో ఒక ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇస్తున్నాయి. ఎం.ఎస్. పూర్తి చేశాక కూడా ఉద్యోగం ఇస్తామని ఒప్పందం చేసుకుంటున్నాయి. విదేశాలకు విద్యార్థులు వెళ్లాక ఏదో ఒక పార్ట్‌టైం ఉద్యోగం చేస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇవన్నీ సానుకూల మార్గాలు కావడంతో ఎక్కువ మంది వెళ్ళేందుకు ఇష్టపడుతున్నారు.

ఏటా విదేశాలకు వెళ్లిన భారతీయ విద్యార్థుల సంఖ్య..

2017	2018	2019	2020	2021	2022
4,53,977	5,17,978	5,86,329	2,59,644	4,44,574	6,48,678

సొంత జిల్లాల్లో 'నో పోస్టింగ్'

- మూడేళ్లకు మించి ఒకే జిల్లాలో ఉంటే బదిలీ: సీఈసీ
- ఎన్నికల నేపథ్యంలో తెలంగాణసహా ఐదు రాష్ట్రాల సీఎస్‌లకు ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: సొంత జిల్లాల్లో అధికారులకు పోస్టింగులు ఇవ్వొద్దంటూ త్వరలో ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. తెలంగాణ సహా ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాజస్తాన్, మధ్యప్రదేశ్, మిజోరాం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సీఈసీ లేఖలు రాసింది. అధికారుల బదిలీలపై మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా పాల్గొనే అధికారులను వారి సొంత జిల్లాల్లో కొనసాగించరాదని, పోస్టింగులు ఇవ్వకూడదని ఉత్తర్వుల్లో పేర్కొంది. మూడేళ్లకు మించి ఒకే జిల్లాలో పనిచేస్తున్న అధికారులను సైతం కొనసాగించవద్దని ఆదేశాలిచ్చింది. వచ్చే ఆరు నెలల్లో పదవీ విరమణ పొందే అధికారులను బదిలీ చేయాల్సిన అవసరం లేదని, వారిని ఎన్నికలకు దూరంగా ఉంచాలని సూచించింది. ఎన్నికల విధుల్లో ఉండే అధికారుల బదిలీలు, పోస్టింగులకు సంబంధించిన పూర్తిస్థాయి నివేదికను జూలై 31లోగా తమకు సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలను కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది.

హైదరాబాద్‌లో కొత్తగా 29 పోలీసు స్టేషన్లు

నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్

- త్వరలోనే 2 వేల మంది సివిల్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీ

బంజారాహిల్స్ (హైదరాబాద్): హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో లక్ష నుంచి లక్షన్నర మంది జనాభాకు అనుగుణంగా 29 కొత్త పోలీసు స్టేషన్లు ఏర్పాటు చేశామని నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. ఇవి శుక్రవారం నుంచే పని చేయడం ప్రారంభించాయని వెల్లడించారు. అన్ని కోణాల్లో పరిశీలించి ప్రజలకు పోలీసింగ్ సేవలు మరింత మెరుగ్గా అందే విధంగా వీటిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. శుక్రవారం ఆయన కొత్తగా ఏర్పాటు చేసిన ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు. కొత్త పోలీసు స్టేషన్లలో కమాండ్ కంట్రోల్, కంప్యూటర్లను వచ్చే 15 రోజుల్లో నెలకొల్పుతామన్నారు. గోల్కొండ, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ల పరిధి నుంచి కొంత భాగాన్ని తీసుకొని ఫిలింనగర్ పోలీసు స్టేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ప్రతి స్టేషన్‌లో తగిన సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోలీసులు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే విధంగా ఈ కొత్త పోలీసు స్టేషన్ల కోసం ప్రభుత్వం 1,252 మంది సిబ్బందిని మంజూరు చేసిందన్నారు. కాగా, త్వరలో మరో 2 వేల మంది సివిల్ కానిస్టేబుళ్లు రాబోతున్నారని, దీనికి సంబంధించి నోటిఫికేషన్ త్వరలోనే రాబోతుందని చెప్పారు.



ఫిర్యాదుదారుడికి తొలి ఎఫ్ఐఆర్ కాపీ అందిస్తున్న పోలీసు అధికారి. చిత్రంలో సీవీ ఆనంద్ తదితరులు

ఆధ్యాత్మిక రైళ్లకు అపూర్వ ఆదరణ

- మాతా వైష్ణోదేవి సహా పలు క్షేత్రాలకు భారత్‌గౌరవ్ రైళ్లు
- ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు
- రైలు ప్రయాణంతో పాటు వసతులు

సాక్షి, హైదరాబాద్: వేసవి సెలవులను దృష్టిలో ఉంచుకొని వివిధ ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలకు ఐఆర్‌సీటీసీ నడుపుతున్న ఆధ్యాత్మిక రైళ్లకు అపూర్వమైన ఆదరణ లభిస్తోంది. దేశవ్యాప్తంగా పర్యాటక, చారిత్రక, ఆధ్యాత్మిక సందర్శన స్థలాలకు ఐఆర్‌సీటీసీ చాలాకాలంగా ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక ప్యాకేజీలనూ అందిస్తోంది. దేశ, విదేశాలకు చెందిన పర్యాటకుల కోసం ఫ్లైట్ ప్యాకేజీలను సైతం అందుబాటులోకి తెచ్చింది. కోవిడ్ దృష్ట్యా రెండేళ్లపాటు ఐఆర్‌సీటీసీ కార్యకలాపాలు స్తంభించాయి. ఏడాదిగా అన్ని ప్యాకేజీలను పునరుద్ధరించారు. ప్రస్తుతం ప్రత్యేకంగా జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు, యాత్రికులకోసం భారత్‌గౌరవ్ రైళ్లను నడుపుతోంది. తెలుగు రాష్ట్రాల నుంచి ఇప్పటి వరకు 8 రైళ్లు బయలుదేరాయి. హైదరాబాద్ నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు బయలుదేరే రైళ్లలో వంద శాతం ఆక్యుపెన్సీ నమోదు కావడం గమనార్హం. ఇంటిల్లిపాదీ ప్రయాణించేందుకు అనుకూలంగా ఉన్న ఈ రైళ్లకు ప్రయాణికుల నుంచి అనూహ్యమైన స్పందన లభిస్తోందని అధికారులు చెబుతున్నారు.

వైష్ణోదేవి ఆలయానికి స్పెషల్ ట్రైన్..

ఈ నెల 10న ప్రారంభం కానున్న ఈ రైలులో ఉత్తర భారతంలోని మాతా వైష్ణోదేవి ఆలయం, హరిద్వార్, రిషికేశ్ వంటి ప్రసిద్ధ యాత్రా స్థలాలను సందర్శించవచ్చు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరి.. కాజీపేట, పెద్దపల్లి, రామగుండం, సిర్పూర్ కాగజ్‌నగర్‌తో పాటు మహారాష్ట్రలోని బల్లార్షా, వార్ధా, నాగ్‌పూర్ మీదుగా రాకపోకలు సాగించనుంది. ఈ రైలులో వెళ్లేవాళ్లు కత్రా, ఆగ్రా, మథుర, బృందావన్, హరిద్వార్, రిషికేశ్ క్షేత్రాలను సందర్శించవచ్చు. కత్రా స్టేషన్ నుంచి వైష్ణోదేవి ఆలయానికి డోలీ లేదా హెలికాప్టర్‌లో వెళ్లాలనుకునే పర్యాటకులు సొంతంగా బుక్ చేసుకోవలసి ఉంటుంది. ఇందుకు ఐఆర్‌సీటీసీ సహకరిస్తుంది. 8 రాత్రులు/ 9 రోజుల వ్యవధితో కూడిన ఈ పర్యటన ఈ నెల 18న తిరిగి సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది.

అన్ని సదుపాయాలతో ప్యాకేజీ...

ఈ ప్యాకేజీలో భాగంగా రైలు ప్రయాణంతో పాటు రోడ్డు రవాణా, వసతి సౌకర్యం, భోజనం, టూర్ ఎస్కార్ట్‌లు, భద్రత, పబ్లిక్ అనౌన్స్‌మెంట్, ప్రయాణ బీమా, తదితర సదుపాయాలన్నీ ఉంటాయి. స్లీపర్ క్లాస్ రూ.15435, థర్డ్ ఏసీ రూ.24735, సెకండ్ ఏసీ రూ.32480 చొప్పున చార్జీ ఉంటుంది. వివరాలకు ఐఆర్‌సీటీసీని 9701360701, 8287932228 నంబర్లలో సంప్రదించవచ్చు.

నేటి నుంచి బడిబాట

రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ ప్రచారం

- సర్కారీ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంపుకోసం కృషి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా శనివారం నుంచి బడిబాట కార్యక్రమం మొదలవుతుంది. పాఠశాల విద్యాశాఖ ఇందుకు అన్ని ఏర్పాట్లూ చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతాన్ని పెంచడం బడిబాట ముఖ్య ఉదేదశం. ఇందులో భాగంగా డీఈవోలు, హెచ్ఎంలు, టీచర్లకు ప్రోత్సాహకాలు ప్రకటించింది. బడిబాటలో అత్యధికంగా ఎన్‌రోల్‌మెంట్ నమోదైన టాప్ –3 జిల్లాలు, రాష్ట్రంలోని టాప్ –10 పాఠశాలలను గుర్తించి ఘనంగా సన్మానిస్తామని వెల్లడించింది. బడిబాట షెడ్యూల్, మార్గదర్శకాలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ దేవసేన ఇటీవల విడుదల చేశారు. ఈ మేరకు జిల్లాస్థాయిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు ఇతర శాఖలు, అధికారులతో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. శుక్రవారం మండల, జిల్లాస్థాయిలో సమన్వయ సమావేశాలు, పలుచోట్ల గ్రామసభను నిర్వహించి సర్పంచ్ ఎస్ఎంసీ సహా అందరిని భాగస్వామ్యం చేస్తున్నారు. జూన్ 12 నుంచి 17 వరకు షెడ్యూల్ ప్రకారం పిల్లలను బడుల్లో చేరుస్తారు. జిల్లా, మండలాల్లో బడిబాట హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసి, రోజువారీ ఎన్‌రోల్‌మెంట్ వివరాలను అందజేయాలని ఆదేశాలిచ్చారు. బడికి వెళ్లని చిన్నారుల గుర్తింపునకు స్వయం సహాయక బృందాల తోడ్పాటు తీసుకుంటారు.

రెండు షెడ్యూళ్లలో..

'బడిబాట'ను ఈ ఏడాది రెండుగా విభజించారు. అడ్మిషన్ల సంఖ్యను పెంచేందుకు జూన్ 3 నుంచి 9 వరకు స్పెషల్ ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తారు. జూన్ 12 నుంచి 17 వరకు షెడ్యూల్‌లో.. టీచర్లంతా ఉదయం 7 నుంచి 11 గంటల వరకు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తారు. ఇంగ్లిష్ మీడియం చదువు, 'మన ఊరు మన బడి'వంటి కార్యక్రమాల ప్రాధాన్యతను వివరిస్తారు. బాలకార్మికులు, బడి బయటున్న చిన్నారులను నమోదుకు కృషిచేస్తారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులను ప్రాథమిక పాఠశాలల్లో, 5వ తరగతి పూర్తిచేసిన వారిని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో చేర్పిస్తారు.

బడిబాట షెడ్యూల్..

తేదీ	కార్యక్రమాలు
జూన్ 3–9	ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్
12–6–23	మన ఊరు –మన బడి, మన బస్తీ –మన బడి
13–6–23	తొలిమెట్టు
14–6–23	సామూహిక అక్షరాభ్యాసం
15–6–23	ప్రత్యేకావసరాలు, బడి బయట విద్యార్థుల నమోదు
16–6–23	ఇంగ్లిష్ మీడియంపై అవగాహన
17–6–23	బాలికల విద్య, గైడెన్స్

కడుపులో ఉబ్బిన రక్తనాళం తొలగించి...

కాలి నుంచి మరో రక్తనాళం అమర్చి

నిమ్స్‌లో 60 ఏళ్ల వృద్ధుడికి అరుదైన శస్త్రచికిత్స విజయవంతం

- 13 గంటలపాటు వ్యాస్క్యులర్ సర్జరీ
- ప్రైవేటులో రూ. 10 లక్షల ఖరీదైన ఆపరేషన్ ఆరోగ్యశ్రీ కింద నిర్వహణ



బాధితుడితో నిమ్స్ వైద్యబృందం

లక్డీకాపూల్: నిమ్స్ వైద్యులు మరో అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. కడుపులోని పెద్ద రక్తనాళం (అబ్డొమినల్ అయోర్టా) తీవ్ర ఇన్ఫెక్షన్‌కు గురై ఉబ్బటం వల్ల కొన్నాళ్లుగా జ్వరంతో బాధపడుతున్న 60 ఏళ్ల వృద్ధుడికి ప్రాణాపాయం తప్పించారు. నిమ్స్ వ్యాస్క్యులర్ సర్జరీ విభాగం అధిపతి డాక్టర్ సందీప్ మహాపాత్ర అందించిన వివరాల ప్రకారం ఏపీలోని బాపట్ల జిల్లా రేపల్లెకు చెందిన చింతగుంట్ల గమానియేలు 20 ఏళ్లుగా హైదరాబాద్‌లో చెప్పుల షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. గతేడాది డిసెంబర్‌లో జ్వరంబారిన పడటంతో సొంతూరులోని ఆస్పత్రుల్లో చూపించుకున్నాడు. ఎక్కడా నయంకాకపోవడం, వ్యాధి సైతం నిర్ధారణ కాకపోవడంతో మంగళగిరిలోని మరో ఆస్పత్రికి వెళ్లాడు. వైద్యులు పరీక్షించి కడుపులోని పెద్ద రక్తనాళం ఇన్ఫెక్షన్‌కు గురై ఉబ్బిందని.. హైదరాబాద్‌లో ఏదైనా కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. హైదరాబాద్‌లోని ఒక కార్పొరేట్ ఆస్పత్రిని సంప్రదించగా ఆపరేషన్‌కు రూ. 10 లక్షలు ఖర్చవుతుందన్నారు. అంత స్తోమతలేని గమానియేలు చివరకు నిమ్స్‌కు వచ్చాడు. గత నెల 24న జనరల్ మెడిసిన్ విభాగంలో ఆయనకు అన్ని పరీక్షలు చేసిన వైద్యులు వ్యాస్క్యులర్ సర్జరీకి రిఫర్ చేశారు. గత నెల 28న వ్యాస్క్యులర్ సర్జరీ హెడ్ డాక్టర్ సందీప్ మహాపాత్ర ఆధ్వర్యంలో డాక్టర్ అనూష, డాక్టర్ ప్రజ్ఞ, డాక్టర్ స్నేహతో కూడిన బృందం 13 గంటలపాటు శ్రమించి రోగి కడుపులో ఉబ్బిన పెద్ద రక్తనాళాన్ని పూర్తిగా తొలగించింది. దాని స్థానంలో రోగి కాలి ఎముక పక్కన ఉండే రక్తనాళాన్ని తీసుకొని అమర్చింది. దీంతో రోగి ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. ఈ ఆపరేషన్‌కు కేవలం రూ. 2 లక్షల ఖర్చయిందని... అది కూడా ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తి చేశామని డాక్టర్ సందీప్ మహాపాత్ర తెలిపారు.

క్లిష్టమైన సర్జరీలకు కేరాఫ్...

అత్యంత క్లిష్టమైన ఆపరేషన్లు చేయడంలో నిమ్స్ వైద్యులు ప్రత్యేకత సంతరించుకున్నారు. న్యూరోసర్జన్, ఆర్థోపెడిక్, గ్యాస్ట్రోఎంటరాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ, సర్జికల్ ఆంకాలజీలతోపాటు వ్యాస్క్యులర్ సర్జరీ విభాగాలు ఇతర ఆస్పత్రుల్లో ఎంతో ఖరీదైన శస్త్రచికిత్సలను సైతం చవకగా, విజయవంతంగా పూర్తి చేస్తున్నాయి. మంత్రి హరీశ్‌రావు చొరవతోనే ఇదంతా సాధ్యమవుతోంది.

– ప్రొఫెసర్ నగరి బీరప్ప, నిమ్స్ ఇన్‌చార్జి డైరెక్టర్

బతుకుతానన్న ఆశపోయింది..

ఐదు నెలలుగా జ్వరంతో బాధపడుతున్నా. ఎక్కడికి వెళ్లినా, ఎన్ని మందులు వాడినా నయం కాలేదు. బతుకుతానన్న ఆశపోయింది. చివరగా నిమ్స్ వైద్యులను ఆశ్రయించా. నా ప్రాణాలు కాపాడిన నిమ్స్ వైద్యులకు కృతజ్ఞతలు.

– చింతగుంట్ల గమానియేలు, రోగి

అరుణ్ పిళ్లై.. కవిత ప్రతినిధి కాదు


- అరెస్టుకు భయపడి ఆ స్టేట్‌మెంట్‌పై సంతకం చేశారు
- మూడురోజులకే వాంగ్మూలం ఉపసంహరించుకున్నారు
- ప్రత్యేక కోర్టులో పిళ్లై తరఫు న్యాయవాది
- బెయిల్ పిటిషన్‌పై 8న తీర్పు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఈడీ ఆరోపిస్తున్నట్లుగా అరుణ్ పిళ్లై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రతినిధి కాదని పిళ్లై తరఫు న్యాయవాది ప్రత్యేక కోర్టుకు తెలిపారు. కుంభకోణంలో పిళ్లై పాత్ర లేదన్నారు. మద్యం వ్యాపారంలో పిళ్లై సొంత సొమ్ము పెట్టుబడిగా పెట్టారని, మరెవరో సొమ్ము ఇండో స్పిరిట్స్‌లో పెట్టుబడిగా పెట్టలేదని స్పష్టం చేశారు. సొంత సొమ్ముతోనే భూములు కొన్నారన్నారు. మద్యం పాలసీ రూపకల్పన, కిక్ బ్యాక్స్‌లో కూడా పిళ్లై పాత్ర లేదని వివరించారు. కేసులో ప్రధాన నిందితుడు అరుణ్ పిళ్లై బెయిల్ పిటిషన్‌ను శుక్రవారం రౌజ్ అవెన్యూ కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎంకే నాగ్‌పాల్ విచారించారు.

ఆధారాల్లేకుండానే అరెస్టు చేశారు..

పిళ్లై తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వాంగ్మూలం రికార్డు చేసిన మూడు రోజులకే పిళ్లై దాన్ని ఉపసంహరించుకున్నారని గుర్తు చేశారు. స్టేట్‌మెంట్ రికార్డు చేసే సమయంలో అరెస్టు చేస్తామని అధికారులు బెదిరించడంతో ఎమ్మెల్సీ కవిత పాత్ర ఉందంటూ సంతకం చేయాల్సి వచ్చిందని చెప్పారు. మరోవైపు ఈ కేసులో ఎలాంటి ఆధారాలు లేకుండా పిళ్లైని అరెస్టు చేశారన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, వాంగ్మూలం ఉపసంహరించుకున్నారంటూ బెయిల్ వ్యతిరేకించడం సరికాదని పేర్కొన్నారు. ఈడీ ఆరోపిస్తున్నట్లుగా పిటిషనర్ 2021, మార్చి 17 వరకూ ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో లేరని, మార్చి 16నే ఖాళీ చేశారని తెలిపారు. శరత్‌చంద్రారెడ్డి, బుచ్చిబాబులు మాత్రం మార్చి 17, 2021 వరకూ ఆ హోటల్‌లో ఉన్నారని తెలిపారు. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు మార్చి 18, 2021న ఎక్సైజ్ శాఖ కార్యదర్శి డ్రాఫ్టు పాలసీ ఇచ్చారని, మార్చి16న హోటల్ ఖాళీ చేసిన పిటిషనర్ పాలసీని ఎలా ప్రింట్ అవుట్ తీస్తారని ప్రశ్నించారు. కాగా తీర్పును రిజర్వు చేస్తున్నామని, ఈ నెల 8న బెయిల్‌పై నిర్ణయం వెలువరిస్తామని న్యాయమూర్తి చెప్పారు. ఇలావుండగా ఈ కేసులో సీబీఐ దాఖలు చేసిన అనుబంధ చార్జిషీటుపై విచారణను న్యాయమూర్తి జూలై 6కు వాయిదా వేశారు.

రోడ్డుపై నిర్లక్ష్యంగా | కారు డోర్ తీసి..





సీసీ టీవీలో నమోదైన ప్రమాద దృశ్యాలు, (ఇన్‌సెట్‌లో) చిన్నారి ధనలక్ష్మి

చిన్నారిని బలిగొన్న డ్రైవర్

- కారు డోర్ తగిలి బైక్‌పైనుంచి రోడ్డుపై పడిన పాప
- పసిపాపపైనుంచి వెళ్లిన ఆటో
- సీసీ కెమెరాల్లో రికార్డు.. ఎల్‌బీనగర్‌లో దుర్ఘటన
- చిన్నారిని ఆస్పత్రికి తరలించేందుకు ఎవ్వరూ ముందుకు రాని వైనం

నాగోలు: రోడ్డుపై కారు ఆపి సడన్‌గా డ్రైవర్ కారు డోర్ ఓపెన్ చేయడంతో వెనుక ద్విచక్ర వాహనంపై అమ్మానాన్నలతో వస్తున్న రెండేళ్ల చిన్నారి కింద పడిపోయింది. వెంటనే ఆ వెనుకనే వస్తున్న ఆటో పాపపై నుంచి వెళ్ళడంతో తీవ్ర గాయాలతో మృతి చెందిన విషాద ఘటన ఎల్‌బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఒకింత ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాలిలా.. ఎన్టీఆర్‌నగర్‌లో నివాసం ఉండే సయ్యద్ హబీబుద్దీన్, శశిరేఖ భార్యభర్తలు.. ప్రేమవివాహం చేసుకున్న వీరికి చాలాకాలం తర్వాత ధనలక్ష్మి(2) పుట్టింది. బ్యూటీషియన్‌గా పని చేస్తున్న శశిరేఖను గురువారం సర్వీస్ పనిపై మన్సూరాబాద్‌కు టూవీలర్‌పై తీసుకువెళ్లి పాపతో కలిసి తిరిగి హబీబుద్దీన్ ఇంటికి బయలుదేరారు.

వెనుకా ముందూ చూడకుండా కారు డోర్ తీసి..

నాగోలు బండ్లగూడకు చెందిన వినోద్ తన కారు (టీఎస్07ఎఫ్‌పి6149)లో ఎల్‌బీనగర్‌లోని గ్యారేజ్‌కి వచ్చాడు ఈ క్రమంలో డ్రైవర్ దుర్గాప్రసాద్ కారును నడిరోడ్డు మీద నిర్లక్ష్యంగా ఆపి ముందూ వెనుకా చూసుకోకుండా డోర్ తీశాడు. దాంతో కారు పక్క నుంచి వస్తున్న హబీబుద్దీన్ టూవీలర్‌కి డోర్ బలంగా తగిలింది. ద్విచక్ర వాహనం నుంచి కింద పడ్డ చిన్నారిపై నుంచి ఆ వెనుకే వస్తున్న ఆటో వెళ్ళడంతో తలపై బలమైన దెబ్బలు తగిలాయి. తీవ్ర గాయాలైన చిన్నారిని చికిత్స నిమిత్తం కామినేని హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఘటనలో పాపతో పాటు కిందపడ్డ శశిరేఖ ఎడమ చేయికి, మోకాలికి గాయాలయ్యాయి. హబీబుద్దీన్ ఫిర్యాదు మేరకు ఎల్‌బీనగర్ పోలీసులు డ్రైవర్ దుర్గా ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించి కారు స్వాధీనం చేసుకున్నారు. ఘటన జరిగిన వెంటనే ఆటోడ్రైవర్ వెళ్లిపోవడంతో అతని వివరాలు తెలియలేదు. అక్కడ జరిగిన ప్రమాద దృశ్యాలు స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయి సోషల్ మీడియాలో సైతం వైరల్ అయ్యాయి.

కారు యజమాని స్పందించినా పాప బతికేది..

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధనలక్ష్మి, శశిరేఖను హాస్పిటల్‌కు తరలించాలంటూ హబీబుద్దీన్ స్థానికులను ఎంతో వేడుకున్నాడు. ఆటోలను, కార్లను ఆపినా ఎవ్వరూ స్పందించలేదని దీంతో హాస్పిటల్‌కు వెళ్లేందుకు ఎక్కువ సమయం పట్టిందని విలపించాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌తో పాటు కారు యజమాని వినోద్ కూడా కనీసం సహాయం చేయలేదని, సరైన సమయంలో తీసుకువెళ్లి ఉంటే పాప బతికేదని హబీబుద్దీన్‌తో సహా బంధువులు కన్నీరుమున్నీరయ్యారు.



మీకు తెలుసా

అల్లం, కీరదోసతో జ్యూస్ తయారు చేసుకుని.. తాగితే.. మనం చాలా సులభంగా బరువు తగ్గవచ్చు. ముందుగా కీరదోసపై ఉండే చెక్కును తీసేయాలి. ముక్కలుగా చేసుకుని జార్‌లోకి వేసుకోవాలి. తర్వాత ఒకటిన్నర అంగుళాల అల్లం తీసుకుని శుభ్రం చేసి ముక్కలుగా చేయాలి. ఇప్పుడు జార్ లోకి వేసుకోవాలి. తర్వాత ఇందులో అరగ్లాస్ నీళ్లు పోసి.. మెత్తగా మిక్సీ పట్టాలి. ఆ తర్వాత దీనిని వడకట్టుకుని ఒక గ్లాసులోకి తీసుకోవాలి. రుచికోసం నిమ్మరసం కూడా కలుపుకోవచ్చు. ఇలా చేసుకున్న జ్యూస్ రోజూ ఉదయం పరగడుపున తాగాలి. అల్పాహారానికి అరగంట ముందు అయినా తీసుకోవచ్చు. ఇలా క్రమం తప్పకుండా తీసుకోవడం వలన చాలా సులభంగా బరువు తగ్గొచ్చు. ఈ జ్యూస్‌తో మలబద్ధక సమస్య తగ్గుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.



హెల్త్ టిప్స్



● గుప్పెడు యూకలిప్టస్ ఆకుల్ని దంచి గుజ్జుచేసి నుదుటిమీద అంటించుకొని మెత్తటి గుడ్డతో కట్టుకొని, గంటసేపు పడుకుంటే తలనొప్పి పోతుంది. ● పెద్ద ఉసిరికాయంత అల్లం, రెండు పసుపుకొమ్ములు కలిపి దంచి దానికి ఒక కాయ నిమ్మరసం, మూడు చెంచాల ఆముదం కలిపి గోరువెచ్చ చేయాలి. తలకి పట్టువేసి గుడ్డతో గట్టిగా కట్టి గంటసేపు నిద్రపోతే తలనొప్పి తగ్గుతుంది. ● తులసి రసాన్ని నాలుగు చుక్కలు తీసుకుని ఎడమ వైపు నొప్పి వస్తే కుడి ముక్కులో, కుడివైపు నొప్పి వస్తే ఎడమవైపు ముక్కులో వేసుకుని నిద్రపోతే పార్శ్వపు నొప్పి తగ్గుతుంది. ● ఉసిరికాయ రసం పంచదారతో కలిపి పూటకు పది గ్రాముల వంతున రెండుపూటలు తీసుకుంటే కీళ్ళనొప్పులు తగ్గుతాయి. ● పుదీనా కట్టలు నాలుగు, పది గ్రాముల మిరియాలు, పది గ్రాముల శొంఠి కలిపి మెత్తగా నూరి. శనగ గింజంత మాత్రలు చేసుకుని నీడలో ఆరబెట్టాలి. రోజుకు మూడు మాత్రల చొప్పున మూడునెలలు తీసుకుంటే స్థూలకాయం తగ్గుతుంది.



జుట్టు సమస్యలకు చెక్ చెప్పెయ్యండి

వేసవిలో జుట్టు సమస్యలు రావడం సర్వసాధారణమైపోయింది. జుట్టు సమస్యలతో బాధపడేవారు కొన్ని రకాల జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. అంతేకాకుండా అనారోగ్యకరమైన ఆహారాలు తీసుకోవడం మానుకోవాల్సి ఉంటుంది. ఈ కింది చిట్కాలను పాటించడం వల్ల కూడా సులభంగా జుట్టు చిట్లిపోవడం సమస్యల నుంచి ఉపశమనం పొందొచ్చని నిపుణులు చెబుతున్నారు.

వాతావరణంలో మార్పుల కారణంగా చాలామందిలో జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయి. ఈ సమస్యల నుంచి సులభంగా ఉపశమనం పొందడానికి మార్కెట్‌లో లభించే వివిధ రకాల సాధనాలను, కాస్మెటిక్ ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. అయినా, సరైన ఫలితాలను పొందలేక పోతున్నారు. అయితే కొన్ని జాగ్రత్తలు పాటించడం, కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండటం ద్వారా కూడా జుట్టు రాలకుండా చూసుకోవచ్చు.

ఎక్కువ చక్కెర కలిగిన ఆహారాలు తినడం వల్ల తీవ్ర చర్మ సమస్యలతో పాటు, జుట్టు రాలడం వంటి సమస్యలు వస్తాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ముఖ్యంగా జుట్టు రాలడం వంటి సమస్యలతో బాధపడేవారు చక్కెర గల ఆహారాలు తీసుకోవడం మానుకోవాల్సి ఉంటుంది.

జంక్ ఫుడ్ ఎక్కువ తీసుకోవడం వల్ల జుట్టు రాలడం, తెల్ల జుట్టు సమస్యలు కూడా వస్తాయని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. కాబట్టి జుట్టు సమస్యలతో బాధపడుతున్నవారు జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండడం చాలా మంచిది.

ఆహారంలో పచ్చి గుడ్లను తీసుకోవడం వల్ల వాటిలో ఉండే హానికరమైన బ్యాక్టీరియా జుట్టుకు కూడా హాని కలిగిస్తుంది. కాబట్టి ఇప్పటికే జుట్టు రాలడం వంటి సమస్యలతో బాధపడేవారు ఆహారంలో పచ్చి గుడ్లను తీసుకోకపోవడం ఉత్తమం.

ఆల్కహాల్ సేవించడం వల్ల కూడా సులభంగా జుట్టు రాలడం మొదలవుతుందని ఆరోగ్య నిపుణులు తెలుపుతున్నారు. ఇందులో ఉండే హానికరమైన విషపదార్థాలు తీవ్ర జుట్టు సమస్యలకు దారి తీస్తాయని పరిశోధనలు చెబుతున్నాయి కాబట్టి జుట్టును కాపాడుకోవాలనుకునేవారు ఆల్కహాల్‌కు దూరంగా ఉండటం మేలు.

తేనె, పెరుగు హెయిర్ మాస్క్‌తో సులభంగా ఉపశమనం లభిస్తుంది:

ప్రస్తుతం చాలామందిలో జుట్టు చివరి భాగాల్లో చిట్లిపోవడం వంటి సమస్యలు వస్తున్నాయి. వీటినే స్ప్లిట్ ఎండ్స్ అంటారు. ఇలాంటి సమస్యలతో బాధపడేవారు తేనె, పెరుగు హెయిర్ మాస్క్ వినియోగించడం వల్ల మంచి ఫలితాలు పొందుతారు. ఈ మాస్క్‌ను ఎలా తయారు చేసుకోవాలో మనం ఇప్పుడు తెలుసుకుందాం.. ముందుగా ఒక బౌల్ తీసుకుని అందులో అరకప్పు పెరుగు, 6 చెంచాల తేనె వేసి రెండూ బాగా కలిసేలా కలుపుకోవాలి. ఇలా తయారు చేసుకున్న మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని జుట్టు కుదుళ్లకు పట్టేలా రాసుకుని మృదువుగా మసాజ్ చేయాలి. ఆ తర్వాత ఒక గంటపాటు అలా వదిలేయాలి. బాగా ఆరిన తర్వాత జుట్టును తక్కువ గాఢత గల షాంపూతో శుభ్రం చేసుకుంటే మంచి ఫలితాలు కలుగుతాయి.

వేసవిలో జుట్టు రాలడానికి సాధారణ కారణాలు

● అధిక ఉష్ణోగ్రత, సూర్యరశ్మికి గురికావడం వల్ల జుట్టు చిట్లడం, పల్చబడడం జరుగుతుంది. ● స్విమ్మింగ్ వల్ల కూడా జుట్టు రాలుతుంది. ఎందుకంటే పూల్ నీటిలో ఉండే క్లోరిన్ జుట్టుపై ప్రతికూల ప్రభావం చూపి జుట్టు రాలేలా చేస్తుంది. ● వేసవిలో చెమట వల్ల జుట్టు రాలడం అనేది సర్వసాధారణం. ● వేడి వాతావరణం చుండ్రును తీవ్రతరం చేస్తుందని అంటారు. దీనికి చికిత్స చేయకుండా వదిలేస్తే, తాత్కాలికంగా జుట్టు రాలిపోతుంది.

అలోవెరా జెల్

అలోవెరా జెల్‌ను జుట్టు మీద అప్లై చేయడం చాలా మంచిది. దానివల్ల జుట్టు మెరవడంతోబాటు మృదువుగా కూడా మారుతుంది. అంతేకాదు, చుండ్రు లేదా జుట్టు రాలడానికి కారణమయ్యే ఇతర ఫంగల్ ఇన్‌ఫెక్షన్‌తో పోరాడుతుంది. అలోవెరా జ్యూస్ తాగడం వల్ల జుట్టు లోపలి భాగంలో బలపడుతుంది.


కొబ్బరి పాలతో మసాజ్

జుట్టు రాలడానికి శీఘ్ర రెమెడీ కొబ్బరి పాలతో తలకు సున్నితంగా మసాజ్ చేయడం. ఆ తర్వాత తలకు వెచ్చని టవల్ చుట్టడం. రెగ్యులర్ హెయిర్ వాష్, కండిషనింగ్‌తో ఈ చిట్కాను అనుసరించడం వల్ల హెయిర్ ఫాల్ సమస్య అదుపులోకి వస్తుంది.



వేసవిలో ఆకలి చచ్చిపోయి తీపిపదార్థాలు, చల్లని ఆహారం వైపు మనసు మళ్లేలా చేస్తుంది. కానీ వీటివల్ల ఆరోగ్యం దెబ్బతింటుంది. పేగు ఆరోగ్యం బాగుంటే అసిడిటీ, బ్లోటింగ్, మలబద్ధకం సమస్యలు వేసవిలో వేధించవు. ఆహారంలో అవసరమైనంత ప్రొబయాటిక్స్, చలువ చేసే పదార్థాలు చేర్చుకోవడం మంచిది. పప్పన్నం బదులుగా పెరుగన్నం, బార్లీ, రాగులను తినడం, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చెరకు రసం తాగడం వల్ల జీర్ణ సమస్యలు రావు.

కడుపు చల్లగా.. నోటికి రుచిగా...



బార్లీ సలాడ్... మలబద్ధకం,పేగు సమస్యలు రాకుండా చలువ చేసే తాజా, పోషకాలతో కూడిన రుచికరమైన ఆహారం ఇది. బార్లీలో పీచు ఎక్కువగా ఉంటుంది. ఆహారం తేలికగా జీర్ణమయ్యేలా చేస్తుంది. దీంట్లో ఉండే పీచువల్ల కడుపు నిండిన భావన వస్తుంది. ఎక్కువ తినాలనిపించకుండా చేస్తుంది. బార్లీలో విటమిన్లు, మినరల్స్ ఉంటాయి. ఐరన్, మెగ్నీషియం, సెలేనియం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. పాదాల వాపును, కిడ్నీ ఇన్ఫెక్షన్‌ను తగ్గించి మలబద్ధకం లాంటి సమస్యలు రాకుండా చేస్తుంది. ఉడికించిన బార్లీగింజలతోపాటూ కూరగాయలు, పండ్లు, నట్స్ కలుపుకుని తినొచ్చు. రుచిగా ఉండాలంటే తేనెలో కొన్ని మూలికలు, ఉప్పు, రుచికి తగ్గట్లు కలిపి బార్లీ గింజల్లో కలుపుకోవచ్చు. వేసవిలో చలువ చేసే ఆహారం ఇది.



పెసర మొలకలతో... మొలకెత్తిన పెసలతో చేసిన సలాడ్ ఆరోగ్యానికి మంచిది. ఫైబర్, ఎంజైములు, విటమిన్లు ఆహారం తొందరగా జీర్ణమయ్యేలా చేస్తాయి. దీంట్లో కొవ్వు తక్కువ, పోషకాలెక్కువ. మొలకెత్తిన పెసలలో కాస్త పెరుగు కలుపుకుని తింటే ఇంకా మంచిది. లేదంటే మొలకలతోపాటూ కూరగాయలు, మూలికలు, పెరుగు కలుపుకోండి. మీద కాస్త ఉప్పు, మిరియాల పొడి, నిమ్మరసం పిండుకోవచ్చు. చాలా తేలికగా ఉండి, కడుపు నింపే ఆహారం ఇది.



బూడిద గుమ్మడికాయ జ్యూస్... వేసవిలో పొట్ట ఆరోగ్యానికి ఇది చాలా మేలు చేస్తుంది. చలువ చేసే లక్షణం కూడా చాలా ఎక్కువ. దీంట్లో నీళ్ల శాతం ఎక్కువ ఉండటం వల్ల శరీరాన్ని ఎక్కువసేపు హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. శరీరంలో పీహెచ్ స్థాయులను నియంత్రణలో ఉంచుతుంది. అజీర్తి, బ్లోటింగ్ సమస్యలు రాకుండా చూస్తుంది.



పెరుగన్నం... దీంట్లో పుష్కలంగా ఉన్న ప్రొబయాటిక్స్ వల్ల జీర్ణసమస్యలు తగ్గుతాయి. ఆహారం తొందరగా జీర్ణమవుతుంది. క్యాల్షియం, ప్రొటీన్ మన శరీరానికి అవసరమైనంత దొరుకుతుంది. దీనికున్న చలువ చేసే లక్షణాల వల్ల శరీర ఉష్ణోగ్రత కూడా నియంత్రణలో ఉంటుంది. ఇంకేం, వేసవిలో పెరుగన్నం తప్పకుండా తినండి.



మజ్జిగ... వేసవిలో మజ్జిగ చేసే మేలు అంతా ఇంతా కాదు. పెరుగులో నీళ్లు కలిపి మజ్జిగ చేసుకోవచ్చు. దీంట్లో కూడా ప్రొబయాటిక్స్ ఉంటాయి. జీర్ణక్రియ వేగవంతం చేస్తాయి. తక్కువ కొవ్వు, కేలరీలుంటాయి దీంట్లో. మజ్జిగలో ఆవాలు, పుదీనా, కరివేపాకు కలిపి రుచి పెంచుకోవచ్చు. నూనె లేకుండా ఒక చెంచా ఆవాలు, కరివేపాకు వేయించుకోవాలి. చల్లారాక పుదీనా ఆకులతో కలిపి మిక్సీ పట్టుకోవాలి. దీన్ని మజ్జిగలో కలుపుకుంటే చాలు. ఆరోగ్యంతో పాటూ రుచీ వస్తుంది.



సినిమా

పల్లెకు పోదాం..

'పల్లెకు పోదాం సినిమా చేద్దాం. ఛలో చలో' అని పాడుకుంటున్నారు కొందరు హీరోలు. ఈ హీరోలతో వెండితెరపై పల్లె కథలను చూపించేందుకు రెడీ అవుతున్నారు దర్శకులు. ఈ పల్లెటూరి కథల్లోకి వెళదాం.

1990లో ఓ గ్రామం
నాగార్జున కెరీర్‌లో విలేజ్ బ్యాక్‌డ్రాప్ మూవీస్ చాలానే ఉన్నాయి. మరోసారి నాగార్జున ఓ విలేజ్‌లోకి ఎంట్రీ ఇవ్వనున్నారట. రచయిత బెజవాడ ప్రసన్నకుమార్ ఈ విలేజ్ స్టోరీని డెవలప్ చేశారు. అంతే కాదు... ఈ సినిమాతో ఆయన దర్శకుడిగా పరిచయం కానున్నారని సమాచారం. అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాను నిర్మిస్తారని తెలిసింది. 1990 నేపథ్యంలో సాగే ఈ చిత్రం షూటింగ్ ఈ నెలలోనే ఆరంభం కానుంది.

కేరాఫ్ స్టువర్టుపురం
1970లలో స్టువర్టుపురంలోని నాగేశ్వరరావు గురించి తెలియనివాళ్లు ఉండి ఉండరు. ఆయన జీవితంతో 'టైగర్ నాగేశ్వరరావు' చిత్రం రూపొందింది. రవితేజ హీరోగా వంశీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో గాయత్రీ భరద్వాజ్, నూపుర్ సనన్ నాయికలు. టైగర్ నాగేశ్వరరావు జీవితం ఏ విధంగా గడిచింది? ఆయన్ను కొందరు దొంగ అని, మరి కొందరు పేదలకు హెల్ప్ చేసే ఆపద్బాంధవుడు అని ఎందుకు చెప్పుకుంటున్నారు? అనే కోణంలో ఈ సినిమా ఉంటుందట. అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం అక్టోబరు 20న రిలీజ్ కానుంది.


పల్లెటూరి ఆటగాడు
హీరో రామ్‌చరణ్ కెరీర్‌లో 'రంగస్థలం' చిత్రం ఎంతటి ఘనవిజయం సాధించిందో తెలిసిందే. సుకుమార్ దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమాలో చిట్టిబాబు పాత్రలో రామ్‌చరణ్ సూపర్బ్. ఇప్పుడు సుకుమార్ శిష్యుడు, 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సనతో ఓ సినిమా చేసేందుకు రామ్ చరణ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇది పల్లెటూరి నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ ఫిల్మ్ అని, ఇందులో అన్నతమ్ములుగా రామ్‌చరణ్ డ్యూయల్ రోల్ చేయనున్నారని భోగట్టా. ఉత్తరాంధ్ర ప్రాంతంలోని ఓ విలేజ్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్ ఇదని సమాచారం. వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ సినిమా వచ్చే ఏడాది విడుదల కానుంది.


● రవితేజ


● సందీప్ కిషన్


● సుధీర్‌బాబు


● నాగశౌర్య


● వైష్ణవ్ తేజ్


● విశ్వక్ సేన్

భైరవకోన మిస్టరీ
శ్రీకృష్ణదేవరాయల కాలంలో చెలామణిలో ఉన్న గరుడ పురాణానికి, ఇప్పటి గరుడ పురాణానికి నాలుగు పేజీలు తగ్గాయట. ఆ గరుడ పురాణంలో మిస్ అయిన ఆ నాలుగు పేజీల కథే భైరవకోన అని హీరో సందీప్ కిషన్ అంటున్నారు. మరి.. ఆడియన్స్‌కు ఈ మిస్టరీ తెలియాలంటే థియేటర్స్‌కు రానున్న 'ఊరిపేరు భైరవకోన' సినిమా చూడాలి. సందీప్ కిషన్ హీరోగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో రూపొందిన సినిమా ఇది. రాజేష్ దండా నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.

రంగబలి రాజకీయం
రంగబలి అనే విలేజ్‌లో జరిగే ఘటనలు, రాజకీయ కోణాల నేపథ్యంలో రూపొందుతున్న చిత్రం 'రంగబలి'. నాగశౌర్య, యుక్తి తరేజ జంటగా నటిస్తున్నారు. ఈ సినిమాకు పవన్ బాసంశెట్టి దర్శకుడు. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం జూలై 7న విడుదల కానుంది.

కుప్పంలో హరోంహర
చిత్తూరు జిల్లా కుప్పంలో 'హరోంహర' అంటున్నారు సుధీర్‌బాబు. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న చిత్రం 'హరోం హర'. 1989 చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగే కథగా 'హరోం హర' సాగుతుంది. సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్న ఈ చిత్రం డిసెంబరు 22న రిలీజ్ కానుంది. తెలుగు, తమిళ, కన్నడం, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమాను విడుదల చేయాలనుకుంటున్నారు.


● నాగార్జున ● రామ్‌చరణ్

ఆదికేశవ ఆగమనం
రాయలసీమలోని ఓ గ్రామంలో ఉన్న దేవాలయంపై మైనింగ్ మాఫియా చూపు పడింది. ఈ మాఫియాకు అడ్డుగా నిలబడతాడు రుద్రకాళేశ్వర్ రెడ్డి. ఈ గ్రామాన్ని రుద్రకాళేశ్వర్ రెడ్డి ఏ విధంగా రక్షించాడు అనేది తెలుసుకోవాలంటే జూలైలో వచ్చే 'ఆదికేశవ' సినిమా చూడాలి. రుద్రకాళేశ్వర్ రెడ్డి పాత్రలో హీరోగా వైష్ణవ్ తేజ్ నటిస్తున్నారు. శ్రీలీల హీరోయిన్. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వంలో ఎస్. నాగవంశీ, సాయిసౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

స్మగ్లింగ్ నేపథ్యంలో...
కథ ప్రకారం రాజమండ్రి పరిసర ప్రాంతాల్లోని గ్రామాల్లో జరుగుతున్న స్మగ్లింగ్‌ను అడ్డుకోవాలనుకుంటున్నారట విశ్వక్ సేన్. 1994 నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. ఈ సినిమాకు కృష్ణ చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో కాస్త గ్రే షేడ్స్ ఉన్న హీరో క్యారెక్టర్‌లో విశ్వక్ సేన్ నటిస్తున్నారు. ఇది రూరల్ బ్యాక్‌డ్రాప్ ఫిల్మ్. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు.

వాస్తవ ఘటన ఆధారంగా....
'గంగతలపై ఉన్నంత వరకే శివుడు చల్లగా ఉంటాడు. కంట్లోంచి గానీ జారిందా శివమెత్తుతాడు' అనే పవర్ ఫుల్ డైలాగ్ సాయిరామ్ శంకర్ నోట వచ్చింది ఓ సినిమా కోసం. విలేజ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా రూపొందుతోంది. ప్రకాష్ జూరెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, రమణి జూరెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి మ్యూజిక్ మ్యాస్ట్రో ఇళయారాజా సంగీతం అందిస్తుండటం విశేషం.

ఇలా విలేజ్ బ్యాక్‌డ్రాప్ కథలతో ప్రేక్షకులను అలరించేందుకు మరి కొందరు హీరోలు రెడీ అవుతున్నారు.


● సాయిరామ్ శంకర్

ఒక వర్ణం చేరెలే...

'రెయిన్ బో చివరే.. ఒక వర్ణం చేరెలే...' అంటూ కారులో వెళుతూ, దారిలో కలిసినవారితో సరదాగా గడుపుతూ పాడుకుంటున్నారు సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్. ఈ ఇద్దరూ జంటగా నటించిన 'టక్కర్' చిత్రంలో పాట ఇది. సినిమాలో వచ్చే ఈ నాలుగో పాట వీడియోను శుక్రవారం రిలీజ్ చేశారు. చిత్ర సంగీతదర్శకుడు నివాస్ కె. ప్రసన్న స్వరపరచిన ఈ పాటకు కృష్ణకాంత్ సాహిత్యం అందించారు. బెన్నీ దయాల్, వృషబాబు పాడారు. కార్తీక్ జి. క్రిష్ దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్ పై అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ప్యాషన్ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 9న తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానుంది. ''ఈ చిత్రంలో సిద్ధార్థ్ సరికొత్త మేకోవర్‌తో కనిపిస్తారు. ఈ రొమాంటిక్ యాక్షన్ రైడ్ ఘనవిజయం సాధిస్తుందనే నమ్మకంతో ఉన్నాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మయాంక్.


● సిద్ధార్థ్, దివ్యాంశా కౌశిక్

బోటు డ్రైవర్..?

హీరో నాగచైతన్య బోటు డ్రైవర్‌గా మారనున్నారట. చందు మొండేటి దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా ఓ సినిమా రూపొందనుందనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. అల్లు అరవింద్ ఈ సినిమాను నిర్మించనున్నారట. ఈ సినిమా వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కనుందని, కథ రీత్యా నాగచైతన్య బోటు డ్రైవర్ పాత్రలో కనిపిస్తారనే వార్త తెరపైకి వచ్చింది. అంతేకాదు.. ఈ చిత్రం సూరత్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుందట. ఈ అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.


● నాగచైతన్య

ఓ సామాన్యుడి సంతకం

'కొత్త బంగారులోకం', 'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు', 'నారప్ప' వంటి సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు శ్రీకాంత్ అడ్డాల తర్వాతి చిత్రానికి 'పెద కాపు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమాతో విరాట్ కర్ణ హీరోగా పరిచయం అవుతున్నారు. మిర్యాల సత్యనారాయణ సమర్పణలో మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం ఇది. ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను శుక్రవారం రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌పై 'పెదకాపు 1' అని ఉంది. సో... ఈ సినిమా రెండు భాగాలుగా రానున్నట్లుగా తెలుస్తోంది. అలాగే పోస్టర్‌పై 'ఓ సామాన్యుడి సంతకం' అనే ట్యాగ్‌లైన్ ఉంది. ఈ సినిమా కథ 1990 నేపథ్యంలో సాగుతుందని తెలిసింది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.


● విరాట్ కర్ణ

ప్రేమ తగ్గిపోతుందా?


● చాందిని, అర్జున్

అర్జున్ అంబటి, చాందిని తమిళరసన్ జంటగా వెంకటరమణ మిద్దె స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న చిత్రం 'వెడ్డింగ్ డైరీస్'. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను రిలీజ్ చేశారు. ''విడిపోవాలనుకున్న భార్యాభర్తలు తమ ప్రేమను బలపర్చుకొని వైవాహిక బంధాన్ని ఎలా కొనసాగించారు? ఆ భార్యాభర్తల నడుమ ఎలాంటి సంఘర్షణ జరిగింది? అనేది ఈ సినిమాలోని మెయిన్ పాయింట్. 'పెళ్లి తర్వాత ప్రేమ తగ్గిపోతుందా..?' అనేది కాన్సెప్ట్'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

లవ్... క్రైమ్

ప్రదీప్ విరాజ్, దివ్య ఖుష్వా జంటగా మనోజ్ ఎల్లుమహంతి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు వి. సముద్ర కెమెరా స్విచ్చాన్ చేయగా, నిర్మాత రాహుల్ యాదవ్ నక్కా క్లాప్ ఇచ్చారు. బిజినెస్ మ్యాన్ రామ్ ఎర్రమ్ స్క్రిప్ట్‌ని చిత్రయూనిట్‌కు అందించారు. లవ్ అండ్ క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని బీఎన్‌కే (బంగారు నవీన్ కుమార్) నిర్మించనున్నారు. దర్శకుడు మనోజ్ మాట్లాడుతూ– ''క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలోని ప్రతి సీన్ ఉత్కంఠభరితంగా ఉంటుంది'' అన్నారు. ''అన్ని కమర్షియల్ అంశాలు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు బీఎన్‌కే. ఈ సినిమాకు కెమెరా: పంకజ్ తట్టోడ.


● ప్రదీప్, దివ్య

సరికొత్త కథతో...


● సాయి సునీల్, విశ్వక్ సేన్

విరాట్ కార్తీక్, యామినీ రాజ్, ప్రియాంక రెవ్రి హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రేమదేశపు యువరాణి'. సాయి సునీల్ నిమ్మల దర్శకత్వంలో ఆనంద్ వేమూరి, హరిప్రసాద్ సీహెచ్ నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ని హీరో విశ్వక్ సేన్ విడుదల చేశారు. ''లవ్, కామెడీ, మంచి ఎమోషన్స్‌తో ఓ సరికొత్త కథతో ఈ సినిమాని రూపొందించాం. అజయ్ పట్నాయక్ సంగీతం, శివ ఫొటోగ్రఫీ ఈ సినిమాకి ఓ హైలైట్'' అని సాయి సునీల్ నిమ్మల అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
119	46
62,547	18,534

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (శుక్ర రెండు రాత్రి 11.30 ముగింపు)

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	13,240	▲	139
డోజోన్స్	33,731	▲	669
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,607	▲	117
డాక్స్	16,051	▲	198
షాంఘై	3,230	▲	25
నికాయ్	31,524	▲	376

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
60,308	▲	151
బంగారం (99.5 స్వచ్ఛత)		
60,067	▲	151
వెండి (కిలో)		
71,372		0

తనిష్క్ 100 టన్నుల బంగారు మార్పిడి ఉత్సవాలు



హైదరాబాద్: టాటా గ్రూప్ ఆభరణాల బ్రాండ్ తనిష్క్– బంగారం మార్చుకోవడానికి సంబంధించి కీలక 1,00,000 కిలోల (100 టన్నులు) మైలురాయికి చేరుకుంది. ఈ మేరకు కంపెనీ ఒక ప్రకటన చేస్తూ, రెండు లక్షల మంది బంగారాన్ని మార్చుకున్నట్లు వెల్లడించింది. 'నేటి అధిక ధరలు, లాకర్లలో పడి ఉన్న పాత బంగారం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే, వినియోగదారులకు మార్పిడి మంచిది. ఇది దిగుమతులను తగ్గిస్తుంది కాబట్టి దేశ ఆర్థిక వ్యవస్థకూ శుభదాయకమే. పాత బంగారం మార్పిడి వేడుకల్లో మాతో చేరి, తమ పాత ఆభరణాలను మార్చుకోవాలని మేము ఈ సందర్భంగా అందర్నీ ఆహ్వానిస్తున్నాము'' అని టైటాన్ కంపెనీ లిమిటెడ్ జ్యువెలరీ విభాగం చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ అజోయ్ చావ్లా తెలిపారు. తనిష్క్‌లో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ఆఫర్ ఏడాది పొడవునా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని స్టోర్‌లలో అమలవుతుంది. 20 క్యారెట్లు, అంతకంటే ఎక్కువ పాత బంగారంపై 100% విలువను అందించే ఆఫర్ సంస్థ షాపింగ్ సైట్‌లో లభ్యమవుతుంది.

గ్రామీణ భారతంపై హ్యుందాయ్ ఇండియా దృష్టి



హైదరాబాద్: డిజిటల్ ఫ్లోట్ వ్యాన్ల ద్వారా గ్రామీణ కొనుగోలుదారులను ఆకర్షించాలని హ్యుందాయ్ ఇండియా వ్యూహరచన చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన ప్రకారం కారును స్వయంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రదర్శించడం ఈ చొరవ ఉద్దేశం. ఇందులో భాగంగా, గ్రాండ్ ఐ10 నియోస్‌ను వినియోగదారుల ఇళ్ల వద్దకే పంపాలని నిర్ణయించింది. 36 డిజిటల్ ఫ్లోట్‌లు వచ్చే రెండు నెలల్లో 27 రాష్ట్రాల్లోని దాదాపు 582 గ్రామీణ ప్రాంతాలను కవర్ చేయాలన్నది కంపెనీ లక్ష్యం. తెలుగు రాష్ట్రాల్లో 61 గ్రామీణ ప్రాంతాలను కవర్ చేయడానికి 4 డిజిటల్ ఫ్లోట్‌లను సిద్ధం చేసింది. తెలుగు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాలకు బయలుదేరిన డిజిటల్ ఫ్లోట్ వ్యాన్లను జెండా ఊపి ప్రారంభిస్తున్న కంపెనీ ప్రతినిధులను చిత్రంతో తిలకించవచ్చు. ''భారత్ డైనమిక్ మార్కెట్‌లో చివరి మైలు ను చేరుకోవడానికి వినూత్న విధానాలను అవలంబించాలని మేము విశ్వసిస్తున్నాము. ఉత్పత్తులను గ్రామీణ ప్రాంతాలకు విస్తరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాము'' అని హ్యుందాయ్ మోటార్ ఇండియా సీఓఓ తరుణ్ గార్గ్ పేర్కొన్నారు.

స్థానిక కరెన్సీల్లో వాణిజ్యానికి ప్రాధాన్యం

బ్రిక్స్ దేశాల తీర్మానం



కేప్ టౌన్: అంతర్జాతీయ వాణిజ్యంలో, ఆర్థిక లావాదేవీల్లో స్థానిక కరెన్సీలను వినియోగించాల్సిన అవసరం ఉందని బ్రిక్ కూటమి దేశాలు అభిప్రాయపడ్డాయి. నిబంధనల ఆధారిత స్వేచ్ఛా, పారదర్శక గ్లోబల్ వాణిజ్యానికి కట్టుబడి ఉండాలని పేర్కొన్నాయి. రెండు రోజుల పాటు జరిగిన బ్రిక్స్ కూటమి దేశాల విదేశీ వ్యవహారాల మంత్రుల సమావేశం సందర్భంగా 'ది కేప్ ఆఫ్ గుడ్ హోప్' పేరిట ఈ మేరకు ఒక సంయుక్త తీర్మానం విడుదల చేశాయి. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో పక్షపాత రహిత, పారదర్శక, స్వేచ్ఛాయుత బహుళపక్ష ట్రేడింగ్ వ్యవస్థకు పెద్ద పీట వేయాలని .. అభివృద్ధి చెందుతున్న దేశాలను ప్రత్యేకంగా పరిగణించాలని ఇందులో తెలిపాయి. పర్యావరణ పరిరక్షణ పేరిట దేశాలు ఏకపక్షంగా రక్షణాత్మక చర్యలకు పూనుకోవడం తగదని స్పష్టం చేశాయి. ఇలాంటివి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, వీటి వల్ల ప్రపంచ ఎకానమీపై ప్రతికూల ప్రభావం పడుతుందని బ్రిక్స్ దేశాలు తెలిపాయి. ఆంక్షలు, నిషేధాల రూపంలో ఆర్థికంగా ఇబ్బందులు పెట్టే చర్యలు చేపడుతుండటం వల్ల పరిస్థితి మరింత జటిలమవుతోందని పేర్కొన్నాయి. ఆర్థిక అభివృద్ధి, సామాజిక స్థిరత్వం, దేశ భద్రత, ప్రపంచవ్యాప్తంగా దేశాల సంక్షేమానికి ఇంధన భద్రతను సాధించడం కీలకమని తెలిపాయి. అయిదు అతి పెద్ద వర్ధమాన దేశాలైన భారత్, బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా.. బ్రిక్స్ కూటమిలో ఉన్నాయి.

కోల్ ఇండియా ఓఎఫ్‌ఎస్ సక్సెస్



న్యూఢిల్లీ: పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియాలో ప్రభుత్వం చేపట్టిన ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్‌ఎస్) విజయవంతమైంది. అటు సంస్థాగత ఇన్వెస్టర్లు, ఇటు రిటైలర్ల నుంచి భారీగా బిడ్స్ దాఖలయ్యాయి. వారాంతాన రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి 2.58 కోట్ల షేర్లకు, సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి 5.12 కోట్ల షేర్లకు దరఖాస్తులు లభించాయి. గురువారం సంస్థాగత ఇన్వెస్టర్ల నుంచి రూ. 6,500 కోట్ల విలువైన బిడ్స్ దాఖలైన సంగతి తెలిసిందే. వెరసి ప్రభుత్వానికి ప్రభుత్వానికి సుమారు రూ. 4,160 కోట్లు అందనున్నాయి. కంపెనీలో 3% వాటా విక్రయించేందుకు కేంద్రం ఓఎఫ్‌ఎస్‌ను చేపట్టింది. ఇందుకు రూ. 225 ఫ్లోర్ ధరను నిర్ణయించింది. ఓఎఫ్‌ఎస్‌లో భాగంగా ప్రభుత్వం తొలుత దాదాపు 1.5% వాటాను విక్రయానికి ఉంచింది. ఆఫర్‌కు అత్యధిక స్పందన లభిస్తే మరో 1.5 శాతం వాటాను సైతం విక్రయించేందుకు గ్రీన్ షూ ఆప్షన్ ఎంచుకుంది.

గెయిల్ చేతికి జేబీఎఫ్ కెమ్

- పూర్తి అనుబంధ సంస్థగా ఏర్పాటు
- రూ. 2,101 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: దివాలా చట్ట ప్రకారం జేబీఎఫ్ పెట్రోకెమికల్స్‌ను యుటిలిటీ రంగ పీఎస్‌యూ గెయిల్ ఇండియా చేజిక్కించుకుంది. ఇందుకు వీలుగా ప్రైవేట్ రంగ సాల్వెంట్ కంపెనీ జేబీఎఫ్‌లో రూ. 2,101 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. తద్వారా ఈ జూన్ 1 నుంచి సొంత అనుబంధ సంస్థగా మార్చుకుంది. జేబీఎఫ్‌ను కొనుగోలు చేసేందుకు మార్చిలో దివాలా చట్ట సంబంధ కోర్టు గెయిల్‌ను అనుమతించిన సంగతి తెలిసిందే. రుణ పరిష్కార ప్రణాళిక ప్రకారం జేబీఎఫ్‌కు ఈక్విటీ రూపేణా రూ. 625 కోట్లు, రుణాలుగా రూ. 1,476 కోట్లు అందించినట్లు గెయిల్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తాజాగా వెల్లడించింది. కాగా.. జేబీఎఫ్ కొనుగోలుకి ఇతర పీఎస్ యూ దిగ్గజాలు ఐవోసీ, ఓఎన్‌జీసీలతో పోటీపడి గెయిల్ బిడ్ చేసింది. రూ. 5,628 కోట్ల బకాయిల రికవరీకిగాను ఐడీబీఐ బ్యాంక్ దివాలా ప్రక్రియను చేపట్టింది.

కంపెనీ బ్యాక్‌గ్రౌండ్

జేబీఎఫ్ పెట్రోకెమికల్స్ 2008లో ఏర్పాటైంది. మంగళూరు సెజ్‌లో 1.25 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో ప్యూరిఫైడ్ టెరిప్తాలిక్ యాసిడ్(పీటీఏ) ప్లాంటును నెలకొల్పేందుకు కంపెనీకి ఐడీబీఐసహా ఇతర బ్యాంకులు రుణాలందించాయి. బీపీ సాంకేతిక మద్దతుతోపాటు 60.38 కోట్ల డాలర్ల రుణాలను మంజూరు చేశాయి. అంతేకాకుండా ముడిసరుకుగా నెలకు 50,000 టన్నుల పారాగ్జిలీన్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వ రంగ కెమికల్ సంస్థ ఓఎంపీఎల్ సైతం అంగీకరించింది. ప్రధానంగా జేబీఎఫ్ ఇండస్ట్రీస్ పాలియస్టర్ ప్లాంట్లకు అవసరమైన ముడిసరుకును రూపొందించేందుకు ఈ సంస్థ ఏర్పాటైంది. 2017లో కార్యకలాపాలు ప్రారంభించిన సంస్థ రుణ చెల్లింపుల్లో విఫలంకావడంతో అదే ఏడాది మూతపడింది. వెరసి కార్పొరేట్ దివాలా ప్రక్రియకు లోనైంది. కాగా.. గెయిల్ యూపీలోని పటాలో వార్షికంగా 8,10,000 టన్నుల సామర్థ్యంతో పెట్రోకెమికల్ ప్లాంటును కలిగి ఉంది. వచ్చే ఏడాదికల్లా మహారాష్ట్రలోని ఉసార్‌లో ప్రొపేన్ డీహైడ్రోజనేషన్ ప్లాంటును నిర్మించే లక్ష్యంతో ఉంది. తద్వారా ఏడాదికి 5,00,000 టన్నుల పాలీప్రొపిలీన్‌ను రూపొందించాలని ప్రణాళికలు వేసింది.

ఈ వార్తల నేపథ్యంలో గెయిల్ షేరు ఎన్‌ఎస్‌ఈలో 0.6 శాతం నీరసించి రూ. 105 వద్ద ముగిసింది.

విమాన టికెట్ల ధరలకు రెక్కలు

- ఉద్యోగుల్లో పెరిగిన అనిశ్చితి
- గోఫస్ట్ మూతపడడంతో మారిన పరిస్థితులు
- కార్యకలాపాల పునఃప్రారంభంపై చర్చలు



న్యూఢిల్లీ: గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ కార్యకలాపాలు నిలిపివేసిన తర్వాత ఈ పరిశ్రమలో పరిస్థితులు మారిపోయాయి. ముఖ్యంగా విమాన ప్రయాణికులపై చార్జీల భారం పెరిగింది. అన్ని ఎయిర్‌లైన్స్ సంస్థలు పలు మార్గాల్లో టికెట్ చార్జీలను పెంచేశాయి. గోఫస్ట్ దివాలా పరిష్కారం కోరుతూ ఎన్‌సీఎల్‌టీ ముందు పిటిషన్ దాఖలు చేసుకుంది. ఫలితంగా పౌర విమానయాన సేవల్లో కొంత పోటీ తగ్గింది. ఇది మిగిలిన ఎయిర్‌లైన్స్ సంస్థలకు అనుకూలించే పరిణామం కాగా, ఉద్యోగుల్లో అనిశ్చితి పెరిగింది. వారికి ఉద్యోగ భద్రత కరువైంది. మరోవైపు ప్రయాణికులపై చార్జీల భారం పడింది. ఈ పరిణామాలను నివారించేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) తన వంతు ప్రయత్నాలు ప్రారంభించింది. కార్యకలాపాల పునరుద్ధరణ ప్రణాళికలపై సంస్థ ఉన్నతోద్యోగులతో చర్చలు నిర్వహించింది. గోఫస్ట్ ఎయిర్‌లైన్స్ కింద మొత్తం 7,000 వరకు పనిచేస్తున్నారు. ఇందులో ఒక వర్గం ఉద్యోగులు సంస్థ కార్యకలాపాలు తిరిగి ప్రారంభం అయ్యే విషయంలో ఆశావహంగా ఉన్నారు. మరో వర్గం ఉద్యోగులు మాత్రం కింగ్‌ఫిషర్ ఎయిర్‌లైన్స్, జెట్ ఎయిర్‌వేస్ పరిణామాలను గుర్తు తెచ్చుకుని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైలట్లలో ఎక్కువ మంది ఇతర సంస్థల్లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ప్రాట్ అండ్ విట్నీ ఇంజిన్లలో సమస్యలతో సగం విమానాలు అందుబాటులో లేకపోవడం వల్ల నిర్వహణ అసాధ్యమంటూ.. గోఫస్ట్ తన కార్యకలాపాలను మే 3 నుంచి నిలిపివేయడం గమనార్హం. గోఫస్ట్ దివాలా పిటిషన్‌ను ఆ సంస్థకు విమానాలను లీజుకు ఇచ్చిన సంస్థలు సవాలు చేయడం తెలిసిందే.

22 శాతం పెరుగుదల

విమాన సర్వీసుల లభ్యత తగ్గడం టికెట్ చార్జీలు పెరగడానికి దారితీసినట్టు క్లియర్‌ట్రిప్ వైస్ ప్రెసిడెంట్ గౌరవ్ పట్వారీ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా డీ15 ప్రయాణ చార్జీలు 22 శాతం (ఏప్రిల్‌తో పోల్చినప్పుడు) పెరిగినట్టు తెలిపారు. అంటే తదుపరి 15 రోజుల్లో ప్రయాణ సర్వీసులపై రేట్లు పెరిగినట్టు అర్థం చేసుకోవాలి. సాధారణంగా వేసవి సీజన్ ఎయిర్‌లైన్స్ సంస్థలకు రద్దీగా ఉంటుంది. ఈ సమయంలో గోఫస్ట్ సేవలు నిలిపివేయడంతో ఒక్క రోజులో చేసే ప్రయాణ టికెట్ల బుకింగ్‌లపై రేట్లు 40 శాతం వరకు పెరిగినట్టు పట్వారీ తెలిపారు. జూన్ చివరి వరకు ఇదే పరిస్థితి కొనసాగొచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

మెటల్, ఆటో షేర్లకు డిమాండ్

- రెండు రోజుల నష్టాలకు చెక్
- వారాంతాన స్వల్ప లాభాల ముగింపు



ముంబై: మెటల్, ఆటో, బ్యాంకింగ్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు శుక్రవారం స్వల్పలాభపడ్డాయి. అమెరికా ఉద్యోగ గణాంకాల వెల్లడి, కేంద్ర బ్యాంకుల వడ్డీ రేట్ల పెంపు ఆందోళనల నేపథ్యంలో ఇన్వెస్టర్లు ఆచితూచి వ్యవహరించారు. ఉదయం సెన్సెక్స్ 173 పాయింట్ల పెరిగి 62,602 వద్ద, నిఫ్టీ 63 పాయింట్లు బలపడి 18,551 వద్ద మొదలయ్యాయి. సానుకూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు మిడ్ సెషన్‌లో కొంత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న సానుకూల సంకేతాలు కలిసి రావడంతో తిరిగి లాభాల బాటపట్టాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 340 పాయింట్ల పరిధిలో 62,380 వద్ద కనిష్టాన్ని, 62,720 వద్ద గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 18,478 – 18,574 శ్రేణిలో ట్రేడైంది. ఆఖరికి సెన్సెక్స్ 119 పాయింట్లు బలపడి 62,547 వద్ద ముగిసింది. నిఫ్టీ 46 పాయింట్లు పెరిగి 18,534 వద్ద నిలిచింది. బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు అరశాతానికి పైగా లాభపడ్డాయి. ఐటీ, వినిమయ, ఇంధన షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 45 పాయింట్లు, నిఫ్టీ 35 పాయింట్లు స్వల్పంగా లాభపడ్డాయి. ''అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. దేశీయంగా మే నెల ఆటో అమ్మకాలు మెరుగ్గా ఉండటం, జీఎస్‌టీ ఆదాయ వృద్ధి, తయారీ కార్యకలాపాలను సూచించే పీఎంఐ సూచీ 31 నెలల గరిష్టానికి చేరుకోవడం వంటి అంశాలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను పెంచాయి'' అని మోతీలాల్ ఓస్వాల్ సర్వీసెస్ రిటైల్ రీసెర్చ్ హెడ్ సిద్ధార్థ ఖేమా తెలిపారు.



భారత 'ఎ' జట్టులో త్రిష, అనూషలకు చోటు

మహిళల ఎమర్జింగ్ ఆసియా కప్ -2023లో లో పాల్గొనే భారత మహిళల 'ఎ' జట్టును శుక్రవారం బీసీసీఐ ప్రకటించింది. హైదరాబాద్‌కు చెందిన గొంగడి త్రిష, ఆంధ్ర ప్లేయర్ బరెడ్డి అనూషలకు ఇందులో చోటు దక్కింది. 14 మంది సభ్యుల ఈ జట్టుకు శ్వేత సెహ్రావత్‌ను కెప్టెన్‌గా, సౌమ్య తివారిని వైస్ కెప్టెన్‌గా ఎంపిక చేశారు. నూషీన్ అల్ ఖదీర్ ఈ జట్టుకు కోచ్‌గా వ్యవహరిస్తుంది. ఈ నెల 13నుంచి హాంకాంగ్‌లో జరిగే టోర్నీలో ఎనిమిది జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. భారత్‌తో పాటు హాంకాంగ్, థాయిలాండ్ పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, మలేసియా, యూఏఈ పాల్గొంటున్నాయి.



లక్ష్యసేన్ సెమీస్‌కు...

థాయ్‌లాండ్ ఓపెన్



బ్యాంకాక్: భారత షట్లర్లకు థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. పురుషుల సింగిల్స్‌లో స్టార్ ప్లేయర్ లక్ష్యసేన్ సెమీఫైనల్లోకి దూసుకెళ్లగా... యువ షట్లర్ కిరణ్ జార్జి పోరాటం క్వార్టర్స్‌లోనే ముగిసింది. గురువారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో లక్ష్యసేన్ 21–19, 21–11తో మలేసియాకు చెందిన లియాంగ్ జున్ హావొపై అలవోక విజయం సాధించాడు. తొలి గేమ్‌లో ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ నెట్ వద్ద చురుకైన ప్రదర్శన కనబరిచిన లక్ష్యసేన్ స్మాష్‌లతో రాణించాడు. ఇక రెండో గేమ్‌నయితే భారత స్టార్ ఏకపక్షంగా వశం చేసుకున్నాడు. చివరకు 41 నిమిషాల్లో ప్రత్యర్థి ఆటకట్టించాడు. శనివారం జరిగే సెమీఫైనల్లో లక్ష్యసేన్... స్థానిక ఆటగాడు, రెండో సీడ్ కున్లావుత్ వితిద్సర్న్ (థాయ్‌లాండ్)తో తలపడతాడు. మరో క్వార్టర్స్‌లో క్వాలిఫయర్ కిరణ్ 16–21, 17–21 టొమా జూనియర్ పొపొవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యాడు.

పట్టు బిగించిన ఇంగ్లండ్



పోప్

లండన్: ఐర్లాండ్‌తో జరుగుతున్న ఏకైక టెస్టులో ఇంగ్లండ్ రెండో రోజే శాసించే స్థితికి చేరింది. శుక్రవారం 152/1 ఓవర్‌నైట్ స్కోరుతో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌ను 82.4 ఓవర్లలో 524/4 స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. ఓవర్‌నైట్ బ్యాటర్లు ఒలీ పోప్ (205; 22 ఫోర్లు, 3 సిక్సర్లు) డబుల్ సెంచరీ, డకెట్ (182; 24 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో కదం తొక్కారు. జో రూట్ (56; 4 ఫోర్లు, 1 సిక్స్) రాణించాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 352 పరుగుల ఆధిక్యం పొందింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన ఐర్లాండ్ ఆట నిలిచే సమయానికి 3 వికెట్లు కోల్పోయి 97 పరుగులు చేసింది. టెక్టర్ (33 బ్యాటింగ్), టక్కర్ (21 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. జోష్ టంగ్‌కు 3 వికెట్లు దక్కాయి. ప్రస్తుతం ఐర్లాండ్ మరో 255 పరుగులు వెనుకబడి ఉంది.

దాచిన కీచక పర్వాలెన్నో...

- ఎన్నో సార్లు లైంగిక వేధింపులు ఎదుర్కొన్నాం
- బ్రిజ్‌భూషణ్‌పై రెజ్లర్ల తీవ్ర ఆరోపణలు
- ఎఫ్‌ఐఆర్‌లో సంచలన వివరాలు



నేను దోషిగా తేలితే నన్ను ఉరి తీయండి, నేను ఏ తప్పూ చేయలేదు... రెజ్లర్ల నిరసన మొదలైన రోజునుంచి భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ చెబుతున్న మాట... ఏమైనా సాక్ష్యాలు ఉంటే చూపించండంటూ అతనికి మద్దతు ఇస్తున్నవారి వ్యాఖ్యలు... ఇప్పటి వరకు బహిరంగ వేదికలపైనే నిరసనలు కనిపించగా, అసలు రెజ్లర్లు ఏమని ఫిర్యాదు చేశారో, పోలీసులు ఆ స్టేట్‌మెంట్‌లను ఎలా రికార్డు చేశారో స్పష్టత లేదు. అయితే మెల్లగా ఒక్కో విషయం వెలుగులోకి వస్తోంది. బ్రిజ్‌భూషణ్ చేసిన పనుల గురించి, రెజ్లర్లు అనుభవించిన వేదన గురించి కొత్త అంశాలు వెల్లడవుతున్నాయి. ఒకటి, అరా మామూలు ఆరోపణలు కాదు... ఆ వ్యక్తి మహిళా రెజ్లర్లతో ఎలా వ్యవహరించాడనేది పోలీసులు నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లో వివరంగా ఉంది. ఈ ఎఫ్‌ఐఆర్‌తో కేసు కీలక మలుపు తిరగడం ఖాయం.



న్యూఢిల్లీ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు సంబంధించి బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌పై నమోదైన ఎఫ్‌ఐఆర్‌లో పలు తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. అనుచిత రీతిలో అమ్మాయిలను తాకడం మొదలు వారినుంచి సెక్స్‌ను ఆశించడం వరకు వేర్వేరు అంశాలు ఇందులో కనిపిస్తున్నాయి. బ్రిజ్‌భూషణ్‌పై ఐపీసీ 34, ఐపీసీ 354తో పాటు పోక్సో చట్టం (సెక్షన్ 10) కింద కేసులు నమోదయ్యాయి. ఎఫ్‌ఐఆర్‌లో వేర్వేరు రెజ్లర్లు వేర్వేరు సమయాల్లో జరిగిన కనీసం 15 ఘటనల గురించి ప్రస్తావించారు. బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులతో తమ అమ్మాయి మానసికంగా దెబ్బ తిందని, ఇప్పటికీ కోలుకోలేదని ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్ తండ్రి పేర్కొన్నాడు. వాటిలో కొన్నింటిని వారి మాటల్లోనే వింటే...

- 'హోటల్ రెస్టారెంట్‌లో భోజనానికి వెళ్లిన సమయంలో ఆయన తన డిన్నర్ టేబుల్‌పైకి నన్ను విడిగా పిలిచాడు. ఛాతీ పైన చేతులు వేసి తన వైపు లాక్కోవడం, ఛాతీ కింది భాగంలో తడమడం ...ఇలా 3-4 సార్లు చేయడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యాను. ఆయన ఆఫీస్‌లో కూడా ఇదే తరహాలో వ్యవహరించడంతో భయంతో వణికిపోయాను'
- 'నేను ప్రాక్టీస్ మ్యాట్‌పై పడుకొని ఉన్న సమయంలో కోచ్ లేని సమయం చూసి నా వద్దకు వచ్చిన ఆయన ఒక్కసారి నా టీ షర్ట్ తీసేసి శరీరమంతా తడుముతూ ఊపిరి చెక్ చేస్తున్నానని చెప్పాడు. ఒక సారి ఆఫీస్ లోపలికి పిలిచాడు. నాతో పాటు ఉన్న మా అన్నను బయటకు పంపించి తలుపు మూసేసి అనుచితంగా ప్రవర్తించాడు'
- 'ఆరంభంలో నా వద్ద మొబైల్ ఫోన్ లేకపోవడంతో తన ఫోన్‌తో మా తల్లిదండ్రులతో మాట్లాడించే సాకుతో తన గదిలోకి పిలిచి గట్టిగా కౌగిలించుకున్నాడు. తాను చెప్పినట్లు సెక్స్‌కు అంగీకరిస్తే రెజ్లర్లకు అవసరమైన సప్లిమెంట్‌లు ఇస్తానని కూడా చెప్పారు'
- 'నాతో కూడా భోజన సమయంలో పూర్తిగా ఇబ్బందికరంగా ప్రవర్తించాడు. అప్పటినుంచి భయం వేసి డిన్నర్‌కు విడివిడిగా కాకుండా బృందాలుగా వెళ్లాలని నిర్ణయించుకున్నాం'
- మేం ఒకసారి టీమ్ ఫోటో తీసుకుంటున్నాం. నేను చివర్లో నిలబడ్డా. ఒక్కసారిగా నా వద్దకు వచ్చి నా వెనక భాగంలో చేతులు వేయడం మొదలు పెట్టాడు. నిర్ఘాంతపోయిన నేను దూరం జరిగే ప్రయత్నం చేసినా భుజాలపై చేతులు వేసి దగ్గరకు లాక్కున్నాడు'
- 'నాతో కూడా ఫోటో దిగే సమయంలో అసభ్యంగా ప్రవర్తించాడు. నేను అతడిని నిరోధిస్తూ పూర్తి బలంతో తప్పించుకునే ప్రయత్నం చేయగా...చాలా అతి చేస్తున్నావు, మున్ముందు పోటీల్లో పాల్గొనాలని లేదా అని హెచ్చరించాడు'

1983 బ్యాచ్ మద్దతు...

రెజ్లర్లకు మద్దతు ఇస్తున్నవారిలో 1983 వరల్డ్ కప్ నెగ్గిన భారత మాజీ క్రికెటర్లు చేరారు. కపిల్‌దేవ్ నేతృత్వంలో ఈ బృందం సంయుక్తంగా ఒక ప్రకటన జారీ చేసింది. 'మన చాంపియన్ రెజ్లర్ల పట్ల వ్యవహరించిన తీరు చూస్తే చాలా బాధ వేసింది. వారి ఫిర్యాదులు విని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అయితే తమ పతకాలను పడేయడం వంటి తీవ్రమైన పనులు చేయవద్దని రెజ్లర్లను కోరుతున్నాం. ఎన్నో ఏళ్ల శ్రమ, పట్టుదల, త్యాగాల ఫలితం ఆ పతకాలు' అని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే ఈ 'సంయుక్త ప్రకటన'తో తనకు సంబంధం లేదని, తాను ఎలాంటి ప్రకటన జారీ చేయలేదని ఈ జట్టులో సభ్యుడైన బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ స్పష్టం చేశారు. మరో వైపు నిందితుడిని ప్రధాని మోదీ రక్షిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. '25 అంతర్జాతీయ పతకాలు తెచ్చిన మన బిడ్డలు న్యాయం కోసం వీధికెక్కారు. 15 తీవ్ర ఆరోపణలతో రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదైన వ్యక్తి ప్రధాన రక్షణ కవచంలో ఉన్నాడు' అని రాహుల్ ట్వీట్ చేశారు.



ప్రిక్వార్టర్స్‌లో సబలెంక, జొకోవిచ్



- మూడో సీడ్ పెగులా అవుట్
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో సెర్బియా స్టార్ నొవాక్ జొకోవిచ్ ప్రిక్వార్టర్స్‌లో ప్రవేశించాడు. అయితే శుక్రవారం పురుషుల, మహిళల విభాగాల్లో సంచలన ఫలితాలు నమోదయ్యాయి. అమెరికన్ అమ్మాయి మూడో సీడ్ జెస్సికా పెగులా ఆట మూడో రౌండ్లోనే ముగిసింది. పురుషుల ఈవెంట్‌లో రష్యన్ ప్లేయర్, ఏడో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్‌పై అన్‌సీడెడ్ సానెగో అద్భుత విజయం సాధించాడు. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్ జొకోవిచ్ మూడో రౌండ్లో వరుస సెట్లలో గెలుపొందాడు. కానీ స్పెయిన్ ఆటగాడు డెవిడోవిచ్ ఫొకినా ప్రతీ సెట్‌లోనూ గట్టి పోటీ ఇచ్చాడు. దీంతో తొలి రెండు సెట్లు కైవసం చేసుకునేందుకు జొకోవిచ్ టైబ్రేక్ ఆడక తప్పలేదు. 3 గంటల 36 నిమిషాల పాటు జరిగిన ఈ మ్యాచ్‌లో చివరకు జొకోవిచ్ 7–6 (7/4), 7–6 (7/5), 6–2 స్కోరుతో 29వ సీడ్ ఫొకినాపై గెలిచాడు. మిగతా మ్యాచ్‌ల్లో ఏడో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) 7–5, 6–0, 3–6, 6–7 (5/7), 3–6తో లొరెంజొ సానెగో (ఇటలీ) చేతిలో కంగుతిన్నాడు. సానెగొకు తన కెరీర్‌లో టాప్–10 ప్లేయర్‌ను ఓడించడం ఇది ఆరోసారి! ఇటలీకి చెందిన ప్రపంచ 48వ ర్యాంకర్ సానెగో ప్రిక్వార్టర్ ఫైనల్లో 11వ సీడ్ కరెన్ ఖచనొవ్ (రష్యా)తో తలపడతాడు. మూడో రౌండ్లో ఖచనొవ్ 6–4 6–1, 3–6, 7–6 (7/5)తో కొక్కినకిస్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు.

సబలెంక అలవోకగా...


మహిళల సింగిల్స్‌లో బెలారస్ స్టార్ సబలెంక అలవోక విజయంతో ప్రిక్వార్టర్స్ చేరింది. మూడో రౌండ్‌లో రెండో సీడ్ సబలెంక 6–2, 6–2తో కమిల్లా రఖిమొవ (రష్యా)పై విజయం సాధించింది. జెస్సికా పెగులా (అమెరికా) 1–6, 3–6తో 28వ సీడ్ ఎలైస్ మెర్టెన్స్ (బెల్జియం) చేతిలో చిత్తుగా ఓడింది. తొమ్మిదో సీడ్ దారియా కసత్కినా (రష్యా) 6–0, 6–1తో పెటన్ స్టియర్న్స్ (అమెరికా)పై, ఎలినా స్వితొలినా (ఉక్రెయిన్) 2–6, 6–2, 7–5తో అన్నా బ్లింకొవా (రష్యా)పై గెలుపొందగా... పవ్ల్యుచెంకొవా (రష్యా) 4–6, 6–3, 6–0తో 24వ సీడ్ పొటపొవా (రష్యా)కు షాకిచ్చింది. పురుషుల డబుల్స్‌లో భారత్ పోరాటం ముగిసింది. రెండో రౌండ్లో సాకేత్ మైనేని–యూకీ బాంబ్రీ జోడీ 4–6, 5–7తో తొమ్మిదో సీడ్ గొంజాలెజ్ (మెక్సికో)–రోజర్ వాసెలిన్ (ఫ్రాన్స్) జంట చేతిలో పరాజయం చవిచూసింది.

చాంప్ శాన్విత-కోయిమిచ్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) జూనియర్ టోర్నీలో తెలంగాణ అమ్మాయి నూకల శాన్వితా రెడ్డి డబుల్స్ విభాగంలో విజేతగా నిలిచింది. ఉగాండా రాజధాని కంపాలాలో జరిగిన ఈ టోర్నీలో జర్మనీకి చెందిన మిచెలి కోయిమిచ్‌తో జోడీ కట్టిన శాన్విత టైటిల్ సాధించింది. శుక్రవారం జరిగిన బాలికల డబుల్స్ ఫైనల్లో భారత్–జర్మనీ జంట 3–6, 6–4, 10–4తో సీహా మహాజన్ (భారత్)– లీలియా అకోమిటోవా (రష్యా) జోడీపై విజయం సాధించింది. అంతకుముందు జరిగిన క్వార్టర్స్‌లో శాన్విత–కోయిమిచ్ 6–1, 6–0తో అజం కపూరి–తమన్న వాలియాపై నెగ్గారు. సెమీఫైనల్లో 6–2, 6–3తో సహన మార్టిన్‌మహో– శిఖ మకేనా తోమేగా (టాంజానియా) జంటపై గెలుపొందారు.

పాల నురగకు బంగారం అద్దినట్టు..



ఆకాశంలో పాల నురగలా అల్లుకున్న 'పాల పుంత'.. దిగువన అబ్బురమనిపించేలా బంగారు రంగు కాంతులు వెదజల్లుతున్న 'ధ్రువ కాంతులు (అరోరా)'.. కింద నీటిలో ఆ కాంతుల ప్రతిబింబం.. వావ్ అనిపించేలా ఉంది కదూ. టామ్ రే అనే ఫొటోగ్రాఫర్ న్యూజిలాండ్‌లోని లేక్ టెకపో వద్ద ఈ చిత్రాన్ని క్లిక్ మనిపించారు. క్యాప్చర్ ది అట్లాస్ సంస్థ ఏటా ఇచ్చే 'మిల్కీవే ఫొటోగ్రాఫర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును ఈ చిత్రం సొంతం చేసుకుంది. ఇటీవలే జరిగిన ఈ పోటీకి 3వేలకు పైగా ఫొటోలు రాగా.. అందులో అద్భుతమైన 25 చిత్రాలను ఎంపిక చేసి అవార్డులు ఇచ్చారు.

నేటినుంచి యాదాద్రిలో ప్రత్యేక కార్యక్రమాలు



యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈవో గీతారెడ్డి శుక్రవారం తెలిపారు. 3వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు దీపోత్సవం, 6వ తేదీ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రచార కార్యక్రమం, 7వ తేదీ ఉదయం 11 గంటలకు దాతలతో సమన్వయ కార్యక్రమం, 9వ తేదీన ఉదయం 10 గంటలకు దేవస్థాన భూములకు బోర్డుల ఏర్పాటు, 10వ తేదీ ఉదయం 10 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం, 13వ తేదీ సాయంత్రం 6గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, 14వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గోపూజ, శ్రమదానం, హరితహారం, 16వ తేదీ ఉదయం 9 గంటలకు చండీహోమం, లలితా సహస్రనామ పారాయణం, 17వ తేదీ ఉదయం 5.30 గంటలకు గిరిప్రదక్షిణ, నగర సంకీర్తన, 18వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్య శిబిరం నిర్వహణ, 21వ తేదీ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు కవి సమ్మేళనం, 22వ తేదీన ఉదయం 8 గంటలకు శ్రీసుదర్శన నారసింహ హోమం, అమరవీరుల కుటుంబాలకు సత్కారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

వెయ్యేళ్ల లక్ష్మీదేవి ఆలయం

- గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి
- మట్టి, దంగు సున్నం లేకుండా ఇటుకల తయారీలో ఇంజనీరింగ్ నైపుణ్యం

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం ఇప్పగూడెం గ్రామ శివారులోని పురాతన నాగులమ్మ దేవాలయంలో దాదాపు వెయ్యేళ్ల నాటి లక్ష్మీదేవి ఆలయం వెలుగుచూసింది. ఈ మేరకు తను గుర్తించిన పలు విషయాలను చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి శుక్రవారం వివరించారు. 'కాకతీయుల కాలంలో నిర్మించిన నాగులమ్మ గుడిలో ద్వికూటాలయానికి మరమ్మతులు చేస్తున్నారు. గుడిచుట్టూ మట్టిని తొలగిస్తుండగా సూర్యుడి విగ్రహం, 13వ శతాబ్దం నాటి శిలాశాసనం బయటపడ్డాయి. ఆ శాసన పాఠం అచ్చుతీసి శాసన పరిష్కర్త కె.మునిరత్నంనాయుడు, ఆర్కియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా మైసూర్‌కు పంపించగా పూర్తి వివరాలు తెలిశాయి. సుమారు ఐదడుగుల ఎత్తైన ఏకశిలపై రాసిన శాసనంలో.. కాకతీయుల కాలంలోని మహాప్రధాని లక్ష్మీదేవికి రంగభోగాలకు భూమిని దానం చేసినట్లు తెలిసింది. ఆ శాసనంపై 'తుసము, దునెనిమిదిసమ, గూతి శ్రీలక్ష్మీ, రంగభోగలకు, విచ్చితి, మహాప్రధాని, క్రయమాత, ముక్య, నానకు' అనే పదాలు ఉన్నాయని తెలిపారు.

ఇటుకల తయారీలో ఇంజనీరింగ్ నైపుణ్యం

ఇక్కడి ఇటుకల్లో అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యం ఉందని, మట్టి, డంగు సున్నం లేకుండా తయారు చేశారని తెలిపారు. ఆలయం ముందున్న పాటిగడ్డ మీద శాతవాహనుల కాలం నాటి రుబ్బురోలు లభించిందని, అక్కడే కాకతీయుల కాలం నాటి శిథిల దేవాలయం ఆనవాళ్లు కనిపించాయని తెలిపారు.



తవ్వకాల్లో బయటపడిన సూర్యుడి విగ్రహం. (ఇన్‌సెట్‌లో) ఇటుకలను చూపిస్తున్న రత్నాకర్‌రెడ్డి

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.